

శివరాత్రి శోభ

జిల్లావ్యాప్తంగా శివరాత్రి శోభ సంతరించుకుంది. పండుగకు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్నాయి. బుధవారం వేకువజాము నుంచే పూజలు, అభిషేకాలు ప్రారంభంకానున్నాయి. భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ పాలకవర్గాలు, దేవదాయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు



విద్యుత్ దీపాల అలంకరణలో త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం

వైసీపీ ఖాళీ

బాలినేని వెంట జనసేనలో చేరిన 20మంది ఒంగోలు కార్పొరేటర్లు

- ఫలించని అధినేత జగన్ ప్రయత్నాలు
- ప్లీనరీలో ఇతరత్రా నాయకులు చేరే అవకాశం?
- నియోజకవర్గాలవారీ ప్రణాళికలు రూపొందిస్తున్న కూటమి నేతలు
- ఒంగోలు కార్పొరేషన్‌లో నాలుగుకు పడిపోయిన వైసీపీ సభ్యుల బలం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటం, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కూడా తెలుగుదేశం పార్టీకి అనూహ్య విజయం లభించడంతో పార్టీల మార్పు ప్రక్రియ ప్రారంభమైంది. స్థానిక సంస్థల్లో వైసీపీ ఆధిపత్యానికి చెక్ పెట్టే విధంగా టీడీపీ నాయకులు ముందుకు కదిలారు. ఒంగోలు, కార్పొరేషన్, గిద్దలూరు మునిసిపాలిటీల్లో టీడీపీ ఎమ్మెల్యేలు జనార్దన్, అశోకొరెడ్డి.. మేయర్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను చేర్చుకొని ఆపార్టీ పెత్తనానికి గండికొట్టారు. ఇటీవల మార్కాపురం మునిసిపాలిటీలో కూడా 12మంది కౌన్సిలర్లు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఇక మండల పరిషత్‌లలో వైసీపీకి గండిపడే ప్రక్రియ కూడా ప్రారంభమైంది. త్రిపురాంతకం మండల పరిషత్‌లో టీడీపీ అభ్యర్థి పాగా వేయడం అందుకు

మిగతా 6వ పేజీలో

జిల్లాలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులను నిలబెట్టుకునేందుకు వైసీపీ అధినేత జగన్ ఇటీవల చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీలో ఉన్న 24మంది కార్పొరేటర్లలో 20మంది మంగళవారం మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జనసేనలో చేరడం అందుకు నిదర్శనం. ఇప్పటికే జిల్లాలోని కొందరు వైసీపీ నేతలు పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. మరికొందరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా జనసేనలో కూడా చేరికలు పెరిగిపోవడం వైసీపీకి ఊహించని షాక్‌గా చెప్పుకోవచ్చు. అటు టీడీపీ, ఇటు జనసేనలో మరికొందరు చేరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ భయంతోనే వైసీపీ అధినేత జగన్ ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్‌ను ఉద్దేశించి మెడలో కండువాను మర్చిపోయారా.. మార్చేయాలనుకున్నారా? అని వ్యాఖ్యానించినట్లు భావిస్తున్నారు.

పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన అనంతరం మాజీ మంత్రి బాలినేనితో వైసీపీ కార్పొరేటర్లు





వసూళ్ల రవికిరణం



ఏఆర్ ఎస్ఐగా ఉద్యోగం.. స్టేషన్‌లలో సెటిల్‌మెంట్లు

ఆర్మ్‌డ్ రిజర్వు(ఏఆర్)లో పనిచేస్తున్న ఎస్ఐ వసూల్ రాజా అవతారం ఎత్తాడు. స్టేషన్‌లలోనే అనేక కేసులను సెటిల్‌మెంట్ చేశాడు. ఇరుపక్షాల నుంచి భారీగా డబ్బులు దండుకున్నాడు. తాను ఒంగోలులోని కీలక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐని అని చెప్పి వైద్యశాలలు, గ్రానైట్ వ్యాపారులు, ఇంజనీరింగ్ కళాశాలల యజమానులు, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకుల నుంచి పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడ్డాడు. గత వైసీపీ పాలనలో ఆయన అవినీతి వ్యవహారం నిర్విఘ్నంగా కొనసాగింది. నెలక్రితం ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల యజమాని నుంచి రూ.2లక్షలు తీసుకున్న ఆయన అడ్డంగా దొరికిపోయాడు. విషయం తెలుసుకున్న ఓ సీఐ ఆరా తీయడంతో అయ్యగారి బాగోతాలు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. దీంతో సదరు అవినీతి రవికిరణం వ్యవహారాన్ని ఎస్పీ దామోదర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. తీవ్రంగా పరిగణించిన ఆయన చర్యలకు సిఫార్సు చేసినట్లు సమాచారం.

- పోలీసు అధికారుల పేర్లు చెప్పి దండుడే
- అతని దందాలపై ఎస్పీకి ఫిర్యాదు చేసిన సీఐ
- చర్యలు తీసుకోవాలని ఐజీకి దామోదర్ లేఖ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్ర జ్యోతి): ఆర్మ్‌డ్ రిజర్వులో ఉద్యోగం చేస్తూ తాలూకా పోలీసు స్టేషన్‌లో ఎస్ఐనని చెప్పుకుని వసూళ్ల రవికిరణం అనేక దందాలకు పాల్పడ్డాడు. అవన్నీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. నెల క్రితం ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల యజమానికి ఫోన్ చేసి తాను ఫలానా స్టేషన్ ఎస్ఐని అంటూ పరిచయం చేసుకున్నాడు. తమ స్టేషన్‌లో ఖర్చులు ఉన్నాయి.. సీఐ గారు మాట్లాడమన్నారు అని చెప్పారు. ఆయన్ను ఒప్పించి రూ.2లక్షల నగదు తెచ్చుకున్నాడు.

సీఐ ఆరాతో బట్టబయలు

కళాశాల యజమాని నుంచి రూ.2లక్షలు వసూలు చేసిన విషయం సీఐ దృష్టికి రావడంతో ఆయన కాస్త కంగారు పడ్డారు. వెంటనే కళాశాల యజమానికి ఫోన్ చేసి.. ఆయనకు కాల్ చేసిన వ్యక్తి నంబరు సేకరించారు. దీంతో వసూళ్ల వ్యవహారం బట్టబయలైంది. ఏఆర్ ఎస్ఐని వెంటనే

మిగతా 6వ పేజీలో

మచ్చుకు కొన్ని ఉదాహరణలు ఇవీ..

నగరంలో పేరు ఉన్న చర్మవ్యాధుల డాక్టర్ వద్దకు వెళ్లిన ఏఆర్ ఎస్ఐ.. ఫలానా చోట అయ్యప్ప భజన ఉందని వారికి కొంత సహాయం కావాలని అడిగాడు. ఓ గ్రానైట్ వ్యాపారికి ఫోన్ చేసి స్టేషన్ ఖర్చులకు కొంత నగదు పంపించాలని కోరాడు. ఓ ప్రైవేటు పాఠశాల యజమాని వద్దకు వెళ్లి మా ఉన్నతాధికారి ఓ గ్రామంలో చర్చి కడుతున్నారు.. అందుకు సహాయం కావాలని కోరాడు. రాజకీయ పలుకుబడి ఉన్న ఓ డాక్టర్ వద్దకు వెళ్లి స్టేషన్ ఖర్చులంటూ నగదు డిమాండ్ చేశాడు. ఇలా అనేక రకాలుగా గత ప్రభుత్వ హయాం నుంచి ఏఆర్ ఎస్ఐ లక్షల్లో దందాలకు పాల్పడినట్లు తేలింది.

పొగాకు కొనుగోళ్లకు ముహూర్తం ఖరారు

- రాష్ట్రంలో మూడు దశల్లో వేలం
- వచ్చే నెల10న తొలి విడత ప్రారంభం
- బోర్డు వైస్‌చైర్మన్‌గా జిల్లాకు చెందిన బ్రహ్మయ్య ఎంపిక



బ్రహ్మయ్య

ఒంగోలు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లకు ముహూర్తం ఖరారైంది. మూడు విడతలుగా వేలం ప్రారంభించనున్నారు. అందులో దక్షిణాదిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 11 వేలం కేంద్రాల్లో తొలి విడత చేపట్టనున్నారు. ఆ మేరకు గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో రైతు, వ్యాపార ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. గత ఏడాది ఫిబ్రవరి 29న కొనుగోళ్లను ప్రారంభించగా ఈ ఏడాది మార్చి 10న తొలి విడత వేలం మొదలుకానుంది. కర్ణాటకలో ఇంకా 40శాతం పంట

మిగతా 6వ పేజీలో

నిమిషం లేటైనా నో ఎంట్రీ

- ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- నిఘానేత్రాల నీడలో నిర్వహణ
- కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేధం



ఒంగోలు విద్య, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించడంతో అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. పరీక్షల్లో కాపీయింగ్, ఇతర అవకతవకలకు చెక్ పెట్టేందుకు అన్ని కేంద్రాలలో సీసీ కెమెరాలను

మిగతా 6వ పేజీలో



3 నుంచి టెన్త్ విద్యార్థులకు గ్రాండ్ టెస్టులు

● షెడ్యూల్ విడుదల

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు మార్చి 3 నుంచి గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలకు ఎస్సీఈఆర్టీ జారీ చేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 10వ తరగతి విద్యార్థులకు ఈ గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన ప్రశ్నపత్రాలను ఎస్సీఈఆర్టీ సరఫరా చేస్తోంది. ఈ ప్రశ్నపత్రాల బండిళ్లను మండల విద్యావనరుల కేంద్రాల్లో భద్రపర్చాలి. ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు మండలంలో ఇద్దరు ఎంఈవోలు, క్లస్టర్ స్కూలు హెడ్మాస్టరుతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయమన్నారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందు మాత్రమే పాఠశాలలకు ప్రశ్నపత్రాల బండిళ్లను ఇవ్వనున్నారు. ఎంఈవోలు, సీఆర్పీలు తమ పరిధిలోని హైస్కూళ్లను సందర్శించి పరీక్షలను పర్యవేక్షించనున్నారు.

3 నుంచి గ్రాండ్ టెస్టులు

విద్యార్థులకు మార్చి 3 నుంచి గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నారు. పరీక్ష ప్రతిరోజు మధ్యాహ్నం 1.30 నుంచి 4.40 వరకు జరుగుతుంది. 3న ప్రథమ భాష తెలుగు, కాంపోజిట్ కోర్సు పేపర్-1, 4న హిందీ, 5న ఇంగ్లీషు, 6న ప్రథమ భాష పేపర్-2 (కాంపోజిట్‌కోర్సు), ఓఎస్ఎస్సీ మెయిన్ లాంగ్వేజీ పేపర్-1, 7న గణితం, 10న ఫిజికల్ సైన్స్, 11న బయలాజికల్ సైన్స్, 12న ఓఎస్ఎస్సీ మెయిన్ పేపర్-2, ఎస్ఎస్సీ ఒకేషనల్ (థియరీ), 13న సోషల్ పరీక్ష జరుగుతుంది. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆర్జేడీలు, డీఈవోలను కమిషనర్ ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

నేడు రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

కంభం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపురం గ్రామంలో వెలసిన శ్రీనాగలింగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం మహా శివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన ఎడ్ల జతలకు వరుసగా రూ.60వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

తరగతి గదిలో పాము కలకలం

● పరుగులు పెట్టిన విద్యార్థులు



జెర్రిపోతును పట్టుకున్న స్నేక్ క్యాచర్ మల్లికార్జున

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో పాము కలకలం రేపింది. దీంతో ప్రశాంతంగా ఆధ్యాపకులు చెప్పే పాఠాలను వింటున్న విద్యార్థులు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. కళాశాల తరగతి గదిలోనికి మంగళవారం మధ్యాహ్నం పాము వచ్చి విద్యార్థుల మధ్యలో నుంచి వెళ్లింది. దీంతో భయభ్రాంతులకు గురైన విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది వెంటనే అప్రమత్తమై స్థానిక ఫారెస్ట్ స్నేక్ క్యాచర్ మల్లికార్జునకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న మల్లికార్జున పామును పట్టుకొన్నారు. అటవీ ప్రాంతంలో విడిచిపెట్టనున్నట్లు తెలిపారు. విషంలేని జర్రిపోతు పాము అని విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

వసూళ్ల రవికిరణం

(5వ పేజీ తరువాయి)

స్టేషన్‌కు పిలిపించి సీఐ నిలదీశారు. అక్కడ జరిగిన విషయం సాక్ష్యాలతో బయటపెట్టడంతో సదరు ఏఆర్ ఎస్ఐ ఆయన కాళ్లావేళ్లాపడ్డాడు. తాను తప్పుచేశానని ఒప్పుకున్నాడు. అయితే ఈ విషయాన్ని సీఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కేసులలో పంచాయితీలు

నగరంలోని కీలక పోలీసు స్టేషన్‌లో నమోదయ్యే కేసు లలో ఏఆర్ ఎస్ఐ తలదూర్చుతాడు. సెటిల్‌మెంట్ చేస్తానని అటు నిందితులకు, బాధితులకు చెబుతాడు. స్టేషన్‌లోకి వెళ్లి అధికారుల వద్ద మాత్రం తమ బంధువులకు సంబంధించిన కేసు అంటూ ప్రాధేయపడతాడు. వారికి మాయమాటలు చెప్పి ఏదో రకంగా కేసు నమోదు కాకుండా చేస్తాడు. ఆపైన బాధితులు, నిందితుల వద్ద డబ్బులు వసూలు చేయడం రివాజుగా మార్చుకున్నాడు. హోటల్స్‌కు వెళ్లి తాను ఆ ఏరియా ఎస్ఐనని చెప్పి బిర్యానీ ప్యాకెట్లు, తినుబండారాలు తెచ్చుకుంటాడని ప్రచారం ఉంది.

ఎస్పీకి ఫిర్యాదు చేసిన సీఐ

ఏఆర్ ఎస్ఐ దందాలపై నగరంలోని ఒక కీలక స్టేషన్ సీఐ ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన ఏఆర్ ఎస్ఐ దందాలపై విచారణ చేయించారు. అందులో ఏఆర్ ఎస్సై అవినీతి బాగోతాలు అనేకం వెలుగుచూశాయి. దీంతో 15రోజుల క్రితం ఎస్పీ దామోదర్ అతనిని హెడ్‌క్వార్టర్‌కు సరెండర్ చేసుకోవాలని గుంటూరు రేంజ్ ఐజీకి లేఖ రాసినట్లు సమాచారం. ఏఎస్ఐలు, ఎస్ఐలపై చర్యలు తీసుకునే అధికారం ఐజీకి ఉంటుంది. సదరు ఏఆర్ ఎస్ఐపై చర్యలు ఎలా ఉంటాయన్నది వేచి చూడాల్సి ఉంది.

అపరిశుభ్రంగా స్నానాల ఘాట్

» చేపల చెరువుల నుంచి వ్యర్థాలు రిజర్వాయర్ నీటిలోకి...
» మణికేశ్వరం భక్తులకు తప్పని కష్టాలు



గుండ్లకమ్మ రిజర్వాయర్

అద్దంకి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి రోజు నదీ స్నానాలు చేసి శివయ్యను దర్శించుకోవాలనుకునే భక్తులకు కష్టాలు తప్పడం లేదు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీటి నిల్వ ఉంది. ఈ నేపథ్యంలో మణికేశ్వరం లోని మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద గుండ్లకమ్మ నదిలో భక్తులు స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. అయితే మణికేశ్వరం సమీపంలో ఉన్న చేపల చెరువుల నుండి వ్యర్థాలను గుండ్లకమ్మ నది లోకి వదలడంతో ఆ వ్యర్థాలు మొత్తం నీటిపై తేలుతూ నది మలుపులో ఉన్న స్నానాల ఘాట్ వద్ద పేరుకు పోయాయి. చేపల పెంపకానికి కోళ్ల మాంసం వ్యర్థాలను వినియోగిస్తుండడంతో ఆ వ్యర్థాలను గుండ్లకమ్మ రిజర్వాయర్ లోకి వదలడంతో కలుషితంగా మారాయి.



మణికేశ్వరం స్నానాల ఘాట్ వద్ద నీటిపై తేలియాడుతున్న వ్యర్థాలు

స్నానాల ఘాట్ వద్దనే కలుషితమైన నీరు నిలవడం, వ్యర్థాలు నీటి పై తేలియాడుతుండడంతో మహాశివరాత్రి రోజు మణికేశ్వరం వద్ద స్నానాలు చేసే భక్తులకు ఇబ్బందులు తప్పేటట్టు లేదు. అధికారుల స్పందించి చేపల చెరువుల వ్యర్థాలు గుండ్లకమ్మ రిజర్వాయర్ నీటి లోకి విడుదల చేయకుండా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

శివపూజకు.. వేళాయే

» నేడే మహా శివరాత్రి తిరునాళ్ల
» విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా కోటప్పకొండ
» త్రికోటేశ్వరస్వామి సన్నిధి ముస్తాబు
» గ్రామాల నుంచి కొండకు పయనమైన విద్యుత్ ప్రభలు
» కోటయ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఆనం
» అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభం
» అమరావతి, కాకాని, గోవాడ, క్వారీ సహా శైవక్షేత్రాల్లో భారీగా ఏర్పాట్లు

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల బుధవారం నేత్ర పర్వంగా జరగనుంది. భక్తుల కోసం కోటప్పకొండలో సర్వం సిద్ధం చేశారు. కోటప్పకొండ విద్యుత్ దీపాల అలంకరణలతో కోటప్పకొండ దేదీప్యమానంగా వెలుగొందుతోంది. కొండ ఎగువన, దిగువన విద్యుత్ దీపాలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. త్రికోటేశ్వరస్వామి సన్నిధి తిరునాళ్లకు ముస్తాబైంది. అర్ధరాత్రి స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగనున్నాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాతో ప్రభుత్వం తరపున కోటయ్యస్వామికి బుధవారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాల కోసం ఏర్పాట్లు చేశారు. చిలకలూరిపేట మేజర్ కాల్వ వద్ద భక్తుల కోసం స్నానఘట్టాలను ఏర్పాటు చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కొండ దిగువన ప్రత్యేక షెడ్ ఏర్పాటు చేశారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో చంద్రశేఖరరావు, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షిస్తున్నారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేసేందుకు దేవస్థానం, సేవా సంస్థల ఆధ్వర్యంలో భారీగా సిద్ధం చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, సత్యసాయి సేవా సమితి సభ్యులు సేవలు అందించేందుకు కొండకు తరలి వచ్చారు.

కోటప్పకొండకు 550 బస్సులు

కోటప్పకొండకు ఆర్టీసీ 550 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, అద్దంకి, చీరాల, ఒంగోలు బస్టాండ్‌ల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. వీఐపీల కోసం 20 ఆర్టీసీ వాహనాలను ఏర్పాటు చేశారు. ఘాట్ రోడ్డులో 85 బస్సులు నిర్వహించనున్నారు. కొండ వద్ద చిలకలూరిపేట రోడ్డులో, ఘాట్ రోడ్డు పక్కన, కొండపైన ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్లను నిర్వహిస్తున్నది.

అన్నదానాలకు భారీగా ఏర్పాట్లు

కొండ దిగువన ఉన్న వివిధ సామాజిక సత్రాలలో లక్షల మందికి అన్నదానం జరగనుంది. మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా అన్నదానం చేసేందుకు సత్రాల నిర్వహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవస్థానం వద్ద, కొండ దిగువ ప్రాంతాలలో తొమ్మిది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కొండలోని పీహెచ్‌సీలో ప్రత్యేకంగా పడకలు ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ శాఖ కొండ ప్రాంతంలో మద్య నిషేధం విధించింది. పది కిలో మీటర్ల వరకు మద్యం విక్రయాలను నిలిపి వేశారు.

2,500 మందితో బందోబస్తు

తిరునాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో 2,500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. బందోబస్తు పర్యవేక్షణకు కొండ ఎగువన, దిగువన కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. సీసీ కెమేరాల ద్వారా బందోబస్తును పర్యవేక్షిస్తారు. డ్రోన్‌లను కూడా వినియోగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచే పోలీసులకు విధులు కేటాయించారు. కొండ ప్రాంతం వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేట, పెట్లూరివారిపాలెం రహదారుల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా వన్‌వే నిర్వహిస్తారు. కొండ ఎగువన, దిగువన తాత్కాలిక రూరల్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం ఎస్పీ పర్యవేక్షించారు. తిరునాళ్ల ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

19 భారీ విద్యుత్ ప్రభలు


కోటప్పకొండ తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి 19 భారీ విద్యుత్ ప్రభలు తరలివస్తున్నాయి. వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రభలు మంగళవారం కొండకు పయనమయ్యాయి. ప్రభల రాక నేపథ్యంలో చిలకలూరిపేట రోడ్డులోని ప్రధాన విద్యుత్ లైన్‌కు బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఒక్కొక్క ప్రభ 90 అడుగులకు పైగా ఎత్తులో నిర్మించారు. నాదెండ్ల మండలం అవిశాయపాలెం, అప్పాపురం గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, కోమటినేనివారిపాలెం, కావూరు నుంచి ఒక్కొక్కటి, చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నం నుంచి ఆరు, బొప్పూడి నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు వస్తున్నాయి. నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, గురవాయపాలెం, కాకాని నుంచి ఒక్కొక్కటి, కాకాని గ్రామం నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభ కొండకు తరలి వస్తున్నాయి. నరసరావుపేట పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సాధారణ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి.

వీఐపీలకు పెద్దపీట

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీలకు పెద్ద పీట వేస్తున్నారు. వీరి సేవలో అధికారులు తరించనున్నారు. సామాన్య భక్తులకు అటు ఆర్టీసీ, ఇటు దేవస్థానం అన్ని సేవలకు టిక్కెట్లను విక్రయిస్తున్నది. అయితే కొండ కింద కారు దిగిన దగ్గర నుంచి స్వామి దర్శనం చేసుకునే వరకు వీఐపీలకు అన్ని సేవలను ఉచితంగా అందించేందుకు అధికారులు భారీగా ఏర్పాట్ల చేశారు. వేలాదిగా దర్శనం పాసులను పంపిణీ చేశారు. వీఐపీలకు ఉచితం 20 బస్సులను ఏర్పాటు చేసిన ఆర్టీసీ సామాన్య భక్తులను నుంచి అధిక చార్జీలను వసూలు చేస్తున్నది.

కోటప్పకొండకు తరలిన తాటివారిపాలెం విద్యుత్ ప్రభ

మార్టూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటివారిపాలెం గ్రామం లో సోమవారం రాత్రి ఏర్పా టు చేసిన విద్యుత్ ప్రభను మంగళవారం కోటప్పకొండ తిరునాళ్లకు తీసుకువెళ్లారు. మహాశి వరాత్రి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి కోటప్పకొండలో ఏర్పాటు చేసేందుకు వి ద్యుత్ ప్రభను తీసుకువెళ్లారు. గ్రామంలోని ముప్పనేని ఆదిశేషయ్య కుటుంబం దాదాపుగా 50ఏళ్ల కిందట మహారాష్ట్రలోని నాగపూర్‌కు వలస వె ళ్లింది. ఈ కుటుంబం మహాశివరాత్రి పండుగ నాడు గ్రా మం నుంచి విద్యుత్ ప్రభను ఏర్పాటుచేసి కోటప్పకొండకు తీసుకువస్తామని మొక్కుకున్నారు. కాలక్రమేణా ఆదిశేషయ్య మృతి చెందడంతో ఆయన కుమారుడు వెంకటేశ్వరరావు ఇతర కుటుంబసభ్యులు చాలా కాలం తర్వాత సొంతూరు తాటివారిపాలెం వచ్చారు. వారు సొంత ఖర్చుతో సుమారు రూ.2లక్షల వ్యయంతో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి గ్రామంలో విద్యుత్ ప్రభ వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా సీఐ ఎం.శేషగిరిరావు పర్యవేక్షించారు. అదేవిధంగా మం గళవారం వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన చిన్న ప్రభను ట్రాక్టర్‌పై గ్రామంలోని అన్నివీధులలో ఊరేగించారు. అనంతరం గ్రామం లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తరువాత విద్యుత్ ప్రభను కోటప్పకొండకు తరలించారు. గ్రామం నుంచి తొలిసారిగా కోటప్పకొండకు ప్రభ తరలివెళ్లడంపై గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కోటప్పకొండకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ ప్రభ

పొగాకు కొనుగోళ్లకు ముహూర్తం ఖరారు

(5వ పేజీ తరువాయి)

మార్కెట్ చేయాల్సి ఉన్న తరుణంలో రాష్ట్రంలో మార్చి ఆఖరున వేలం చేపట్టాలని వ్యాపారులు కోరారు. అయితే ఇప్పటికే ఇళ్లకు పొగాకు చేరి రెండు నెలలు దాటినందున మార్చి తొలివారంలోనే కొనుగోళ్లు ప్రారంభించాలని రైతు ప్రతినిధులు కోరినట్లు సమాచారం. దీనికితోడు ఎనిమిదేళ్లుగా పొగాకు బోర్డు ఈడీగా కొనసాగుతున్న అద్దంకి శ్రీధర్‌బాబు పదవీ కాలం మార్చి 11తో ముగియనుంది. దీంతో మార్చి 10న తొలిదశ వేలం చేపట్టాలని నిర్ణయించారు. అలా తొలి దశలో దక్షిణాదిలోని ఒంగోలు-1, కొండపి, వెల్లంపల్లి, పొదిలి, కందుకూరు-1లలో ప్రారంభించనున్నారు. రెండో దశలో మార్చి 19న దక్షిణాదిలో మిగిలిన ఆరు వేలం కేంద్రాల్లోనూ, మూడో విడతగా మార్చి 24న ఉత్తరాది (ఎన్ఎల్ఎస్) రీజియన్‌లోని కేంద్రాలలో వేలం ప్రారంభించనున్నారు. బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, కార్యదర్శి దివి వేణుగోపాల్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వైస్ ఛైర్మన్‌గా రైతు ప్రతినిధి

పొగాకు బోర్డు వైస్ ఛైర్మన్‌గా మరోసారి జిల్లా వాసికి అవకాశం దక్కింది. ఇప్పటివరకు పొగాకు వ్యాపారుల కోటాలో బోర్డు డైరెక్టర్‌గా ఉన్న జిల్లాకు చెందిన గుత్తా వాసుబాబు వైస్‌ఛైర్మన్‌గా ఉన్నారు. ఈనెల 15తో ఆయన పదవీ కాలం ముగిసింది. దీంతో సోమవారం జరిగిన పొగాకు బోర్డు పాలక మండలి సమావేశంలో వైస్‌ఛైర్మన్‌ను ఎంపిక చేశారు. ఈసారి రైతు ప్రతినిధిగా ఉన్న బోర్డు డైరెక్టర్ బొడ్డపాటి బ్రహ్మయ్యకు అవకాశం దక్కింది. కొండపి వేలం కేంద్రానికి చెందిన బ్రహ్మయ్యకు రైతుల తరపున మాట్లాడే వ్యక్తిగా గుర్తింపు ఉంది. రాజకీయంగా బీజేపీలో పనిచేస్తున్న ఆయన్ను ఆ పార్టీ పెద్దల సిఫార్సుతో గతంలో బోర్డు సభ్యులుగా నియమించారు. ప్రస్తుతం వైస్‌ఛైర్మన్‌గా అవకాశం లభించింది. కాగా ఇదే సమావేశంలో కర్ణాటకలో రానున్న సీజన్ పంట ఉత్పత్తి పరిమాణాన్ని కూడా ఖరారు చేశారు. గత ఏడాది వలే రానున్న ఏడాది కూడా అక్కడ 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది.

విజ్ఞాన నైపుణ్యంతో విద్యార్థులు రాణించాలి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విజ్ఞాన నైపుణ్యాలపై అవగాహన పెంచుకుని చక్కగా రాణించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో యంగ్ సైంటిస్ట్ ఇండియా సైన్స్ మాసపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు గాయాలు

బల్లికురవ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామ సమీపంలో మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కొప్పెరపాడు గ్రామ రెవెన్యూ అధికారి గురవయ్య, కొండాయపాలెం గ్రామానికి చెందిన నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వీఆర్వో గురవయ్యను తహసీల్దార్ రవినాయక్, రెవిన్యూ సిబ్బంది పరామర్శించారు.

వైసీపీ ఖాళీ

(5వ పేజీ తరువాయి)

నిదర్శనం. జిల్లా పరిషత్‌పై సైతం టీడీపీ నాయకులు దృష్టిపెట్టారు. జడ్పీ, ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కొంత కాలపరిమితి అడ్డంగా మారడంతో వేచిచూస్తున్నారు. జడ్పీని కాపాడుకునేందుకు వైసీపీ నాయకులు టీడీపీలో ఒక కీలక ఎమ్మెల్యేతో రహస్య ఒప్పందానికి వచ్చినట్లు అధిష్ఠానానికి ఫిర్యాదు అందింది. దానిపై మంత్రి నారా లోకేష్ సీరియస్ అయినట్లు కూడా తెలిసింది. దీంతో మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ను అదను చూసి చేజిక్కించుకునే విధంగా టీడీపీ నాయకులు అడుగులు వేస్తున్నారు.

కలిసి వస్తున్న జనసేనలో చేరికలు

ఈనేపథ్యంలో జనసేనలోకి కిందిస్థాయి ప్రజాప్రతినిధులు చేరడం జిల్లాలో కూటమి ప్రభుత్వానికి కలిసివస్తోంది. కీలకమైన ఒంగోలు కార్పొరేషన్‌లో ఇప్పటికే మేయర్‌తోపాటు 19 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరడంతో ఆ పార్టీ బలం 25కు చేరింది. తాజాగా బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పవన్‌కల్యాణ్ సమక్షంలో వైసీపీ నుంచి 20 మంది కార్పొరేటర్లు జనసేనలో చేరారు. దీంతో కార్పొరేషన్‌లో కేవలం నలుగురు మాత్రమే వైసీపీకి మిగిలారు. ప్రస్తుతం కార్పొరేషన్‌లో టీడీపీ పక్షాన 25మంది, జనసేన పక్షాన 21మంది, వైసీపీ పక్షాన నలుగురు కార్పొరేటర్లు ఉన్నారు. ఇక మిగిలిన నలుగురు కూడా వివిధ కారణాలతో పార్టీ మారకపోయినా కీలకమైన సమయంలో మీరు చెప్పిన విధంగా మద్దతు ఇస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. దీంతో వైసీపీ ఒంగోలులో ఖాళీ అయినట్లే..

సర్వశక్తులు ఒడ్డినా..

జిల్లాలో బాలినేని జనసేనలో చేరిన తర్వాత ఆయనతోపాటు వైసీపీ నాయకులు పార్టీని వీడకుండా కాపాడుకునేందుకు ఆ పార్టీ పెద్దలు సర్వశక్తులు ఒడ్డారు. ఆ పార్టీ లోక్‌సభ ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి ఇతర ముఖ్య నాయకులు జిల్లా అంతా సమావేశాలు నిర్వహించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ కుమారుడైన ఎమ్మెల్యే బూచేపల్లిని పార్టీ అధ్యక్ష పదవికి ఎంపిక చేశారు. వారి ద్వారా విందులు, వినోదాలు ఇతరత్రా కార్యక్రమాలు ఏర్పాటు చేసి పార్టీశ్రేణులను కాపాడుకునే ప్రయత్నాలు చేశారు. పరిస్థితి శ్రుతిమించటంతో జగనే స్వయంగా రంగంలో దిగి జిల్లాలోని ముఖ్య నాయకులతో పలుమార్లు సమావేశమయ్యారు. బాలినేని ప్రాతినిధ్యం వహించే ఒంగోలు నియోజకవర్గంలో అయితే కార్పొరేటర్లు, ముఖ్య నాయకులందరినీ జగనే పిలిపించుకొని వారికి మనోధైర్యం కల్పించే ప్రయత్నం చేశారు. ఇటీవల కార్పొరేటర్లు గ్రానైట్‌తో అనుబంధం ఉన్న వారిని పార్టీ మారితే తస్మాత్ జాగ్రత్త అనే హెచ్చరికలు ఇచ్చారు ఇంకోవైపు ఇతరత్రా వ్యాపార భాగస్వాములకు కూడా కొందరు నేతల నుంచి హెచ్చరికలు అందాయి. అయినా 20 మంది కార్పొరేటర్లు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు వైసీపీకి గుడ్‌బై చెప్పి జనసేనలో చేరటం విశేషం. కాగా ఒంగోలుతోపాటు ఇతరత్రా నియోజకవర్గాల నుంచి కొందరు ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు బాలినేని సమక్షంలో జనసేనలో చేరేందుకు సిద్ధమైనప్పటికీ ఆ కార్యక్రమం వాయిదా వేసినట్లు తెలిసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఆయా నియోజకవర్గాల వారీ టీడీపీ నాయకత్వంతో ఇబ్బంది లేని విధంగా వైసీపీకి చెందిన వారిని జనసేనలో చేర్చుకోవాలని భావించినట్లు సమాచారం. తదనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని జనసేన అధినేత నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బాలినేని కూడా ఇప్పటికే జిల్లాలోని కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో టచ్‌లోకి వెళ్లి ఆయా నియోజకవర్గాల్లో జనసేనలో చేరే నాయకుల విషయంపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. దీంతో ముందు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా వైసీపీకి గుడ్‌బై చెప్పే వారి సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తుంది. ఇదిలా ఉండగా మంగళవారం బాలినేని తన కుమారుడైన ప్రణీత్‌రెడ్డిని కూడా పవన్‌కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేర్చారు. గత ఎన్నికల్లో తాను ఇక పోటీ చేయనని భవిష్యత్తులో తన కుమారుడే రంగంలో ఉంటాడని చెప్పిన బాలినేని ఆ విషయాన్ని జనసేనానికి చెప్పి కుమారుడిని చేర్పినట్లు అని కూడా తెలుస్తోంది.

నిమిషం లేటైనా నో ఎంట్రీ!

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు నిఘానేత్రాల నీడలో పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి ప్రారంభంకానున్నాయి 8.30 గంటల నుంచి విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 9 గంటల తర్వాత నిమిషం లేటైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని ఇంటర్మీడియేట్ బోర్డు ఆర్ఐవో సైమన్ విక్టర్ తెలిపారు.

67 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

ఇంటర్ పరీక్షలకు మొత్తం 42,439 మంది హాజరుకానున్నారు. అందులో 21,624 మంది ప్రథమ, 20,815 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. వీరికోసం జిల్లాలో 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 67 మంది చీఫ్‌లు, 67 మంది డిపార్ట్‌మెంట్ అధికారులతోపాటు 1089 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేవిధంగా 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒంగోలులోని ఆర్ఐవో కార్యాలయం, విజయవాడలోని ఇంటర్మీడియేట్ బోర్డు ప్రధాన కార్యాలయానికి సీసీ కెమెరాలు అనుసంధానం చేశారు. ఆ కార్యాలయాల నుంచి పరీక్షా కేంద్రాల్లో ఏమి జరుగుతుందో వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఐదు కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన ఐదింటిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కంభం, పెదదోర్నాల, అర్ధవీడు, ఎర్రగొండపాలెం, గిద్దలూరులోని కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఈ కేంద్రాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టి కాపీయింగ్ నిరోధించేందుకు చర్యలు చేపడతారు. కాపీయింగ్ నిరోధించేందుకు మూడు ఫ్లైయింగ్, మూడు సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా ఆర్ఐవో, డీఈసీ సభ్యులు, స్పెషలాఫీసర్, కలెక్టర్, రెవెన్యూ అధికారులు, రాష్ట్రస్థాయి బోర్డు అధికారులు కూడా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారు.

హాల్ టికెట్లు మరింత సులభతరం

పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈసారి హాల్‌టికెట్లు సులభతరంగా పొందనున్నారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలల నుంచి వీటిని పొందవచ్చు. ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థి చదువుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సంతకంతో సంబంధం లేకుండా పరీక్షకు హాజరుకావచ్చు. విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇచ్చేందుకు నిరాకరిస్తే కళాశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐవో సైమన్ విక్టర్ హెచ్చరించారు.

సెల్‌ఫోన్లు నిషేధం

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను నిషేధించారు. చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లు, పోలీసు, వైద్యసిబ్బంది, స్క్వాడ్ అధికారులు, ఇతర సిబ్బంది ఎవ్వరూ సెల్‌ఫోన్లు తీసుకు రాకూడదు. ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా కేంద్రాల్లోకి అనుమతించరు. పరీక్షల విధులు నిర్వహించే సిబ్బంది అంతా తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలి. పరీక్షలకు సంబంధించిన సమాచారం అందించేందుకు ఆర్ఐవో కార్యాలయంలో 24 గంటలు పనిచేసే విధంగా కంట్రోలు రూంను ఏర్పాటు చేశారు. దానికి 08592-281275 నెంబర్‌ను కేటాయించారు.

శివోహం



ఒంగోలులోని కాశీవిశ్వేశ్వర శివాలయం

'నాగేంద్ర హారాయ త్రిలోచ నాయ, భస్మాంగ రాగాయ మహేశ్వరాయ, తస్మై నకారాయ నమఃశివాయ' అంటూ ఆకారంలేనివాడు శివుడు అని పెద్దలు చెబుతారు. అంటే అంతటా తానై వ్యాపించి ఉన్న నిరాకారుడు పరమేశ్వరుడు. అందుకే ఆయనను ఎక్కువగా లింగాకారంలోనే పూజిస్తుంటాం. ఆ లింగాకారంలో పరమేశ్వరుడు ఆవిర్భవించిన రోజు మాఘమాసం బహుళ పక్షం చతుర్దశి రోజు అని పురాణాలు చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం ఆరోజును మహా శివరాత్రిగా పేర్కొంటారు. ఈ మాఘ బహుళ చతుర్దశి రోజును మాత్రం మహా శివరాత్రిగా జరుపుకుంటారు. ఆరోజు అర్ధరాత్రి సమయంలో పరమేశ్వరుడు లింగాకారంలో ఆవిర్భవించాడని ప్రతీతి. అందుకే మహాశివరాత్రి రోజు అర్ధరాత్రి లింగోద్భవ కాలంగా పేర్కొంటూ ఆ సమయంలో ఆయనకు మహా రుద్రాభిషేకం నిర్వహిస్తారు. అటువంటి మహా శివరాత్రి పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా ప్రజలు బుధవారం జరుపుకోనున్నారు.

- నేడు మహా శివరాత్రి పర్వదినం
- లింగోద్భవ కాల అభిషేకాలు, కల్యాణాలు
- జిల్లావ్యాప్తంగా శైవాలయాల ముస్తాబు
- పలుచోట్ల తిరునాళ్ల నిర్వహణ
- జిల్లా నుంచి శ్రీశైలానికి తరలివెళ్లిన భక్తులు

మహాశివరాత్రికి పటిష్ట భద్రత : ఎస్పీ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అన్ని శైవక్షేత్రాలు, దేవాలయాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ బుధవారం తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు ఉంటే వెంటనే 112, 100కు కాల్ చేయాలని కోరారు. ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసు గస్తీ ఏర్పాటు చేశామన్నారు.

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :ఉమ్మడి ప్రకాశం జిల్లావ్యాప్తంగా పలు ప్రసిద్ధ శైవక్షేత్రాలు ఉన్నాయి. త్రిపురాంతకం శ్రీ బాలత్రిపురాంతకేశ్వర స్వామి, భైరవకోన శ్రీ భర్గులేశ్వరి స్వామి, మణికేశ్వరం శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం, పొదిలి శ్రీ నిర్మమహేశ్వరస్వామి దేవస్థానం, ముక్తేశ్వరం శ్రీ ముక్త్యేశ్వరస్వామి దేవస్థానం, సి.ఎస్.పురం శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం, రామతీర్థం శ్రీ మోక్షరామలింగేశ్వర స్వామి దేవస్థానం, మడనూరు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం, ఒంగోలులోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఇలా పలు ప్రసిద్ధ పురాతన శివాలయాలతో పాటు ప్రతి గ్రామంలోనూ ఒక శివాలయం తప్పనిసరిగా ఉంటుంది. ఇక ఆయా ఆలయాలు మహా శివరాత్రికి సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. వీటిలో బుధవారం ఉదయం నుంచి అభిషేకాలు, కుంకుమార్చనలు, లింగోద్భవ మహా రుద్రాభిషేం, పార్వతీ పరమేశ్వరుల కల్యాణం మొదలైన కార్యక్రమాలను నిర్వహించటానికి ఆయా దేవస్థాన అధికారులు, నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల మహాశివరాత్రి సందర్భంగా తిరునాళ్లు సైతం జరుగనున్నాయి. ప్రసిద్ధ శైవక్షేత్రమైన మన పొరుగు జిల్లాలో ఉన్న శ్రీశైలంకు మన జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.



శివనామస్మరణలో 1116 శివలంగాల వేదిక

జమ్ములపాలెం (టంగుటూరు), ఫిబ్రవరి 25 : మండలంలోని జమ్ములపాలెంలో నిర్మితమైన 1,116 శివలింగాల వేదిక నిత్యం శివనామ స్మరణతో మార్మోగుతుంది. మహాశివరాత్రి నాడు రుద్రాభిషేకాలు, అర్చనలు, మహాలింగోద్భవ పూజ జరుగుతాయి. నేటి మహాశివరాత్రి మహోత్సవానికి దేవాలయం ముస్తాబైంది.

ఒంగోలు నగరంలో...

జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో వందల సంవత్సరాల చరిత్ర కలిగిన అతి పురాతన శైవ క్షేత్రాలు కేశవస్వామి పేట శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, తూర్పుపాలెం (కొత్తపట్నం బస్టాండు) శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం. వీటిలో మహాశివరాత్రి సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు ఏకాహం నిర్వహిస్తున్నట్లు శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారి బోడపాటి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ మహా రుద్రాభిషేకం, గురువారం ఉదయం శ్రీ పార్వతీపరమేశ్వర కల్యాణం, సాయంత్రం నగరోత్సవం జరుగుతాయని ఆయన తెలిపారు. స్థానిక కేశవస్వామిపేట శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో సైతం మహా శివరాత్రి సందర్భంగా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వహణాధికారి రావెళ్ల శివశంకర్ తెలిపారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ప్రదోష కాలార్చన, మహా రుద్రాభిషేకం, శివ కళ్యాణం, నరనందివాహన సేవ, నగరోత్సవం నిర్వహిస్తున్నామని ఈవో శివశంకర్ తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా సుబ్బారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు పీఏ టు స్పెషల్ కలెక్టర్‌గా జీవీ.సుబ్బారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 18మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీలు చేశారు. ఈక్రమంలో సుబ్బారెడ్డిని వెలిగొండ ప్రాజెక్టు పీఏ టు స్పెషల్ కలెక్టర్‌గా నియమించారు. కాగా సుబ్బారెడ్డి ఎన్నికల ముందు ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేశారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం సుబ్బారెడ్డిని బదిలీ చేసింది. తరువాత అనంతపురం జిల్లాకు బదిలీ చేయగా అక్కడ జాయిన్ కాలేదు. మరలా తిరిగి వెలిగొండ ప్రాజెక్టు పీఏ టు స్పెషల్ కలెక్టర్‌గా ఆయనను నియమించారు.

శివరాత్రికి రామతీర్థం ముస్తాబు

చీమకుర్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు దక్షిణకాశీగా విరాజిల్లుత్ను రామతీర్థం మోక్షరామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబయింది. ఆలయంలో మంగళవారం ఉదయం నుంచే అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించటానికి ఏర్పాట్లు చేశారు. రాత్రివేళ లింగోద్భవకాల పూజలు నిర్వహించనున్నారు. బుధవారం కళ్యాణమహోత్సవం జరుపుతారు. గ్రానైట్ వ్యాపారి మలినేని వెంకటేశ్వర్లు(బుల్లబ్బాయి) సహకారంతో ఆలయం విద్యుద్దీపాలతో, ఆలయంలో లోపల పూలతో విశేషంగా అలంకరించారు. భక్తుల కోసం ఒంగోలు, పొదిలి నుంచి ప్రత్యేక బస్ సర్వీస్‌లను ఆర్టీసీ నడపనుంది. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

గాడిపర్తివారిపాలెం సొసైటీ సీఈవో సస్పెన్షన్

చీమకుర్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాడిపర్తివారిపాలెం సొసైటీ సీఈవోగా పనిచేస్తున్న సుడిదెల మల్లికార్జునరెడ్డిని సస్పెండ్ చేస్తూ పర్సన్ ఇన్‌చార్జి మాలకొండయ్య మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సాధారణ ఎన్నికల సమయంలో వైసీపీ తరపున నియోజకవర్గంలోని 39వ పోలింగ్ కేంద్రంలో మల్లికార్జునరెడ్డి ఏజెంట్‌గా ఉన్నట్లు విచారణలో నిరూపితం కావటంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గమిని ప్రసాద్ మల్లికార్జునరెడ్డి మీద చేసిన ఫిర్యాదు మేరకు సహకారశాఖాధికారులు విచారణ జరిపి, నిర్ధారణ జరిపిన తదుపరి ఉత్తర్వులు జారీ చేసినట్లు సస్పెన్షన్ ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఆరునెలలు లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు సస్పెన్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కాగా ఇదే విషయంపై సీఈవో మీద చర్యలు తీసుకోవాలని మార్నేని శ్రీనివాసరావు కూడా గ్రీవెన్స్‌సెల్, అలాగే ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కి లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు.

శ్రీ సరస్వతి విద్యార్థికి సీఎం అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ రెండో పేపర్ పరీక్షా ఫలితాల్లో 99.94 పర్సంటైల్‌తో ఆల్ ఇండియా స్థాయిలో ఎస్సీ కేటగిరీలో ప్రథమస్థానంలో నిలిచిన ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యాసంస్థల విద్యార్థి కసుకుర్తి లోక్‌క్రిటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. లోక్‌క్రిటి జేఈఈ మెయిన్స్‌లో టాపర్‌గా నిలిచారు. కళాశాల చైర్మన్ రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వారిని అభినందించారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన కళాశాల యాజమాన్యాన్ని సీఎం మెచ్చుకున్నారు. ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన కళాశాల డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగా శంకర్‌రెడ్డి, సీఈవో సురేష్‌లను సీఎం అభినందించారు.

పారదర్శకంగా రీసర్వే పూర్తి చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ● పోతవరంలో ప్రక్రియ పరిశీలన

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సర్వేలను నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. పోతవరం గ్రామంలో జరుగుతున్న రీసర్వే, ఇంటింటి పీ-4 సర్వేను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తుగా నోటీసులు జారీ చేసి రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే చేయాలని తెలిపారు. మ్యూటేషన్ ప్రక్రియలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రీసర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రీ సర్వే రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో సచివాలయ సిబ్బంది చేస్తున్న ఇంటింటి జనాభా లెక్కింపు (పీ-4) సర్వే తీరును పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నారా.. డబ్బులు ఏమైనా వసూలు చేస్తున్నారా.. సత్ప్రవర్తగా మెలుగుతున్నారా... అని కలెక్టర్ అన్సారియా స్థానికులను అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపైనా అక్కడున్న వారి అభిప్రాయాలను తెలుసుకొన్నారు. దాంతో కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు గ్రామస్థులు సంతృప్తి సమాధానం వ్యక్తం చేశారు.



పోతవరంలో రీసర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కార్యక్రమంలో సర్వేశాఖ సహాయ సంచాలకులు గౌస్‌బాషా, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వై.మహాలక్ష్మి, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్ల బండిని ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

● ఇద్దరికి స్వల్పగాయాలు

సింగరాయకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎద్దుల బండిని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కనమళ్ల సమీపంలోని కందుకూరుకు వెళ్లే రోడ్డులో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కనిగిరి మండలం శాఖవరం గ్రామానికి చెందిన కరాటపు నాని (23) కందుకూరులో నివాసం ఉంటూ ఒక ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. సోమవారం ఆయనతోపాటు స్నేహితులు ఐదుగురు సింగరాయకొండకు రెండు బైక్‌లపై బయల్దేరారు. ఒకబైక్‌ను నాని నడుపుతుండగా వెనుకవైపు విజయ్‌కుమార్, మదన్‌నాయుడు కూర్చున్నారు. కనమళ్ల సమీపంలో నాని నడుపుతున్న మోటార్ సైకిల్ అదుపు తప్పి ముందు వెళ్తున్న ఎద్దుల బండిని ఢీకొట్టింది. దీంతో దానిపై ఉన్న ముగ్గురూ రోడ్డుపై పడిపోయారు. నానికి తీవ్రగాయాలు కాగా స్నేహితులైన విజయ్‌కుమార్, మదన్‌నాయుడు స్వల్పంగా గాయపడ్డారు. నానిని ఒంగోలు ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి మామ ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మహేంద్ర కేసు నమోదు చేశారు.



క్షతగాత్రుడిని తరలిస్తున్న 108 సిబ్బందికి సాయం చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రమాదం జరిగిన సమయంలో అటువైపు వెళ్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తన వాహనాన్ని ఆపి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. నానికి తీవ్రగాయాలు కావడంతో 108కు ఫోన్ చేశారు. వాహనం వచ్చే వరకూ అక్కడే ఉండి ఆయన్ను ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

● మరొకరికి గాయాలు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొని మోటార్‌సైక్లిస్టు దుర్మరణం చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఒంగోలులోని మంగమ్మ కళాశాల సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. ముక్తినూతలపాడుకు చెందిన మొలకలపల్లి వెంకటేశ్వర్లు(57), వీరాంజనేయులు తమ గ్రామం నుంచి మోటార్‌సైకిల్‌పై ఒంగోలు వెళుతున్నారు. ఈక్రమంలో వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు వారిని వేగంగా ఢీకొంది. దీంతో మోటార్‌సైకిల్‌పై వెనుక కూర్చున్న వెంకటేశ్వర్లు రోడ్డుపై పడ్డాడు. వీరాంజనేయులు రోడ్డుపక్కన పడిపోయారు. ఈక్రమలో వెంకటేశ్వర్లుపైకి బస్సు ముందు చక్రం ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వీరాంజనేయులు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మద్దిపాడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం, మండలంలోని గాజులపాలెంకు చెందిన యువకుడు, ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను తన మాయమాటలతో లోబరుచుకున్నాడు. ఈ నెల 20వ తేదీన ఆ బాలికను ఇంటి నుంచి తీసుకొని వెళ్లిపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేశారు. అనంతరం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి బాలిక ఆచూకీ కనుగొని విచారించారు. ఆ యువకుడిపై పోక్సో కేసును నమోదు చేశారు.

12న ఒంగోలు జాతి పశువుల వేలం

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : చదలవాడ పశుక్షేత్రంలోని 53 ఒంగోలు జాతి పశువుల వేలం మార్చి 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు డీడీ డాక్టర్ బి.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒట్టి ఆవులు 14, పెయ్యదూడలు 7, కోడె దూడలు 22, కోడెలు 10 ఉండగా వాటికి వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచినవారు ముందుగా రూ.5వేల ధరావత్తు చెల్లించాలన్నారు. ఒక రోజు ముందుగా పశుక్షేత్రంలో వేలంకు సిద్ధంగా ఉన్న పశువులను పరిశీలించుకోవచ్చని, పూర్తి వివరాలకు 9392901049 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

దారావారితోటలో దొంగల హల్‌చల్

● రెండిళ్లలో రూ.9లక్షల విలువైన సొత్తు చోరీ



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం దారావారితోటలో దొంగలు హల్‌చల్ చేశారు. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు తెగబడ్డారు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు షేక్ మస్తాన్‌బాబా, అతని సోదరుడు కుటుంబసభ్యులతో కలిసి తమ రెండిళ్లకు తాళాలు వేసి సోమవారం రాత్రి చినగంజాం వెళ్లారు. అక్కడ మహాశివరాత్రి సందర్భంగా బొమ్మల వ్యాపారం చేసేందుకు వెళ్లగా మంగళవారం ఉదయం మస్తాన్‌బాబా బంధువులు ఫోన్ చేసి ఇంట్లో దొంగలు పడ్డారని చెప్పడంతో చినగంజాం నుంచి వచ్చి చూసుకున్నారు. మస్తాన్‌బాబా ఇంట్లో బీరువా లాకర్ పగులగొట్టి సుమారు 14 సవర్ల బంగారం, రూ.30వేల నగదు, ఆయన సోదరుడు ఖాశీం ఇంట్లో ఉన్న రూ.1.30వేల నగదు, బంగారం వస్తువులు కూడా దొంగలు అపహరించుకువెళ్లారు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసినట్లు బాధితులు తెలిపారు.

సాయిబాబా మందిరంలో చోరీ

మద్దిపాడు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని జాతీయ రహదారి పక్కడనే ఉన్న సాయిబాబా మందిరంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పూజారి సోమవారం రాత్రి 10 గంటలకు పూజలు ముగించుకొని ఆలయ తలుపులకు తాళం వేసి వెళ్లాడు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మూత్ర విసర్జనకు లేచి చూడగా ఆలయ ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఉండటం గమనించాడు. తదుపరి లోపలకి వెళ్లి చూడగా రెండు హుండీలు పగులగొట్టి హుండీలో ఉన్న డబ్బును దొంగించినట్లు గమనించి వెంటనే ఆలయ ట్రస్టీకి సమాచారం ఇచ్చారు. అందిన సమాచారం మేరకు ఎస్సై బి.శివరామయ్య క్లూస్ టీంతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత మహిళలకు భరోసా కోసమే
సఖీ వన్‌స్టాప్ సెంటర్

● హెల్ప్‌లైన్ నంబరు 181 ● తనిఖీ చేసిన ఎస్పీ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బాధిత మహిళలు రక్షణ కోసం సఖీ వన్‌స్టాప్ సెంటర్ ఉంటుందని ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. బుధవారం స్థానిక రిమ్స్‌లో ఉన్న సఖీ వన్‌స్టాప్ సెంటర్‌ను ఎస్పీ ఏఆర్.దామోదర్ పరిశీలించారు. బాధిత మహిళల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సఖీ సెంటర్ పనిచేస్తుందని అన్నారు. అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సఖీ సెంటర్‌ను ఆశ్రయించిన బాధితులకు భరోసా కల్పించాలని అన్నారు. జిల్లాలోని అన్ని బస్టాండ్‌లు, రేల్వేస్టేషన్‌లు, ముఖ్యమైన కూడళ్లలో పోస్టర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సఖీ సెంటర్‌లో పోలీసు, న్యాయ, శిశు సంక్షేమ అధికారులు పనిచేస్తారని తెలిపారు. మహిళలు, చిన్నారులు ఎలాంటి సహాయం కావాలన్నా 181కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, సఖీ సెంటర్ ఏవో జ్యోతిసుప్రియ, న్యాయవాది స్పందన, మహిళ ఏఎస్సై గౌతమి ఉన్నారు.

మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం



తలపడుతున్న ప్రకాశం- గుంటూరు కబడీ జట్లు

పొదిలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలో రాష్ట్రస్థాయి మహిళా కబాడీపోటీలను జనసేన రాష్ట్ర స్పోర్ట్స్ పర్సన్ కన్నా రజనీ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి ప్రతిఒక్కరూ ఆటలాడాలన్నారు. తొలిరోజు ప్రకాశం, గుంటూరుకు చెందిన జట్లు తలపడ్డాయి. ప్రస్తుతం ఆరు జట్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

వైసీపీకి మరోసారి భారీ షాక్..!

20మంది కార్పొరేటర్లు జనసేనలోకి జంప్

బాలినేనితో కలిసి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమక్షంలో చేరిక

6 నుంచి 46కు చేరిన కూటమి సభ్యుల బలం

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో వైసీపీకి మరోసారి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన 20 మంది కార్పొరేటర్లు జనసేనలోకి జంప్ అయ్యారు. వారంతా మంగళవారం మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం సమక్షంలో జనసేనలో చేరారు. వారికి పవన్ కల్యాణ్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో ఒంగోలు కార్పొరేషన్‌లో టీడీపీ కూటమి బలం 46కు చేరుకోగా, వైసీపీ నలుగురికి పరిమితమైంది.

46కు పెరిగిన కూటమి బలం

ఒంగోలు కార్పొరేషన్‌గా ఏర్పాటైన తర్వాత తొలి పాలకవర్గం 2021 మార్చి 18న ఎన్నికైంది. అప్పట్లో వైసీపీ 43 డివిజన్లలో గెలుపొందగా, తెలుగుదేశం పార్టీ ఆరు డివిజన్లలో గెలుపొందింది. ఒక డివిజన్‌లో జనసేన విజయం సాధించింది. 43మంది సభ్యులతో మేయర్ స్థానాన్ని వైసీపీ కైవసం చేసుకుంది. మూడేళ్లపాటు వైసీపీ అధికారంలో పాలన సాగింది. 2024లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి ఊహించని విజయం సాధించడంతో మేయర్ గంగాడ సుజాతతోపాటు, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి మరో 16మంది సభ్యులు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరారు. దీంతో ఏడుగురుగా ఉన్న కూటమి సభ్యుల సంఖ్య 25కు చేరుకుంది. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్‌లు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉండటంతో కూటమి బలం 28కి పెరిగింది. దీంతో అధికారం కూటమి చేతిలోకి వెళ్లింది. దీంతో అప్పటి నుంచి టీడీపీ కూటమి సభ్యులు 26 మంది, వైసీపీ సభ్యులు 24మందితో కౌన్సిల్ సమావేశాలు నడుస్తున్నాయి. తాజా పరిణామాలతో వైసీపీకి చెందిన 20 మంది జనసేనలో చేరడంతో కూటమి సభ్యుల సంఖ్య 6 నుంచి 46కు పెరిగింది.

వైసీపీలో నలుగురు..

ప్రస్తుతం 11వ డివిజన్ కార్పొరేటర్ గంగవరపు ప్రవీణ్‌కుమార్, 14 డివిజన్ కార్పొరేటర్ షేక్ ఇమ్రాన్‌ఖాన్, 41వ డివిజన్ కార్పొరేటర్ కత్తినేని వెంకట మహాలక్ష్మి, ఇండిపెండెంట్‌గా గెలిచి వైసీపీలో చేరిన 45వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి వైసీపీలోనే కొనసాగుతున్నారు. వారితోపాటు కోఆప్షన్ సభ్యులు స్వర్ణ శ్యామ్‌సాగర్, షేక్ రషీదానాగూర్, మహ్మద్ నరతాజులు కూడా వైసీపీలోనే ఉన్నారు.

జనసేనలో చేరిన కార్పొరేటర్లు వీరే..

కోటపూరి సామ్రాజ్యం (1 డివిజన్), గుండు ధనలక్ష్మి(3), ఎండేటి పద్మావతి(5), చల్లా తిరుమల రావు(6), వెన్నపూస శోభరాణి(9), ఈదర వెంకట సురేష్ బాబు(19), యనమల నాగరాజు(21), కారంశెట్టి పుష్పలత(22), షేక్ ఇంతియాజ్(23), జడ వెంకటేష్(27), నీలంరాజు సరోజని(28), షేక్ ఫాతిమా(29), కాశీ మహంతి చంద్రకళ(30), తన్నీరు నాగజ్యోతి(31), తాడి కృష్ణలత(32), వెలనాటి మాధవరావు (డిప్యూటీ మేయర్)(34), ఢాకా సుజాత(36), గోలి లక్ష్మి కోటేశ్వరమ్మ(39), నూకతోటి మస్తానమ్మ(42), గోపిరెడ్డి గోపాల్ రెడ్డి(44), అలాగే కోప్షన్ సభ్యులు వర్ధు శేషయ్య, మహ్మద్ షేక్‌ఆలీ చేరిన వారిలో ఉన్నారు.



పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు, పక్కన బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రభుత్వ భూములు, ఆస్తులను కాపాడాలి

● సీసీఎల్ఏ జయలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములు, ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులదేనని సీసీఎల్ఏ జయలక్ష్మి స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ భూములన్నింటినీ పూర్తి స్థాయిలో గుర్తించేందుకు రీ సర్వే చేయాలని ఆదేశించారు. రీ సర్వే చేస్తున్న సిబ్బంది సకాలంలో హాజరయ్యేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో నమోదైన దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై నమోదయ్యే అర్జీలను పునఃపరిశీలన చేయాలన్నారు. భూముల రీ సర్వే తదితర అంశాలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. నిరభ్యంత ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి జీవో నెంబరు 30లోని నిబంధనలకు లోబడి క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, సర్వేశాఖ సహాయ సంచాలకులు గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాస్ హార్ట్‌కేర్‌లో నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌టీఆర్ వైద్యసేవ ద్వారా ఆరోగ్యశ్రీ వైద్యసేవలు బుధవారం నుంచి ఒంగోలులోని ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హార్ట్ కేర్ హాస్పిటల్‌లో ప్రారంభిస్తున్నట్లు హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ జి.ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చావల, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యశ్రీ వైద్య సేవల విభాగాన్ని మంత్రి డాక్టర్ స్వామి, ఒంగోలు, సంతనూతలపాడు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఏఎస్పీ కె.నాగేశ్వరరావులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ప్రజలందరూ ఆరోగ్యశ్రీ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎంఈవో కిషోర్‌బాబు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఎస్ఆర్ ఒలంపియాడ్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈకార్యక్రమాన్ని ఎంఈవో కిషోర్‌బాబు ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. శాస్త్రీయ దృక్పథాన్ని మరింతగా పెంచుకునేందుకు ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడుతాయని ఎంఈవో తెలిపారు. డివిజనల్ పీఆర్వో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా ఈ ప్రదర్శన నిర్వహించిన పాఠశాల ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ కళ్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలి




మాట్లాడుతున్న ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పాల్ ల్యాబ్ నిర్వహణపై శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతికత విద్యను అందించాలని ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు సూచించారు. ఒంగోలు నగరం రామనగర్ హైస్కూలులో జరుగుతున్న ప్రకాశం, బాపట్ల జిల్లాల పాల్ ల్యాబ్ టీచర్లు, హెచ్ఎంల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ భవిష్యత్‌లో అన్ని పాఠశాలలకు పాల్ ల్యాబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ మర్రి శ్రీనివాసరావు, పాల్ ల్యాబ్ జిల్లా కో ఆర్డినేటర్ బొడ్డు శ్రీనివాసరావు, సమగ్ర శిక్షణ సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

షాపుల అద్దె వేలానికి విశేష స్పందన

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో గత ఐదు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న షాపులకు మంగళవారం వేలం నిర్వహించారు. ఖాళీగా ఉన్న 12 షాపులను వేలయం వేయగా కార్పొరేషన్‌కు ఆదాయం చేకూరనుంది. షాపు నెంబర్లు 8,12,18,19,30,36,37,47,109,112,113,114 షాపులకు గతంలో అద్దె రూ.45,932 ఉండగా, పాటదారులు హెచ్చుపాట పాడి షాపులను దక్కించుకున్నారు. దీంతో ఇకపై పన్నెండు షాపుల నుంచి అద్దె రూ.73,125 పెరగ్గా, అదనంగా రూ.27,193 కార్పొరేషన్‌కు ఆదాయం పెరిగింది. అలాగే నగరంలోని వీధి వ్యాపారుల నుంచి ఆశీలు వసూలుకు బహిరంగ వేలం నిర్వహించగా, పాటదారుడు ఏడాదికి రూ.85లక్షలు చెల్లించేలా హక్కులు పొందినట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్ ఆనంద్‌మోహన్

మద్దిపాడు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని బీసీ, ఎస్సీ హాస్టళ్లలోని విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యుడు ఆనంద్‌మోహన్ మంగళవారం సాయంత్రం వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. దోమకాటు నుంచి రక్షణ పొందాలన్నారు. ఆయన వెంట వైద్య సిబ్బంది, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

శివరాత్రికి పసుకుదురు ఆలయం ముస్తాబు

● నేడు రామలింగేశ్వర స్వామి కల్యాణం



పసుకుదురు రామలింగేశ్వరస్వామి దేవస్థానం



శ్రీసంగమేశ్వరస్వామి ఆలయ వద్ద ఏర్పాటుచేసిన క్యూలైన్లు

పసుకుదురు (టంగుటూరు), ఫిబ్రవరి 25 : మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధి పసుకుదురులో ఉన్న శ్రీగంగా పర్వత వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం శివరాత్రి వేడుకలు ముస్తాబైంది. చారిత్రకమైన ఈ ఆలయంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 7గంటలకు గణపతి పూజతో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 8 గంటలకు రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. 9గంటలకు శివపార్వతుల కల్యాణం జరుగుతుంది. అందుకోసం ఉత్సవ విగ్రహాలను సిద్ధం చేశారు. రాత్రి 12గంటలకు లింగోద్భవ సమయంలో భక్తుల గోత్రనామాలతో రుద్రాభిషేకాలు కొనసాగుతాయి. మధ్యాహ్నం, రాత్రికి అన్నసంతర్పణ ఉంటుంది. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని భక్తబృందం ప్రతినిధి దివి హరిబాబు కోరారు.

సంగమేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి

పొన్నలూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నిపాడు సమీపంలోని పాలేరు ఒడ్డున వెలిసిన స్వయంభు సంగమేశ్వరస్వామి ఆలయం శివరాత్రి పూజలకు సిద్ధమైంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో బైరాగిచౌదరి బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేయించారు. బుధవారం వేకువ జామునుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి.

కొండపిలో..

కొండపి: మండలంలోని అన్ని శైవాలయాలు శివరాత్రి శోభను సంతరించుకున్నాయి. బుధవారం పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాదేవునికి పూజలు, కల్యాణం కోసం భక్తులు ఆలయాలను పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొండపిలోని శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి (స్వయంభు) ఆలయంలో స్వామి వారి కల్యాణం జరగనుంది. కామేపల్లి రోడ్డులోని శ్రీహరిహర పుత్ర అయ్యప్ప ఆలయం ఆవరణలో వేంచేసిన విశాలాక్షి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలోనూ కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. రెండుచోట్లా అన్నదానం నిర్వహించనున్నారు.



కొండపిలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయం

విదేశీ యూనివర్సిటీతో క్విస్ విద్యార్థుల ఇంటర్న్‌షిప్

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యూనివర్సిటీతో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ద్వారా క్విస్ ఇంజనీరింగ్ కళాశాల మరో ముందడుగు వేసింది. తమ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా క్విస్ కళాశాల యాజమాన్యం అవకాశాలు కల్పిస్తున్నది. కళాశాలలో సీఎస్ఈ అనుబంధ బ్రాంచీలకుచెందిన 30 మంది విద్యార్థులకు యూకేలోని ప్రఖ్యాత కార్డిఫ్‌మెట్రోపాలిటన్ యూనివర్శిటీలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్నారు. దాదాపు నెల రోజుల పాటు ఆన్‌లైన్ ద్వారా క్విస్ విద్యాసంస్థలు, కార్డిఫ్ మెట్రోపాలిటిన్ యూనివర్శిటీలు సంయుక్తంగా ఈ ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులకు అందించారు. ప్రొఫెసర్ రాజీరామచంద్రన్ పర్యవేక్షణలో విద్యార్థులు దీనిని పూర్తి చేసినట్లు సీఎస్ఈ హెచ్‌వోడీ బుజ్జిబాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, వైస్‌చైర్మన్ గాయత్రిలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ యూనివర్శిటీల్లో మరింత మంది విద్యార్థులను ఇంటర్న్‌షిప్ ఇప్పించేందుకు మరిన్ని యూనివర్శిటీలతో ఒప్పందాలు చేసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, వివిధ విభాగాల డైరెక్టర్లు, డీన్‌లు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

మద్దిపాడు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ హైస్కూలు హెచ్ఎం పెద్దిరెడ్డి కోటిరెడ్డి తన భార్య ఆదిలక్ష్మి పేరిట ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులకు రెండు జతల దుస్తులు, షూస్, పుస్తకాలు, జామెంట్రీ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ హెచ్ఎం కోటిరెడ్డి విద్యార్థుల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. మహాశివరాత్రిని ప్రజలందరూ ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో పూజించి సకల శుభాలు పొందాలని కోరారు.

- ప్రజలకు మాజీమంత్రి శిద్దా రాఘవరావు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

దామచర్ల శుభాకాంక్షలు

ఒంగోలు కార్పొరేషన్: జిల్లా ప్రజలకు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరు భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని, శివపార్వతుల ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

మద్దిపాడు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ దందాపై జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం దాడులు నిర్వహించి కొలచనకోట గ్రామానికి చెందిన ఒక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. మద్దిపాడులోని జాతీయ రహదారిపై వెళ్తున్న మరొక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. దీంతో ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేశారు.

సాయి సత్సంగకేంద్రం పునఃప్రారంభం

చీమకుర్తి, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలో ఎంఎస్ఆర్ కళాశాల సమీపంలో సాయిబాబా సత్సంగకేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఇటీవల కొన్ని నెలల క్రితం కళాశాల ప్రాంగణంలో ఉన్న సాయిసత్సంగకేంద్రాన్ని కొంతమంది వ్యక్తులు ధ్వంసం చేశారు. తిరిగి సత్సంగ కేంద్రాన్ని కళాశాల సమీపంలోనే భక్తులందరి సహకారంతో నిర్మించారు. ఈ సందర్భంగా పట్టణంలో సాయిబాబా నగరోత్సవాన్ని కనులపండవగా నిర్వహించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

సింగరాయకొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సినీనటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు కేవీ.ప్రదీప్ అన్నారు. సింగరాయకొండలోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు స్థిరమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వరరావు, జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో భూముల రీసర్వే చేయాలి

● జేసీ గోపాలకృష్ణ



రైతులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేను యజయానుల సమక్షంలో చేయాలని, ఇందుకోసం ముందుగా వారికి నోటీసులు ఇవ్వాలని జేసీ గోపాలకృష్ణ సూచించారు. ఎవరైనా రైతులు విదేశాల్లో ఉంటే వారితో వాట్సాప్ కాల్ చేసి మాట్లాడాలని సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఒంగోలు మండలం యరజర్లలో రీసర్వేపై రైతులతో జేసీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేపై ప్రతి రైతులతో సిబ్బంది మాట్లాడాలన్నారు. గ్రామంలోని భూములను పూర్తిస్థాయిలో సర్వే చేయాలని చెప్పారు. మండల సర్వేయర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ యరజర్ల గ్రామ పరిధిలో 2,484 ఎకరాల భూమి ఉందన్నారు. అయితే సర్వేలో 9ఎకరాలు మాత్రమే తగ్గిందని, ఇందులో వాగులు, వంకలు, డొంకలు, గ్రామ పరిధిలో భూమి, కొండ ప్రాంతం ఉందని చెప్పారు. ఆక్రమణలు గుర్తించి మార్క్ చేసినట్లు జేసీకి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాసు, వీఆర్వో ప్రవీణ్ పాల్గొన్నారు

వాహనం ఢీకొని దుప్పికి గాయాలు



గాయపడిన దుప్పి

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వన్యప్రాణిదుప్పికి గాయాలైన ఘటన నల్లమల అటవీ ప్రాంతంలోని చట్టు తాండా సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. అటవీ శాఖాధికారులు తెలిపిన కథనం ప్రకారం, మహా శివరాత్రి పండుగ సందర్భంగా శ్రీశైలానికి భక్తులు వెళ్లేందుకు 24గంటల పాట వాహనాల రాకపోకలను అనుమతించారు. ఈ క్రమంలో దుప్పి ఘాట్ రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో దుప్పి కాలికి గాయమైంది. నడవ లేక రోడ్డు పక్కనే పొదలో పడుకొంది. గుర్తించిన అటవీశాఖ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రేంజి అధికారి జీవన్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని దుప్పిని పరిశీలించి వైద్యం కోసం నంద్యాల జిల్లా ఆత్మకూరుకు పశువైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

బసవన్నపాలెంలో ఉత్సాహంగా ఫేర్‌వెల్ వేడుకలు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మద్దిపాడు,ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి) : బసవన్నపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలు మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి హాజరై క్లస్టర్ హెచ్ఎం ముచ్చు రామారావు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదివి పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, నాయకులు బెజవాడ రఘుబాబు పరీక్షలను ఒత్తిడి లేకుండా ఎలా రాయాలనే విషయంతోపాటు అనుసరించాల్సిన మెలకువలను వివరించారు. 550 మార్కుల కన్నా ఎక్కువ తెచ్చుకున్న ప్రతి విద్యార్థికి పదివేల రూపాయలను ప్రోత్సాహకంగా అందజేస్తాని తెలుగు పండిట్ మద్దాళి చంద్రశేఖర్ ప్రకటించారు. విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్, పెన్నులు బహూకరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం చెన్నారెడ్డి పిచ్చిబాబు, కరణం శ్రీనివాసరావు, జోనాతాన ప్రసాద్, శివపార్వతి, మజ్ను బీబీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ముగిసిన శిక్షణ

కొండపి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక హైస్కూల్‌లో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ ముగిసింది. చివరిరోజైన మంగళవారం పాఠశాల సంసిద్ధత కార్యక్రమాలపై కార్యకర్తలు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా స్టాల్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజనేయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విక్టోరియారాణి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి: సీపీఎం

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): కొప్పోలు రోడ్డులో ఇటీవల తొలగించిన ఆక్రమణల్లో గృహాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణ తొలగింపులో గృహాలను కోల్పోయిన బాధితులను వారు కలిసి మాట్లాడారు. ఇళ్లు కోల్పోయిన వారిలో పేదలు ఉన్నారని, వారికి అధికారులు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసరావు, ఏడీ.హుసేన్, బి.పేతురు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

బెల్టుషాపులపై దాడి

● 12 మద్యం సీసాలు స్వాధీనం

కంభం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్బన్ కాలనీలో ఓ దుకాణంలో అక్రమంగా మద్యం కలిగి ఉండగా సీసాలతో పాటు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో అర్ధవీడు మండలం యాచవరం గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నారు. 12 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ కొండారెడ్డి మాట్లాడుతూ బెల్టుషాపులు ఎవరు నిర్వహించినా, అక్రమంగా మద్యం కలిగి ఉన్నా సమాచారం అందించాలని తెలిపారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

గిద్దలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాచర్ల బస్టాండ్‌లో చిన్నపాటి హోటల్ నడుపుకుంటున్న బొంతల కుమారి అనే మహిళపై సమీపంలోనే చికెన్ కొట్టు నడుపుతున్న జాఫర్ అనే వ్యక్తి దాడి చేశాడు. దాంతో కుమారి తలకు గాయమైంది. దీంతో ఆమె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాత కక్ష్యలే దాడికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన దుప్పి

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వన్యప్రాణిదుప్పికి గాయాలైన ఘటన నల్లమల అటవీ ప్రాంతంలోని చట్టు తాండా సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. అటవీ శాఖాధికారులు తెలిపిన కథనం ప్రకారం, మహా శివరాత్రి పండుగ సందర్భంగా శ్రీశైలానికి భక్తులు వెళ్లేందుకు 24గంటల పాట వాహనాల రాకపోకలను అనుమతించారు. ఈ క్రమంలో దుప్పి ఘాట్ రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో దుప్పి కాలికి గాయమైంది. నడవ లేక రోడ్డు పక్కనే పొదలో పడుకొంది. గుర్తించిన అటవీశాఖ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రేంజి అధికారి జీవన్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని దుప్పిని పరిశీలించి వైద్యం కోసం నంద్యాల జిల్లా ఆత్మకూరుకు పశువైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

జయరాంపురంలో పొగాకు బేళ్ల చోరీ

● లబోదిబోమంటున్నరైతు



పొగాకు చోరీకి గురైన ప్రాంతం

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జయరాంపురం గ్రామంలో పొగాకు బేళ్ల చోరీ జరిగింది. గ్రామానికి చెందిన మోడి రంగస్వామి తన పొలంలో పొగాకు బేళ్లను ఉంచారు. సోమవారం రాత్రి దొంగలు ట్రాలీవాహనంలో వీటిని తరలించినట్లు సమాచారం. గ్రామశివార్లలో పొగాకును ఉంచడం వలన దొంగతనం జరిగిందని పోలీసులు తెలిపారు. బేళ్ల విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని రైతు రంగస్వామి తెలిపాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చెంచుగూడెంలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపాలెం పరిధిలోని ప్రకాష్‌నగర్ చెంచుగూడెంలో వైద్యులు కోటా నాయక్ అధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు టీకాలు వేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బాల అంకమ్మ, ఆశవర్కర్ ఎన్ ఆదిలక్ష్మి, సీహెచ్ డబ్ల్యూ కె వెంకటమ్మ, డ్రైవర్ ఎస్.వెంకట రామయ్య సిబ్బంది పాల్గొన్నారు.









మార్కాపురంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణ, గిద్దలూరులోని పాతాళనాగేశ్వరస్వామి ఆలయం, మార్కాపురంలో శివపార్వతులుగా చిన్నారులు కంభంలోని కాశీవిశ్వనాథ కోటేశ్వరస్వామి దేవాలయం

శైవక్షేత్రాల్లో శివరాత్రి శోభ

- శ్రీశైలానికి పోటెత్తుతున్న భక్తులు
- నల్లమల అటవీమార్గంలో కాలినడక ముక్కంటి దర్శనానికి బారులు
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానాలు

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గిద్దలూరు ప్రాంతంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఆయా దేవాలయాలను పూలమాలలతో, విద్యుత్‌దీపాలతో అలంకరించారు. గిద్దలూరు పట్టణంలోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవాలయం వద్ద ఏర్పాట్లను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక చొరవతో దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. ఇందుకోసం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తాత్కాలికంగా కమిటీని ఏర్పాటు చేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిష్ఠించిన శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవాలయానికి గిద్దలూరు పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీగా హాజరుకానున్నారు. ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రిభోజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం స్వామి వారి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. అదేవిధంగా కే.ఎస్.పల్లె సమీపంలోని ఎగువ భీమ లింగేశ్వరస్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు. ఇందుకోసం దేవస్థాన కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. శివరాత్రి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ముండ్లపాడులోని శివాలయంలో, పలుపులవీడు వద్ద భక్తులు అధికంగా రానున్న దృష్ట్యా ఆయా దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేశారు.

● **శైవక్షేత్రాల ముస్తాబు**

కంభం : నేడు శివరాత్రి పర్వదినం సందర్భంగా కంభం మండలంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు శివనామస్మరణతో మునిగిపోతున్నాయి. మండలంలోని తురిమెళ్ల పంచాయతీ పరిధిలోని శ్రీకనక సురభేశ్వర కోన, రావిపాడులోని కోటేశ్వరస్వామి దేవాలయం, చిన్న కంభంలోని శ్రీవీరభద్రస్వామి దేవాలయం, కంభంలోని గుండ్లకమ్మ ఒడ్డున వెలసిన శ్రీకాశీవిశ్వనాథ కోటేశ్వర స్వామి దేవాలయం, కంభంలోని శివాలయాలు శివ రాత్రి పర్వదినానికి ముస్తాబయ్యాయి. ఆలయాలకు రంగులు వేసి దీపాలతో అలంకరించారు.

● **యాత్రికులకు సూచన**

గిద్దలూరు : గిద్దలూరు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన గుండ్లబ్రహ్మేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులకు అటవీశాఖ అధికారులు పలు సూచనలు చేశారు. కేవలం మహాశివరాత్రి 26వ తేది మాత్రమే దిగువమెట్ట నుండి గుండ్లబ్రహ్మేశ్వర దేవాలయానికి వెళ్లేందుకు అనుమతి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే వాహనాల్లో వెళ్లేందుకు అనుమతి ఇస్తామన్నారు. దర్శనం అయిన తరువాత సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే తిరుగు ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో వాహనాల వేగం 10 కిలోమీటర్లకు మించరాదన్నారు. అడవిలో హారన్ మోగించరాదని, మధ్యలో వాహనాలను నిలుపరాదని తెలిపారు. మోటార్ సైకిళ్లు, ట్రాక్టర్లు, ఆటోలకు అనుమతి లేదని పేర్కొన్నారు. పాదయాత్ర ద్వారా కూడా వెళ్లకూడదని తెలిపారు.

● **శివస్వాములకు అన్నదానం**

పెద్దారవీడు : షిరిడీ సాయిబాబా అన్నదాన సేవా సమితి, చట్టమిట్ట వారి ఆధ్వర్యంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి వెంట ఏర్పాటు చేసిన శిబిరంలో శివ దీక్షదారులు, శ్రీశైలం వెళ్లే యాత్రికులకు మంగళవారం అన్నదానం ప్రారంభించారు. ఉభయదాత మూలా దాసిరెడ్డి సుమారు వెయ్యి మంది యాత్రికులకు అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శివరాత్రి పర్వదినం, మరుసటి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

● **అంగన్‌వాడీల ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు**

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక రెడ్డి బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆరు రోజుల శిక్షణలో భాగంగా మంగళవారం శివరాత్రి వేడుకలు నిర్వహించారు. చిన్నారులతో శివపార్వతుల అలంకరణ చేసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

● **వేడుకగా ధ్వజారోహణం**

మార్కాపురం వన్‌టౌన్ : మహాశివరాత్రిని పురస్కరించుకొని పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో స్వామికి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు ఆంజనేయ శర్మ, వరుణ్‌తేజ శర్మల ఆధ్వర్యంలో భేరీ పూజ, ప్రమిదగణ ఆహ్వానం అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

● **నిర్మమహేశ్వరుడికి గ్రామోత్సవం**

పొదిలి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పార్వతీసమేత నిర్మమహేశ్వరుడు మంగళవారం పుర వీధుల్లో పార్వతీపరమేశ్వర అలంకరణలో భక్తులకు దర్శమిచ్చాడు. భక్తులు స్వామివారికి కాయకర్పూరం సమసర్పించి భక్తిని చాటుకున్నారు. తెల్లవారు జామున స్వామివారి కల్యాణం, గజోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు వాసు తెలిపారు.

● **శ్రీశైలానికి పోటెత్తిన భక్తజనం**

పెద్దదోర్నాల, : మహాశివరాత్రి పర్వదినం వేడుకలు శ్రీశైలంలో వారం రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో పాల్గొనేందుకు లక్షలాది మంది భక్తులు ప్రభుత్వ ప్రైవేటు వాహనాల్లో శ్రీశైల క్షేత్రం చేరుకుంటున్నారు. మరికొందరు భక్తులు నల్లమల అటవీ ప్రాంతం నుంచి నడక మార్గంలో శ్రీశైలం చేరుకుని గౌరీశంకరులను దర్శించుకుంటున్నారు. ఆంధ్రలోని రాయలసీమ, కర్ణాటకతో సహా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు కాలినడకన ప్రయాణిస్తున్నారు. అయితే వారి వాహనాలు మాత్రం దోర్నాల మీదుగా శ్రీశైలం చేరు కుంటాయి. ఈ క్రమంలో దోర్నాలలో రద్దీ ఏర్పడింది. దక్షిణకాశీగా పేరొందిన శ్రీశైలానికి పండుగ సందర్భంగా భక్తులు పోటెత్తుతున్నారు. వీరి ఆకలిదప్పులు తీర్చేందుకు పలు సంస్థలు ధార్మిక, స్వచ్ఛంద సంస్థలు దాతృత్వం చాటుకున్నాయి. చట్టుతాండా వద్ద పెద్ద మైదానంలో పెద్ద బొమ్మలా పురం గ్రామకమిటీ ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం అల్పాహారం అందజేస్తున్నారు. మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. దోర్నాలలోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద బండారు సుబ్బనారాయణ ఆధ్వర్యంలో, మరి కొద్ది దూరంలో కాపు సంఘం ఆధ్వర్యంలో ఎస్సై మహేష్, పెద్దవంతెన వద్ద రెడ్లసంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. తహసీల్దారు కే.శాంతి, డిప్యూటి తహసీల్దారు సాలమ్మ, ఎంపీడీవో నాసర్‌రెడ్డిలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అరుణాచలం శివసేన ఆధ్వర్యంలో మొబైల్ వాహనం ద్వారా అటవీ మార్గంలో ప్రయాణించే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.











దోర్నాలలో భోజనం వడ్డిస్తున్న ఎరిక్షన్‌బాబు, పొదిలిలో నిర్మమ హేశ్వరుడి గ్రామోత్సవం, దోర్నాలలో కాలినడక భక్తులకు అన్నదానం, పెద్దారవీడులో శివస్వాములకు అన్నదానం, గిద్దలూరులో పాతాళనాగేశ్వరుడు

ఉన్నత విద్యకు పదో తరగతి పునాది



విద్యార్థులతో పాటు ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యకు పదో తరగతి పునాది వంటిదని, పరీక్షల్లో మంచిమార్కులు సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకోరావాలని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం, ఫేర్‌వెల్ కార్య క్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎరిక్షన్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టం తో కాకుండా ఇష్టంతో చదువులో రాణించాలని సూచించారు. ముందుగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలు పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం, చైర్మన్, ఉపాధ్యాయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు నైపుణ్యం అవసరం



బహుమతులు అందజేస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు కృష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సాహితి జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థుల ఫేర్‌వెల్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద కుటుంబానికి సమాజంలో ఉన్నతస్థానం కలుగాలంటే విద్య ద్వారానే సాధ్యమన్నారు. సాధారణ వ్యక్తులను సైతం ప్రపంచం గర్వించే స్థాయికి చేర్చేది విద్య ఒక్కటే అన్నారు. జేవీవీ నాయకులు పి.స్వరూపారెడ్డి మాట్లాడుతూ జీవితం పరీక్షల కంటే ఎంతో విలువైనదన్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.కొండారెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అపరిశుభ్రత లేకుండా చూడాలి

● కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశం

పొదిలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :శివరాత్రి పండుగ సందర్భంగా వీధులను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు కోరారు. శివరాత్రి సందర్భంగా భక్తులకు అన్నదానం, నీటిసౌకర్యం, శీతల పానియాల స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటారు. ఆప్రాంతాల్లో తప్పకుండా డ్రమ్ములు ఏర్పాటు చేసి ఉపయోగించిన ప్లేట్లు, గ్లాసులు డ్రమ్ముల్లో వేయించాలని నిర్వాహకులకు సూచించారు. తద్వారా ఆ ప్రాంతం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉంటుందన్నారు. కనుక నిర్వాహకులు సహకరించాలన్నారు.

గోవులకు దాణా అందజేత



ఆవులకు మేత అందిస్తున్న దాతలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మున్సిపాలిటీ కార్యాలయం వెంబడి ఉన్న తాత్కాలిక గోశాలలో గోవులకు అవసరమైన దాణాను దాతలు అందజేశారు. ఆకుకూరలు, కూరగాయలు, ఎండుగడ్డి, నల్లబెల్లం, తౌడు తదితర దినుసులు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కంభం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం హజరత్‌గూడెం ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపీడీవో వీరభద్రాచారి మంగళవారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. పాఠశాల వసతులు, సౌకర్యాలను, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయాన్ని, డిజిటల్ తరగతులను, పాఠశాల నిర్వహణ తీరును ప్రశంసిం చారు. ఇటీవల డాక్టరేట్ అందుకున్న ప్రధానోపాధ్యాయురాలు సరోజనను ఎంపీడీవో అభినందించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రామ్‌దాస్‌నాయక్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీల జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులు భాగంగా 6 రోజుల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ఈసీసీఈ ప్రాముఖ్యత, ఇటీవల వచ్చిన పాలసీలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో శర్వాణి, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించండి



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

కంభం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం పగటివేళ నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన కంభం 132/11 కేవీ సబ్ స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఎక్కడా లోపం లేకుండా చూడాలన్నారు. అలాగే అర్ధవీడు మండలంలో పెరిగిన విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొహిద్దీన్‌పురం ఫీడర్‌లో లోడు తగ్గించేందుకు అదనంగా మరో ఫీడర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ డీఈ సత్యనారాయణ, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పోస్టుకార్డు ఉద్యమం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి వర్గం ఆమో దించిన ఆప్కాస్ రద్దును ఉపసంహరించు కోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మంగళవారం స్థానిక హెడ్ పోస్టాఫీస్ ఎదురు పోస్ట్‌కార్డు ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సోమయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల మీద కక్షతో కార్మికులను బలిపశువులు చేస్తున్నారని విమ ర్శించారు. పరిపాలనలో ఎంతో అనుభవం ఉన్న సీఎం చంద్రబాబునాయుడు కార్మికుల పక్షాన నిలబడి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, షేక్ ఇమాంసా, పఠాన్ సలాంఖాన్, నాసరయ్య, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల ధర్నా

గిద్దలూరు : పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట సివిల్ సప్లై గోడౌన్‌లో పని చేసే హమాలి కార్మికులు సమస్యల పరిష్కారం కోసం మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుమలరావు మాట్లాడుతూ సివిల్‌సప్లై గోడౌన్‌లలో పనిచేస్తున్న కార్మికులకు బస్తాల ఎత్తుడు, దించుడు కూలి రూ.25 నుంచి రూ.28కి పెంచుతున్నట్లు 2024 జనవరి 1న గత వైసీపీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇంతవరకు పెంచిన కూలీ రేట్లను అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కూలి రేట్లు పెంచుతూ వెంటనే జీవోను విడుదల చేయాలని కోరారు. వయస్సు రీత్యా రిటైర్ అయిన హమాలీ కార్మికుల అకౌంట్లలో పీఎఫ్ జమ చేయాలని కోరారు. ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ప్రమాద భీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ధర్నా అనంతరం తహసీల్దార్ ఆంజనేయరెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆవులయ్య, థామస్, కార్మిక సంఘం నాయకులు ఓబులేసు, శ్రీనివాసులు, పిచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సమయకు సన్మానం



డాక్టర్ సమయ దంపతులను సన్మానిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గిద్దలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవరాయునిపేట ఆరోగ్య ప్రాథమిక కేంద్రంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ షేక్ సుమయను ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది సన్మానించారు. మాస్టర్ ఆఫ్ సర్జరీ చదివేందుకు ఆమెకు సీటు లభించింది. దీంతో ఉన్నత చదువులు చదివేందుకు వెళుతున్న సమయను, ఆమె భర్త డాక్టర్ రసూల్‌ను సన్మానించి వీడ్కోలు పలికారు. కరోనా సమయంలో డాక్టర్ సుమయ చేసిన సేవలను ఈసందర్భంగా కొనియాడారు.

'ఫార్మర్ రిజిస్ట్రేషన్'పై అవగాహన

తర్లుపాడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని కలుజువ్వలపాడు, జంగంరెడ్డిపల్లెలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న, మిరప పంటలను పరిశీలించి మాట్లాడారు. రైతులు 11 అంకెలు గల విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. దీంతో ప్రభుత్వం అందజేసే పథకాలు వర్తిస్తాయన్నారు. ప్రస్తుతం రైతులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాకులు బ్రొహ్మయ్య, మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల కోసం సాయం

పామూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చట్టుమడుగు గ్రామానికి చెందిన బద్దిపూడి జార్జి అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్యఅవసరాల కోసం మానవతా సంస్థ దాత మిరియం రామారావు సహకారంతో రూ.10 వేలను మంగళవారం అందజేశారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎం మునలయ్య, టీ రమేష్, టీ వెంకటేశ్వరరావు, వీ వెంకటేశ్వరరెడ్డి, పీ తిరుపతిరెడ్డి, బాబు, కృష్ణయ్య పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేసి రైతులకు పారదర్శక సేవలు అందించాలని తహసీల్దార్ ఇమ్మానియేల్‌రాజు, ఏవో బ్రహ్మసాదరావులు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్వో, వీఏఏలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేస్తూ ఈ క్రాప్ నమోదు, ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో వీఏఏలు చేసిన రికార్డులు సక్రమంగా ఉన్నాయా, లేవా అని పరిశీలించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశానుసారం రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ ప్రశాంత్, మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శివాలయాలు ముస్తాబు

మహాశివరాత్రి వేడుకలకు కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో సర్వాంగ సుందరంగా సిద్ధమవుతున్న పలు దేవాలయాలు



నారాయణస్వామి దేవస్థానానికి విద్యుత్ ధగధగలు



దర్శి శివాలయానికి విద్యుత్ దీపకాంతులు

దర్శి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలకు మండలంలోని శివాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దర్శి పట్టణంలోని అన్నపూర్ణ సమేతా, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామిని నగరోత్సవం చేసేందుకు రథాన్ని అలంకరిస్తున్నారు. మండలంలోని కొర్లమడుగు, పొతకమూరు, పోతవరం శివాలయాలు శివరాత్రి వేడుకలకు ముస్తాబవుతున్నాయి. ఆలయాల నిర్వాహకులు అన్ని చోట్ల ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అధికసంఖ్యలో భక్తులు శివాలయాలకు వచ్చి పూజలు చేసే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. రథోత్సవం సందర్భంగా దర్శిలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు

పామూరు/సీఎస్‌పురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పండుగ వేడుకలకు పామూరు, సీఎస్ పురం మండలాల్లోని పలు శైవక్షేత్రాలను రంగురంగుల విద్యుత్ లైట్లతో ముస్తాబు చేస్తున్నారు. సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి, పెదరాజుపాలెంలోని కూడలి సంగమేశ్వర స్వామి దేవస్థానాల్లో బుధవారం జరగనున్న మహాశివరాత్రి వేడుకలకు అన్నిరకాల ఏర్పాట్లను దేవదాయ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్తి చేశారు. అలాగే పామూరు మండలంలోని అనుమునిగిరి క్షేత్రం, పామూరులోని వల్లీ భుజంగేశ్వర, దాదిరెడ్డిపల్లిలోని పార్వతి సమేత నీలకంఠేశ్వరుడు, పడమట కట్టకిందపల్లిలోని పార్వతీ సమేత దుర్గామల్లేశ్వరుడు, మోపాడులోని గొంది మల్లేశ్వరుడు, బొట్లగూడూరులోని రామలింగేశ్వరుడు, గోపాలపురం వద్ద నూతనంగా నిర్మించిన పార్వతీ పరమేశ్వరుని దేవస్థానాల్లో మహాశివరాత్రి పండుగ ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు ఆలయ నిర్వాహకులు చెప్పారు. దాతల సహకారంతో దేవస్థానం తరఫున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాట్లు చేసినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, సీఐ భీమానాయక్ తెలిపారు.

చిన్నతరహా నీటి వనరుల అభివృద్ధికి కృషి చేయాలి

నీటిపారుదల గణాంకాధికారి వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న అధికారి వేణుగోపాల్‌రెడ్డి

కనిగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : చిన్నతరహా నీటి వనరుల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా చిన్న తరహా నీటి పారుదల గణాంకాధికారి వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం కనిగిరి నియోజకవర్గస్థాయిలో రెవెన్యూ అధికారులు, సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపరితల నీటి వనరుల కింద చెరువులు, నీటి కుంటలు, చెక్‌డ్యాంలు, ఎత్తిపోతల పథకాలను, భూగర్భజల నీటి వనరుల కింద బావులు, బోర్లను సర్వే నెంబర్లు వారీగా సేకరించాలని చెప్పారు. అదేవిధంగా ప్రస్తుత స్థితి, నిర్మాణ వ్యయం, లోతు, వాటి ఆయకట్టుతో పాటు 2023-24లో పారుదల అయిన విస్తీర్ణం, నీటిని తోడేందుకు వాడుతున్న యంత్రాల వివరాలు, ఇంధనం (విద్యుత్ సోలార్ పవర్, విండ్ పవర్) లాంటి విధానలపై అవగాహన కల్పించారు. నీటి పంపిణీకి అనుసరిస్తున్న పైపులు, డ్రిప్, స్ప్రింకర్లు పనిచేయకపోవటానికి గత కారణాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కేంద్ర జలవనరుల శాఖ ఆదేశాల ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నీటి వనరుల్లో లభ్యత పెంచేలా, భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకుని ఆహారధాన్యాల కొరతను నిరోధించేందుకు రైతులు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే విధానాలను అమలు చేయటమే లక్ష్యంగా చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవిశంకర్, డివిజన్ ఉపగణాంకాధికారి సుధాకర్, అధికారులు పీవీ రమణారెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలను వినియోగించుకోవాలి

కనిగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులు ఉచిత వైద్యసేవలు వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ చెప్పారు. మున్సిపల్ కమిషనర్ జోసఫ్‌డానియేల్ ఆధ్వర్యంలో పవర్ 9 హెర్బల్ కంపెనీ వారిచే స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉచిత వైద్యసేవా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరాన్ని ప్రారంభించిన చైర్మన్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యులు కార్మికులు సంక్షేమం కాంక్షించి వేద్యసేవలు అందించి ఉచితంగా మందులు ఇవ్వటం అభినందనీయమన్నారు. ఎంతో ప్రయాసలు కోర్చి విధులు నిర్వర్తించే మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండేందుకు ఇలాంటి వైద్యశిబిరాలు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, మెప్మా సిబ్బంది, అరుణోధర్, పులి శ్రీను, బొట్టు శ్రీను, నాయబ్‌రసూల్, సుభాని, డాక్టర్ ఖాశిం పాల్గొన్నారు.

బైకు అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

పీసీపల్లి, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి) : బైకు అదుపు తప్పడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని పెదఅలవలపాడు కంకరమిల్లు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు... బాపట్ల జిల్లా మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి చెందిన ఓబులేసు పొన్నలూరు మండలంలో పచ్చాకు కొట్టుడుకు కూలీగా వచ్చాడు. మంగళవారం తన బైక్‌పై పెదఅలవలపాడుకు వచ్చి వెళ్తుండగా కంకరమిల్లు సమీపంలో అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఓబులేసు తల, నుదుటిమీద తీవ్ర గాయాలయ్యాయి. అటు వెళ్లేవారు 108కు సమాచారం అందించారు. 108సిబ్బంది బాధితుడిని కనిగిరి వైద్యశాలకు తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

అవీఇవీ

పామూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎంపీడీవో బ్రహ్మయ్య చెప్పారు. మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో జరుగుతున్న పీ 4 సర్వే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. సర్వేలో వాస్తవ లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలని ఆయన ఆదేశించారు.

కందులు విక్రయించేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పీసీపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రైతులు సాగుచేసిన కందులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి కె.ప్రకాశరావు చెప్పారు. మండలంలోని నేరేడుపల్లి, మురుగుమ్మి గ్రామాల్లో మంగళవారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటా కందులను 7,500రూపాయలకు రైతుసేవాకేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు రైతుసేవా కేంద్రాలకు వెళ్లి వీఏఏల దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఏఏ సాయి ప్రియ పాల్గొన్నారు.

రైతు వివరాల నమోదు తప్పనిసరి

పామూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్టర్‌లో భూ వివరాలను నమోదు చేసుకోవాలని ఏవో కే రాధ చెప్పారు. మండలంలోని దూబగుంట, ఇనిమెర్ల గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ నెల 28 తేదీలోగా నమోదు చేసుకోవాలని ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కే చిన వెంకటస్వామి పాల్గొన్నారు.

మాధవరం యూపీ స్కూల్ చుట్టూ పేడదిబ్బలు



యూపీ స్కూల్ పక్కనే చెత్తచెదారం, దిబ్బలు

తాళ్లూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం యూపీ స్కూల్ ప్రహరీ చుట్టూ చెత్తాచెదారం, పేడదిబ్బలు ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గ్రామ నడిబొడ్డున ఉన్న యూపీ స్కూల్ అనుకుని అంతా అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. స్కూల్ చుట్టూ నివాసం ఉండే గేదెల యజమానులు నిత్యం పేడను ప్రహరీ అనుకుని ఉన్న రోడ్డులో దిబ్బలుగా వేస్తున్నారు. అంతేగాక కొందరు ఆ ప్రాంతాన్ని బహిర్భూమిగా వాడుతున్నారు. దుర్గంధం వెదజల్లుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

బోర్డుకే పరిమితమైన పారిశ్రామిక కారిడార్

ఆ ప్రాంతాన్ని సందర్శించిన సీపీఎం బృందం

దొనకొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వం దొనకొండలో ప్రకటించిన పారిశ్రామిక కారిడార్ బోర్డుకే పరిమితమైందని, 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులు ప్రారంభించి పరిశ్రమలు స్థాపించాలని సీపీఎం జిల్లా నాయకులు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్ ప్రాంతాన్ని సీపీఎం నేతలు మంగళవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరుపల్లి అంజయ్య, కేవీ పిచ్చయ్య, కుందుర్తి చిన్ననర్సింహులు, ప్రభాకరరావు, కోలా కిరణ్‌కుమార్, కాశయ్య పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం

పీసీపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు గత 6 రోజులుగా నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమాల్లో అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో శారీరక, మానసిక, భాషాపరమైన, సాంఘిక-భావోద్వేగ, సృజనాత్మకతను పెంపొందించాలని రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాసులు, నరసింహులు చెప్పారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు తయారుచేసిన పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన బోధనా టీఎల్ఎంలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఆంజనేయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ జరీనా పోష్ పాల్గొన్నారు.

శిక్షణలో నేర్చుకున్న అంశాలకు అనుగుణంగా బోధించాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంతో నేర్చుకున్న అంశాలకు అనుగుణంగా బోధన చేయాలని దర్శి ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ భారతి చెప్పారు. స్థానిక వీకే ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ శేషగిరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, డీఆర్పీలు జి.వి. శివరామిరెడ్డి, శ్రీమన్నారాయణ, చంద్రిక పాల్గొన్నారు.

శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలి

పామూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శ్రద్ధగా చదివి రానున్న పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని బొట్లగూడూరు ప్రభుత్వ వైద్యశాల హరిబాబు చెప్పారు. స్థానిక వివేక ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పలు క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రామిరెడ్డి, డైరెక్టర్లు, జయరామిరెడ్డి, భాస్కరరావు పాల్గొన్నారు.

భయం వీడితే జయం చేకూరుతుంది

దొనకొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పరీక్షల భయం వీడితే జయం చేకూరుతుందని దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు చెప్పారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్‌డే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన మెళకువలను పలువురు ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

దొనకొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందవరం జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతికి చెందిన 38 మంది విద్యార్థులకు టీడీపీ నాయకులు యగ్గోని యల్లారెడ్డి, పిల్లి ఓబుల్‌రెడ్డిలు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన పాఠశాలల్లో ఫేర్‌వెల్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎం చిన్నపోలయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

సీఎస్‌పురం(పామూరు) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : స్వయంకృషి సేవా సంస్థ తరఫున షేక్ నాయబ్‌రసూల్ కేజీబీవీ లోని పదో తరగతి విద్యార్థులకు పరిక్ష సామగ్రిని సమాకూర్చడం అభినందనీయమని ఎంపీడీవో రంగసుబ్బరాయుడు చెప్పారు. స్థానిక కేజీబీవీలో ప్రిన్సిపాల్ షేక్ రేష్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో షేక్ నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.


• నాడు-నేడు నిర్లక్ష్యం.. పొంచిఉన్న ప్రమాదం!



దర్శి (ఆంధ్రజ్యోతి)

ప్రమాదం.. పెళ్లో, పేరంటమో కాదు, ముందే చెప్పి రావడానికి.. ఏ మూల నుంచో, ఏ వైపు నుంచో, ఏ సెకనులోనూ రెప్పపాటున ఒక్కసారిగా విరుచుకుపడుతుంది. జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమం పేరుతో పాఠశాలల రూపురేఖలు మారుస్తామని ఆర్భాటంగా అమలు చేసినా చాలాచోట్ల సరిపడా నిధులు ఇవ్వకపోవడం వలన భవన నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. అయితే విద్యార్థులు.. తెలిసో, తెలియకో పాఠశాల ఖాళీ సమయాల్లో ఆ భవనాల శ్లాబులపైకి ఎక్కి కూర్చుంటున్నారు. చుట్టూ రక్షణ లేని వాటి మీద ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం సంభవిస్తుంది. ఇందుకు ఉదాహరణే దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఇక్కడ మధ్యలో నిలిచిన మూడంతస్తుల తరగతి గదుల భవనంపై విద్యార్థులు రోజూ పైకి ఎక్కి సందడి చేస్తున్నారు. ఉపాధ్యాయులు కూడా ఆ విషయాన్ని గుర్తించలేదు. పొరపాటున జారిపడితే పెను ప్రమాదం సంభవించే పరిస్థితి ఉంది. టీడీపీ ప్రభుత్వంలోనైనా నిధులు కేటాయించి ఆ భవనాలను పూర్తిచేస్తే విద్యార్థులకు అనువుగా ఉంటుంది.





విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్న కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధి



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వర స్వామి



ప్రత్యేక అలంకరణలో గోవాడ బాలకోటేశ్వరస్వామి



విద్యుత్ వెలుగుల్లో పెదకాకాని ఆలయం



అమరావతిలో చలువ పందిళ్లు



క్వారీ ఆలయం వద్ద ఏర్పాట్లు

శివ పూజకు వేళాయే

నేడే మహా శివరాత్రి తిరునాళ్ల



కోటప్పకొండపై నందీశ్వరుడికి అభిషేకం

- విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా కోటప్పకొండ
- తిరునాళ్లకు త్రికూటాద్రి ముస్తాబు
- గ్రామాల నుంచి కొండకు పయనమైన విద్యుత్ ప్రభలు
- కోటయ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఆనం
- అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభం
- అమరావతి, కాకాని, గోవాడ, క్వారీ సహా శైవక్షేత్రాల్లో భారీగా ఏర్పాట్లు

మహా శివరాత్రికి.. శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. విద్యుత్ వెలుగుల్లో కోటప్ప కొండ సహా శైవక్షేత్రాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలతో ఉత్సవాలను ప్రారంభించేందుకు అర్చకులు, అధి కారులు సకలం సిద్ధం చేశారు. భారీగా తరలివచ్చే భక్తుల కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. కోటప్ప కొండ, అమరావతి, పెదకాకాని, క్వారీ, గోవాడ క్షేత్రాలు ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. చేదుకో కోటయ్య.. చేదుకో అంటూ భక్తులు ప్రభలతో తిరునాళ్లకు తరలి వస్తున్నారు. శ్రీ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల బుధవారం నేత్ర పర్వంగా జరగనుంది. ప్రభల పండుగగా పిలిచే కోటయ్య తిరునాళ్లకు 19 భారీ విద్యుత్ ప్రభలు కొండకు పయనమయ్యాయి. ప్రభలు తరలివచ్చే మార్గంలో ఎటువంటి అవాంతరాలు కలగకుండా నిర్వాహకులతో పాటు అధికారులు కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ వెలుగుల్లో కొలువుదీరే ప్రభలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరానుండటంతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వా హకులు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధికి తరలిరానున్నారు. ఆయా ఆలయాల్లో స్వామి వార్ల దర్శ నాలకు, ప్రత్యేక పూజలకు తరలివచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లతో క్యూలు ఏర్పాటు చేశారు.

6



తిరునాళ్ళకు గురవాయపాలెంలో నిర్మించిన భారీ విద్యుత్ ప్రభ

ముగిసిన ప్రచారం



గుంటూరు : ఏసీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ తదితరులు

- రేపు పట్టభద్రుల పోలింగ్
- ఆరు జిల్లాల పరిధిలో 483 కేంద్రాలు
- నేడు బ్యాలెట్ బాక్సులతో కేంద్రాలకు సిబ్బంది
- ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నేడు, రేపు డ్రై డే

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల నియోజక వర్గ ఎన్నికలకు సంబంధించి ప్రచారం ముగిసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రచార కార్యక్రమాలు నిలిచిపోయాయి. చివరి రోజు కావడంతో మంగళవారం ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు వివిధ వర్గాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. చివరి రోజైన మంగళవారం జనసేన అధినేత, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ వీడియో ద్వారా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించాల్సిందిగా సందేశమిచ్చి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. మరోవైపు పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు వివిధ సంఘాలు, యూనియన్లను కలుసుకుని మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల బరిలో ఉన్న మిగతా అభ్యర్థులు ఆటోల ద్వారా మైకు ప్రచారం నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా కూడా పలువురు అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఆరు జిల్లాల పరిధిలోని 483 పోలింగ్ కేంద్రాల్లో గురువారం పోలింగ్ జరగనుంది. కాగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి తెలిపారు.

సజావుగా డిస్ట్రిబ్యూషన్ జరగాలి

డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల వద్ద రద్దీ లేకుండా సజావుగా ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందించాలని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ సరిచూసుకున్న సిబ్బందిని సురక్షితంగా రూట్ల ప్రకారం పోలింగ్ స్టేషన్లకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరులోని ఏసీ కళాశాలలో రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను మంగళవారం ఆమె సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనాసిన్హాలతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల వద్ద సైనేజ్ బోర్డులను ఎన్నికల సిబ్బంది గుర్తించేలా ఉండాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్ల వద్ద ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అల్పాహారం, మంచినీరు, శుచి శుభ్రమైన భోజనాలు అందించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు అందించారు. గురువారం ఓటింగ్ అనంతరం పోలింగ్ బూత్‌ల నుంచి తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం సురక్షితంగా భద్రపరచేందుకు గదులను పరిశీలించారు. ఏసీ కాలేజీలోని ప్రేయర్ హాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్‌డీవో కే శ్రీనివాసరావు, గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహసీల్దార్లు నగేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌పై అభ్యర్థుల దృష్టి

ఎన్నికల ప్రచారం ముగియడంతో అభ్యర్థులంతా పోలింగ్ రోజుపై దృష్టి సారించారు. గురువారం ఓటర్లను చైతన్యపరిచి పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చేలా చేయాలని అభ్యర్థులు, వారి అనుచరులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తం 3 లక్షల 47 వేల 116 మంది ఓటర్లున్న దృష్ట్యా పోలింగ్ శాతం ఎంత పెరిగితే అంత తమకు మేలు జరుగుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు. అయితే గత ఎన్నికల్లో వేల సంఖ్యలో ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. ఈ దృష్ట్యా పోలింగ్ శాతం పెరిగినా అవి వ్యాలిడ్ ఓట్లు అయితేనే మేలు జరుగుతుంది.

మద్యం అమ్మకాలు బంద్

గుంటూరు(కార్పొరేషన్): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధ, గురువారాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సాయంత్రమే వైన్‌షాపులకు, బార్లకు తాళాలు వేసినట్లు తెలిపారు. ఆయా బార్లు, వైన్‌షాపుల్లో రెండు రోజుల పాటు మద్యం అమ్మకాలను పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో వచ్చే నెల 3న కూడా మద్యం విక్రయాలను నిషేధించినట్లు తెలిపారు.

సత్తా చాటిన కృష్ణా, బాపట్ల జిల్లాల ఎడ్లు



ప్రథమ బహుమతి సాధించిన కృష్ణా, బాపట్ల జిల్లాల ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేస్తున్న ఆంజనేయులు దంపతులు

చినగంజాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని సోపిరాలలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి న్యూ జూనియర్ విభాగం నాటు బండి పోలురాధా ఎడ్ల పందేల్లో కృష్ణా, బాపట్ల జిల్లాలకు చెందిన ఎడ్లు ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాయి. గ్రామ టైరు బండ్ల యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలో విజేతలకు దేవస్థానం కమిటీ చైర్మన్ టీఎస్ఆర్ ఆంజనేయులు దంపతులు, కమిటీ సభ్యులు బహుమతులను అందజేశారు. కృష్ణా జిల్లా మోపిదేవి మండలం, కే.కొత్తపాలేనికి చెందిన తుంగల నాగసింధు, బాపట్ల మండలం మర్రిప్రోలుకి చెందిన కోకి శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 3,500 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.30,000 కైవ సం చేసుకున్నాయి. కృష్ణా జిల్లా మోపిదేవి మండలం, కొక్కిలిగడ్డ కొత్తపాలేనికి చెందిన మత్తి నానికి చెందిన ఎడ్ల జత 3,470.7 అడుగుల దూరం లాగి రెండో బహుమతిగా రూ.25,000, కృష్ణా జిల్లా కళశంవారిపాలెం, తోట్లవల్లూరుకు చెందిన కళశం అనూషారెడ్డి, మనోజ్‌రెడ్డికి చెందిన ఎడ్ల జత 3,408.4 అడుగుల దూరం లాగి మూడో బహుమతిగా రూ.20,000, గుంటూరు జిల్లా కాకుమాను మండలం గార్లపాడుకు చెందిన రామినేని శ్రీనివాసరావుకి చెందిన ఎడ్ల జత 3,367.10 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిగా రూ.15,000, బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన జజర యలమంద, వెంకటగోపాలకృష్ణలకు చెందిన ఎడ్ల జత 3,256 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిగా రూ.11,000, బాపట్ల మండలం ఆసోదివారిపాలేనికి చెందిన కుమ్మరి చంద్రమ్మ ఎడ్ల జత 3,250 అడుగుల దూరం లాగి ఆరో బహుమతి రూ.7,000, చినగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన ముంగర విజయలక్ష్మి ఎడ్ల జత 3,180.10 అడుగుల దూరం లాగి ఏడో బహుమతిగా రూ.6,000, కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం కొత్తమాజేరు గ్రామానికి చెందిన తుమ్మల వెంకటరావు ఎడ్ల జత 2,750.6 అడుగుల దూరం లాగి ఎనిమిదో బహుమతిగా రూ.5,000, రేపల్లెకు చెందిన కంకణాల జాలయ్య, మోపిదేవి మండలం క్రోసూరివారిపాలెం గ్రామానికి చెందిన కాగితాల శశిధర్‌కు చెందిన ఎడ్ల జత 2,750 అడుగుల దూరం లాగి తొమ్మిదో బహుమతిగా రూ.3,000 కైవసం చేసుకున్నాయి.

ఇన్‌చార్జ్‌ల పాలన

- ఎన్జీ రంగా వర్సిటీపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే నియామకాలు
- ఏడాదిగా అతీగతి లేని పాలకవర్గం నియామకం
- రాష్ట్ర విభజన తర్వాత మంజూరు కాని పోస్టులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైస్ చాన్సలర్, కంప్ట్రోలర్, అగ్రికల్చర్, ఇంజనీరింగ్, కమ్యూనిటీ సైన్సు, స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్లు, రీసెర్చ్, ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్లు, రిజిస్ట్రార్, కంప్ట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్.. ఇలా ఒకటి కాదు రెండు కాదు కీలకమైన మొత్తం పోస్టుల్లో ఇన్‌చార్జిలే దిక్కు. ఇదీ గత కొన్నేళ్లుగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీలో జరుగుతున్న ఇన్‌చార్జిల పాలన. ఇన్‌చార్జిల పాలనతో అనేక నష్టాలు జరుగుతున్నా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించడంలేదు. వర్సిటీకి చెందిన రూ.400 కోట్ల బడ్జెట్ వ్యవహారాలు ఇన్‌చార్జి కంప్ట్రోలర్ చూస్తున్నారంటే ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వం యూనివర్సిటీని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ఒకటి రెండు పోస్టులు మాత్రమే వచ్చాయి. మిగిలిన వాటిని ప్రభుత్వం కొత్తగా మంజూ రు చేయాలి. వాటికి హయ్యర్ ఎడ్యుకేషన్, ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలి. ఆ తదుపరి పూర్తిస్థాయిలో నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులను నియమించాలి. కానీ ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీలో ఈ ఏర్పాటు లేకుండానే పనులు సాగుతున్నాయి. ఎప్పటికప్పుడు తాత్కాలిక పద్ధతిలో చేపడుతున్న నియామకాలు వివాదాస్పదం గా మారుతున్నాయి.



ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ

మూడు నెలలే...

ప్రస్తుతం ఉన్న కీలకమైన పోస్టులన్నీ మూడు నెలల తాత్కాలిక పద్ధతిపై(రీ డిప్లాయ్‌మెంట్) భర్తీ చేస్తున్నారు. వీసీకి అనుగుణంగా ఉన్న వారిని నియమించడం ఆనవాయితీగా మారింది. గవర్నర్‌తో పనిలేకుండా ఆయా పోస్టుల్లో మూడు నెలలకి ఒకసారి నియామకం చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని రకాలుగా ప్రాబల్యం ఉన్న వారికి మాత్రమే కీలక పోస్టులు దక్కుతున్నాయన్న వాదన ఉంది. గత ప్రభు త్వంలో పూర్తిగా ఒక పార్టీకి, ఒక వర్గానికి చెందిన వారికి మాత్రమే ప్రాధాన్యం దక్కిందన్న ఆరోపణలున్నాయి.

వివాదాలు..

వర్సిటీలోని కీలకమైన పోస్టుల్లో ఇన్‌చార్జిలే ఉండటంపై తీవ్రవివాదం నెలకొంది. ఇప్పటికే పలు ఆరోపణలు వస్తుండటం.. కొందరు ఈ విషయాలను గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తుంది. రెన్యూవల్ పద్ధతికి స్వస్తి పలికి శాశ్వత నియామకాలు చేపట్టాలన్న డిమాండ్ వస్తోంది. ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ విడుదలతో అర్హులకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయం ఉంది. వ్యవసాయ రంగంలో కీలకపాత్ర పోషించే ఎన్జీ రంగా వర్సిటీకి ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు పాలకవర్గం లేకపోవడం గమనార్హం. ఏడాదిగా బోర్డు ఏర్పాటు కాలేదు. బోర్డు నియామకంపై త్వరితగతిన చర్యలు చేపట్టాలన్న సూచనలు వస్తున్నాయి.



మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ సుబ్బరాజు

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

అద్దంకి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు, చర్యలు తీసుకోవాలని సీఐ సుబ్బరాజు అన్నారు. మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద ఏర్పాట్లను మంగళవారం రాత్రి సీఐ సుబ్బరాజు పరిశీలించారు. క్యూలైన్‌లు, స్నానాల ఘాట్‌లను పరిశీలించారు. క్యూలైన్‌ల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈవో గుంటుపల్లి వాసుబాబు, పూజారి నడింపల్లి లక్ష్మీనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన నైపుణ్యంతో విద్యార్థులు రాణించాలి

ఎమ్మెల్యే కొండయ్య



యంగ్ సైంటిస్ట్ ఇండియా సైన్స్ మాసపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విజ్ఞాన నైపుణ్యాలపై అవగాహన పెంచుకుని చక్కగా రాణించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో యంగ్ సైంటిస్ట్ ఇండియా సైన్స్ మాసపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చీరాలకు చెందిన గీతా సర్వీస్ ట్రస్టు చైర్మన్ వలివేటి మురళీకృష్ణ దేశ వ్యాప్తంగా హైస్కూల్ విద్యార్థులకు యంగ్ సైన్స్ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మురళీకష్ణ ఇప్పటికే 25 అవార్డులు పొందడం హర్షించదగిన విషయమన్నారు. వారి వెంట పత్రిక సంపాదకుడు నందమూడి కృపాకిరణ్, చీమకుర్తి మధుసూదనరావు పాల్గొన్నారు.

చిన్నారుల భద్రత అంగన్‌వాడీలదే

చినగంజాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల భద్రత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని ఎంఈవో-1 బి.అజయ్‌బాబు, ఎంఈవో-2 కోటేశ్వరరావులు అన్నారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ముగింపు రోజైన మంగళవారం వారు పాల్గొని మాట్లాడారు. జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ సర్టిఫికేట్‌లను ఎంఈవో-1 అజయ్‌బాబు అందజేశారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా పిల్లల యొక్క ఐదు అభివృద్ధుల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేసుకునేటప్పుడు బేస్ లైన్‌లో ఎలా పరీక్షించి పెట్టాలి, తరగతి అయిన తరువాత ఎండ్ లైన్ లో ఎలా పెట్టాలో, ఎసెస్‌మెంట్ కార్డును ఎలా నింపాలి అనే విషయాలపై డీఆర్‌పీలు శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, వెంకటేశ్వరరావులు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్.ఎం. కుర్రా రామారావు ఓ యొక్క విలువలను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎన్.సుమలత, కే.వాణిశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శనగలో ఎండుతెగులు నివారణ చర్యలు చేపట్టండి

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శనగలో ఎండుతెగులు నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ పర్చూరు. ఏడీఏ ఎన్.మోహనరావు అన్నారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని తనుబొద్దివారిపాలెం, మున్నంగి వారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు వ్యవసాయ రాయితీలు పొందాలంటే తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రత్యేక ఐడీ నెంబర్‌ను పొందాలని ఏడీఏ సూచించారు. అనంతరం పొగాకు సాగులో వచ్చే కలుపునివారణ చర్యలు గురించి రైతులకు తెలియచేశారు. అంతేగాకుండా చౌడు భూములను జిప్సంతో శుద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎన్.మేరమ్మ, వీఏఏ సుదర్శన్ పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రమ్‌హోంపై కార్యదర్శులకు సూచనలు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులకు వర్క్ ఫ్రమ్ హోంకు సంబంధించి డీఎల్‌డీవో సీహెచ్.విజయలక్ష్మి పలు సూచనలు చేశారు. యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అందరూ నిర్ణీత సమయంలోనే విధులకు హాజరయ్యే విధంగా చూడాలని, తప్పని సరిగా అటెండెన్స్ రిజిస్టర్ ఫాలో కావాలని, ఇంకా పలు విషయాలపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీసీవో యశ్వంత్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఈవో ఆర్డీ కృష్ణ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆగిన నిర్మాణాల పూర్తికి కృషి

మార్టూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు పూర్తయ్యేందుకు కృషి చేస్తానని సమగ్ర శిక్షా ఏపీసీ పీవో నాగిరెడ్డి అన్నారు. మండలంలో గత ఆరు రోజుల నుంచి మండలంలోని వలపర్ల హైస్కూల్‌లో అంగన్‌వాడీలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కేంద్రాన్ని మంగళవారం నాగిరెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతూ వివిధ స్కూళ్లలో అదనపు తరగతులు నిర్వహణ కోసం నిర్మించిన అదనపు తరగతి గదులు భవనాలు కొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయన్నారు. వాటి నిర్మాణాలు పూర్తయ్యేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మెరుగైన పోషకాహారాలను విద్యార్థులకు తప్పనిసరిగా అందించాలన్నారు. ఆటపాటతో విద్యార్థులకు బోధన చేయాలన్నారు. రోజూ బడికి వచ్చేవిధంగా విద్యార్థులకు ఆసక్తి పెంచేలా కృషి చేయాలన్నారు. తరువాత హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వస్రాంనాయక్, ప్రేమలత, సీఆర్పీలు రమేష్, శ్రీనివాస్, తిరుపతమ పాల్గొన్నారు.



వలపర్ల హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సమగ్ర శిక్షా ఏపీసీ పీవో నాగిరెడ్డి, ఎంఈవో వస్రాంనాయక్

కోటప్పకొండకు ప్రత్యేక బస్సులు

- 45 వాహనాలు సిద్ధం
- ప్రతి 15 నిమిషాలకొకటి రాకపోక
- సుమారు రూ.15 లక్షల ఆదాయం వచ్చే అవకాశం



చీరాల డిపోలో సిద్ధంగా ఉన్న ప్రత్యేక బస్సులు

చీరాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివ రాత్రి పండుగ హడావుడి చీరాల్లో జోరందుకుంది. భక్తులు చీరాల, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కోటప్పకొండకు పెద్ద సంఖ్యలో తీరుతున్నారు. దీంతో ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని డిపో అధికారులు ప్రత్యేక బస్సులు కూడా ఏర్పా టు చేశారు. దీంతో మంగళవారం ఉద యం నుంచి పండుగ వాతవరణం సంతరించుకుంది. భక్తులు, యువకులు పెద్ద సం ఖ్యలో కోటప్పకొండకు తరలివెళ్తున్నారు. దీంతో కొండకు వెళ్లే బస్సులన్నీ కిక్కిరిస్తున్నాయి. గతేడాది చీరాల డిపో నుంచి 45 ప్రత్యేక బస్ సర్వీసులను ఏర్పాటు చేయగా, డిపోకు సుమారు రూ.10లక్షలు వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది 45 ప్రత్యేక బస్సులు అం ద ు బా ట ు లో ఉన్నాయి. అయితే ఈ సారి సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20లక్షల మే ఆదాయం సమకూరుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి 15 నిమిషాలకో బస్సు



ఎప్పటిలాగే ఈ సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు 45 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. ప్రయాణికులకు ఎలాంట ఇబ్బంది లేకుండా ఉండేలా ప్రతి 15 నిమిషాలకో బస్సు డిపో నుంచి కొండకు బయలుదేరి వెళ్తుంది. రోజూ మాదిరిగానే టికెట్ ధరలు పెద్దవాళ్లకు రూ.100, చిన్నవాళ్లకు రూ.50 ఉంది. కోటప్పకొండ నుంచి చీరాలకు పావు గంటకో బస్సు బయలుదేరుతుంది.

- జంజనం శ్యామల, డిపో మేనేజర్

అద్దంకి నుంచి 35 బస్సులు

అద్దంకి, : మహా శివరాత్రి సందర్భంగా అద్దంకి డిపో నుంచి కోటప్పకొండకు బుధవారం 35 బస్సులు, శ్రీశైలంకు అదనంగా 2 బస్సులను నడుపుతున్నట్లు డీఎం బెల్లం రామ్మోహనరావు తెలిపారు. భక్తుల రద్దీని బట్టి ఆయా రూట్లలో అదనపు బస్సులు తిప్పనున్నట్లు తెలిపారు. అద్దంకి ప్రాంత భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చినగంజాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం బాలకోటేశ్వరస్వామి, సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానాల వద్ద మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే తిరునాళ్లకు వచ్చే భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శీలం రమేష్ అన్నారు. తిరునాళ్లను పురస్కరించుకొని ప్రజలు, భక్తుల సౌకర్యాల నిమిత్తం ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు మంగళవారం ఎస్‌ఐ తెలిపారు. పూలవారిపాలెం గ్రామం నుంచి 216వ నెంబరు జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు మార్గం మూసివేసి ఉంటుందని తెలిపారు. కడవకుదురు గ్రామం వైపు నుంచి వచ్చే ఆటోలు, ట్రాక్టర్లను పూలవారిపాలెం వెంకటేశ్వర కల్యాణ మండపం వద్ద పార్కింగ్ చేయాలని తెలిపారు. జాతీయ రహదారి టీ జంక్షన్ నుంచి ఆటోలు, ట్రాక్టర్లను చినగంజాం హోండా షోరుం వద్ద కేటాయించిన స్థలంలోనే పార్కింగ్ చేయాలన్నారు. సోపిరాల రైల్వే గేటు నుంచి మెలకారెడ్డి విగ్రహం వరకు ఎదురు వెళ్లకూడదని తెలిపారు. చీరాల నుంచి ఒంగోలు, ఒంగోలు నుంచి చీరాల వెళ్లే ఆర్టీసీ బస్సులను చినగంజాం లోకి అనుమతించడం లేదని తెలిపారు. భక్తులు సహకరించాలని కోరారు.

అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే ఉపేక్షించం



దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చినగంజాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసే విద్యుత్ ప్రభల వద్ద నిర్వహించే కార్యక్రమాల్లో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ తుషార్ డూడీ హెచ్చరించారు. మహాశివరాత్రి సందర్భంగా సోపిరాల గ్రామంలోని రామకోటేశ్వరస్వామి, కొత్తపాలెం గ్రామంలోని బాలకోటేశ్వరస్వామి దేవస్థానాలను మంగళవారం ఆయన సందర్శించి, జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆలయాల పరిసరాలలో డెకరేషన్ లైటింగ్ ఏర్పాటు చేసే ప్రదేశాలలో, విద్యుత్ ప్రభల విద్యుత్ వైర్ల వద్దకు భక్తులు, పిల్లలు వెళ్లకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. దొంగతనాలు, ఇతర అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా సాధారణ దుస్తులలో కూడా పోలీసు సిబ్బందిని నియమించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. స్థానిక పోలీసు అధికారులు, ఆలయ కమిటీసభ్యులు, ప్రాథమిక ఆరోగ్య, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారుల సమన్వయంగా వ్యవహరిస్తూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శివాలయాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మండల పరిధిలోని రామకోటేశ్వర, బాలకోటేశ్వర స్వామి దేవాలయాలకు మహాశివరాత్రి సందర్భంగా సుమారు 80 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేసినట్లు తెలిపారు. దానికి అనుగుణంగా చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్ ఆధ్వర్యంలో 130 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక ట్రైనీ డీఎస్పీ, ముగ్గురు సీఐలు, 9 మంది ఎస్‌ఐలు ఉన్నారన్నారు. ఆలయాల పరిసరాల ప్రాంతాలలో 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, రెండు డ్రోన్లను కూడా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ముందుస్తు చర్యలు తీసుకున్నామని, వాహనాల పార్కింగ్‌కి అనువైన ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో మహా శివరాత్రి ఉత్సవాలు జరిగేలా భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. బుధవారం జరిగే మహాశివరాత్రి పండుగ సందర్భంగా తీసుకుంటున్న భద్రతా పరమైన ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. క్యూలైన్ల నిర్వహణ, బారికేడ్ల ఏర్పాట్లు, భక్తులు ఆలయాలలోకి ప్రవేశించేందుకు, బయటకు వచ్చే మార్గాలను పరిశీలించి, ఆలయ కమిటీ సభ్యులకు పలు సూచనలు అందజేశారు. దేవాలయాల్లో ఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ మెయిన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్‌ఐ ఎస్.రమేష్ ఇరు దేవాలయాల కమిటీ చైర్మన్‌లు, సభ్యులు, గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, పలు శాఖల అధికారలు పాల్గొన్నారు.

కోటప్పకొండకు తరలిన తాటివారిపాలెం విద్యుత్ ప్రభ



కోటప్పకొండకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ ప్రభ

మార్టూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటివారిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభను మంగళవారం కోటప్పకొండ తిరునాళ్లకు తీసుకువెళ్లారు. మహాశి వరాత్రి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి కోటప్పకొండలో ఏర్పాటు చేసేందుకు విద్యుత్ ప్రభను తీసుకువెళ్లారు. గ్రామంలోని ముప్పనేని ఆదిశేషయ్య కుటుంబం దాదాపుగా 50ఏళ్ల కిందట మహారాష్ట్రలోని నాగపూర్‌కు వలస వెళ్లింది. ఈ కుటుంబం మహాశివరాత్రి పండుగనాడు గ్రామం నుంచి విద్యుత్ ప్రభను ఏర్పాటుచేసి కోటప్పకొండకు తీసుకువస్తామని మొక్కుకున్నారు. కాలక్రమేణా ఆదిశేషయ్య మృతి చెందడంతో ఆయన కుమారుడు వెంకటేశ్వరరావు ఇతర కుటుంబసభ్యులు చాలా కాలం తర్వాత సొంతూరు తాటివారిపాలెం వచ్చారు. వారు సొంత ఖర్చుతో సుమారు రూ.2లక్షల వ్యయంతో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి గ్రామంలో విద్యుత్ ప్రభ వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా సీఐ ఎం.శేషగిరిరావు పర్యవేక్షించారు. అదేవిధంగా మంగళవారం వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన చిన్న ప్రభను ట్రాక్టర్‌పై గ్రామంలోని అన్నివీధులలో ఊరేగించారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తరువాత విద్యుత్ ప్రభను కోటప్పకొండకు తరలించారు. గ్రామం నుంచి తొలిసారిగా కోటప్పకొండకు ప్రభ తరలివెళ్లడంపై గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శివపూజకు.. వేళాయే

- నేడే మహా శివరాత్రి తిరునాళ్ల
- విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా కోటప్పకొండ
- త్రికోటేశ్వరస్వామి సన్నిధి ముస్తాబు
- గ్రామాల నుంచి కొండకు పయనమైన విద్యుత్ ప్రభలు
- కోటయ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఆనం
- అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభం
- అమరావతి, కాకాని, గోవాడ, క్వారీ సహా శైవక్షేత్రాల్లో భారీగా ఏర్పాట్లు

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల బుధవారం నేత్ర పర్వంగా జరగనుంది. భక్తుల కోసం కోటప్పకొండలో సర్వం సిద్ధం చేశారు. కోటప్పకొండ విద్యుత్ దీపాల అలంకరణలతో కోటప్పకొండ దేదీప్యమానంగా వెలుగొందుతోంది. కొండ ఎగువున, దిగువున విద్యుత్ దీపాలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. త్రికోటేశ్వరస్వామి సన్నిధి తిరునాళ్లకు ముస్తాబైంది. అర్ధరాత్రి స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగనున్నాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాతో ప్రభుత్వం తరపున కోటయ్యస్వామికి బుధవారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాల కోసం ఏర్పాట్లు చేశారు. చిలకలూరిపేట మేజర్ కాల్వ వద్ద భక్తుల కోసం స్నానఘట్టాలను ఏర్పాటు చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కొండ దిగువన ప్రత్యేక షెడ్ ఏర్పాటు చేశారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో చంద్రశేఖరరావు, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షిస్తున్నారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేసేందుకు దేవస్థానం, సేవా సంస్థల ఆధ్వర్యంలో భారీగా సిద్ధం చేశారు. స్కౌంట్స్ అండ్ గైడ్స్, సత్యసాయి సేవా సమితి సభ్యులు సేవలు అందించేందుకు కొండకు తరలి వచ్చారు.

కోటప్పకొండకు 550 బస్సులు

కోటప్పకొండకు ఆర్టీసీ 550 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, అద్దంకి, చీరాల, ఒంగోలు బస్టాండ్‌ల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. వీఐపీల కోసం 20 ఆర్టీసీ వాహనాలను ఏర్పాటు చేశారు. ఘాట్ రోడ్డులో 85 బస్సులు నిర్వహించనున్నారు. కొండ వద్ద చిలకలూరిపేట రోడ్డులో, ఘాట్ రోడ్డు పక్కన, కొండపైన ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్లను నిర్వహిస్తున్నది.

అన్నదానాలకు భారీగా ఏర్పాట్లు

కొండ దిగువన ఉన్న వివిధ సామాజిక సత్రాలలో లక్షల మందికి అన్నదానం జరగనుంది. మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా అన్నదానం చేసేందుకు సత్రాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవస్థానం వద్ద, కొండ దిగువ ప్రాంతాలలో తొమ్మిది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కొండలోని పీహెచ్‌సీలో ప్రత్యేకంగా పడకలు ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ శాఖ కొండ ప్రాంతంలో మద్య నిషేధం విధించింది. పది కిలో మీటర్ల వరకు మద్యం విక్రయాలను నిలిపి వేశారు.

2,500 మందితో బందోబస్తు

తిరునాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో 2,500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. బందోబస్తు పర్యవేక్షణకు కొండ ఎగువన, దిగువన కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. సీసీ కెమేరాల ద్వారా బందోబస్తును పర్యవేక్షిస్తారు. డ్రోన్‌లను కూడా వినియోగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచే పోలీసులకు విధులు కేటాయించారు. కొండ ప్రాంతం వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేట, పెట్లూరివారిపాలెం రహదారుల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా వన్‌వే నిర్వహిస్తారు. కొండ ఎగువన, దిగువన తాత్కాలిక రూరల్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం ఎస్పీ పర్యవేక్షించారు. తిరునాళ్ల ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

19 భారీ విద్యుత్ ప్రభలు

కోటప్పకొండ తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి 19 భారీ విద్యుత్ ప్రభలు తరలివస్తున్నాయి. వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రభలు మంగళవారం కొండకు పయనమయ్యాయి. ప్రభల రాక నేపథ్యంలో చిలకలూరిపేట రోడ్డులోని ప్రధాన విద్యుత్ లైన్‌కు బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఒక్కొక్క ప్రభ 90 అడుగులకు పైగా ఎత్తులో నిర్మించారు. నాదెండ్ల మండలం అవిశాయపాలెం, అప్పాపురం గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, కోమటినేనివారిపాలెం, కావూరు నుంచి ఒక్కొక్కటి, చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నం నుంచి ఆరు, బొప్పూడి నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు వస్తున్నాయి. నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, గురవాయపాలెం, కాకాని నుంచి ఒక్కొక్కటి, కాకాని గ్రామం నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభ కొండకు తరలి వస్తున్నాయి. నరసరావుపేట పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సాధారణ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి.

వీఐపీలకు పెద్దపీట

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీలకు పెద్ద పీట వేస్తున్నారు. వీరి సేవలో అధికారులు తరించనున్నారు. సామాన్య భక్తులకు అటు ఆర్టీసీ, ఇటు దేవస్థానం అన్ని సేవలకు టిక్కెట్లను విక్రయిస్తున్నది. అయితే కొండ కింద కారు దిగన దగ్గర నుంచి స్వామి దర్శనం చేసుకునే వరకు వీఐపీలకు అన్ని సేవలను ఉచితంగా అందించేందుకు అధికారులు భారీగా ఏర్పాట్ల చేశారు. వేలాదిగా దర్శనం పాసులను పంపిణీ చేశారు. వీఐపీలకు ఉచితం 20 బస్సులను ఏర్పాటు చేసిన ఆర్టీసీ సామాన్య భక్తులను నుంచి అధిక చార్జీలను వసూలు చేస్తున్నది.

సిబ్బంది బాధ్యతగా పనిచేయకపోతే చర్యలు

ఉపాధి పీడీ విజయలక్ష్మి



సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న పీడీ విజయలక్ష్మి

ఇంకొల్లు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది క్షేత్రస్థాయి లో స్థాయిలో సహా సిబ్బంది బాధ్యతగా పని చేయకపోతే చర్యలు తప్పవని ఉపాధి హామీ పథకం పీడీ విజయలక్ష్మి హెచ్చరించారు. మండల పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి హామీ పనులపై మండల అభివృద్ధి కార్యాలయం వద్ద 16వ విడత సామాజిక తనిఖీల ప్రజావేదిక మంగళవారం జరిగింది. మండలంలోని మొత్తం 511 పనులు 13 గ్రామాలలో పనులు జరగగా ఇటీవల సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన తనిఖీలకు సంబంధించిన రికార్డులను ఆమె తనిఖీ చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ప్రతిపాదనల కంటే మించి జరిగిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మస్టర్లలో ఉన్న తేడాలను గుర్తించారు. గ్రామాలలో పని ప్రదేశాలలో సదుపాయాలు సక్రమంగా లేవని ప్రజలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సభలో డీవీవో శోభన్, క్యాసి సతీష్, ఎస్‌ఆర్‌పీ చిరంజీవి, నాయక్, శ్రీనివాసరావు, ఏపీవో రేణుకా, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి పూజలకు సిద్ధమైన ఆలయాలు

పర్చూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని ఆయా శివాలయాలు ముస్తాబయ్యాయి. పర్చూరులోని భీమేశ్వరస్వామి ఆలయం, చెరుకూరులోని శ్రీ ఆగస్త్యేశ్వర స్వామి వారి ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం వేకువ జాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వాహక అధికారులు బి.నాగయ్య, డి.నాగేశ్వరావు తెలిపారు.



విద్యుత్ దీపాలతో పర్చూరులోని భీమేశ్వరస్వామి ఆలయం

దేవుడే దిక్కు



నామ్ రోడ్డులో అద్దంకి మండలంలోని చక్రాయపాలెం వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇటీవల కూడా రెండు ప్రమాదాలు జరిగాయి. దీంతో రోడ్డు ప్రమాదాల నివారణకు సీఐ సుబ్బరాజు గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రాంతంలో దేవుళ్ల ఫొటోలు ఉండే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో గ్రామస్థుల సహకారంతో పోలీసులు నామ్ రోడ్డుకు రెండు వైపులా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఒక వైపు ఆంజనేయ స్వామి బొమ్మ, రెండో వైపు వినాయకుని బొమ్మతో ఉన్న ఫ్లెక్సీలు వెలిశాయి. గ్రామస్థులు ఆశించిన విధంగా ప్రమాదాలు తగ్గుతాయని ఆకాంక్షిద్దాం.



- అద్దంకి, (ఆంధ్రజ్యోతి)

అపరిశుభ్రంగా స్నానాల ఘాట్

- చేపల చెరువుల నుంచి వ్యర్థాలు రిజర్వాయర్ నీటిలోకి
- పేరుకు పోయిన వైనం
- మణికేశ్వరం వచ్చే భక్తులకు తప్పని కష్టాలు

అద్దంకి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి రోజు నదీ స్నానాలు చేసి శివయ్యను దర్శించుకోవాలనుకునే భక్తులకు కష్టాలు తప్పడం లేదు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీటి నిల్వ ఉంది. ఈ నేపథ్యంలో మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద గుండ్లకమ్మ నదిలో భక్తులు స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. అయితే మణికేశ్వరం సమీపంలో ఉన్న చేపల చెరువుల నుండి వ్యర్థాలను గుండ్లకమ్మ నదిలోకి వదలడంతో ఆ వ్యర్థాలు మొత్తం నీటిపై తేలుతూ నది మలుపులో ఉన్న స్నానాల ఘాట్ వద్ద పేరుకు పోయాయి. చేపల పెంపకానికి కోళ్ల మాంసం వ్యర్థాలను వినియోగిస్తుండడంతో ఆ వ్యర్థాలను గుండ్లకమ్మ రిజర్వాయర్ లోకి వదలడంతో కలుషితంగా మారాయి. స్నానాల ఘాట్ వద్దనే కలుషితమైన నీరు నిలవడం, వ్యర్థాలు నీటి పై తేలియాడుతుండడంతో మహాశివరాత్రి రోజు మణికేశ్వరం వద్ద స్నానాలు చేసే భక్తులకు ఇబ్బందులు తప్పేటట్టు లేదు. అధికారులు స్పందించి చేపల చెరువుల వ్యర్థాలు గుండ్లకమ్మ రిజర్వాయర్ నీటిలోకి విడుదల చేయకుండా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



గుండ్లకమ్మ రిజర్వాయర్



మణికేశ్వరం స్నానాల ఘాట్ వద్ద నీటిపై తేలియాడుతున్న వ్యర్థాలు



డాక్టర్ నగేష్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

ఇంగ్లీష్‌తో పలు రంగాల్లో రాణింపు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : సమాచార మార్పిడికి, ఉద్యోగ, వ్యాపార రంగాలలో రాణించడానికి, శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధికి ఇంగ్లీష్ భాష అవసరమని దర్శి కళాశాల సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ ఏ.నగేష్ అన్నారు. మంగళవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆంగ్ల భాష ప్రాముఖ్యత కార్యక్రమం అతిథి, అధ్యాపక సదస్సు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. అనంతరం అధ్యాపకుడు డాక్టర్ నగేష్‌ను కళాశాల అధ్యాపకులు ఘనంగా సత్కకరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్.షర్మిల రాణి, జేకేసీ మెంటర్ వినుకొండ రమేష్, వేటి ప్రసాద్, శిఖామణి, అశోక్, గంగయ్య, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కోటపాడు యూపీ పాఠశాలలో క్విజ్ పోటీలు

పంగులూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్‌కు సంబంధించిన పాఠ్యాంశంపై క్విజ్ పోటీ నిర్వహించారు. పేర్ని సుబ్బయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 6,7,8 తరగతి విద్యార్థులకు మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలో బూదవాడ, కొండమూరు, పంగులూరు పాఠశాలల జట్లు మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నట్లు హెచ్‌ఎం వేణు తెలిపారు. మార్చి మూడవ తేదీన స్పెల్ బీ పోటీ జరుగుతుందని, ఫిబ్రవరి వరకు ఉన్న సిలబస్‌లో 6,7,8, తరగతుల విద్యార్థులకు మండల స్థాయిలో కోటపాడు యూపీ పాఠశాలలో ఈ పోటీ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధి విశ్రాంత ఇంజనీర్ పేర్ని వీరనారాయణ తెలిపారు.

ఆదర్శ న్యాయాధికారి లక్ష్మీనారాయణ



సంతాప సభలో మౌనం పాటిస్తున్న విశ్రాంత న్యాయాధికారి మురళీఅచ్యుతరావు తదితరులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, వృత్తిపట్ల అంకిత భావం ఉన్న వ్యక్తి సీనియర్ న్యాయవాది, విశ్రాంత న్యాయాధికారి చిక్కరాజు లక్ష్మీనారాయణ అని రిటైర్డ్ న్యాయాధికారి కొత్తమాసు మురళీఅచ్యుతరావు అన్నారు. అద్దంకికి చెందిన సీనియర్ న్యాయవాది, రిటైర్డ్ న్యాయాధికా చిక్కరాజు లక్ష్మీనారాయణ హైదరాబాద్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆయన మృతి పట్ల అద్దంకి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ సంతాప సభ కోర్టు ఆవరణంలో జరిగింది. ముందుగా లక్ష్మీనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత న్యాయాధికారి అచ్యుతరావుతో పాటు న్యాయవాదులు పి.ఉదయభాస్కర్, పీఎల్ఎన్ ప్రసాద్, పి. రమేష్ లక్ష్మీనారాయణతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. యువ న్యాయవాదులకు ఆదర్శమైన వ్యక్తి అంటూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సుభాష్‌బాబు, ఇంటూరి హనుమంతరావు, సలీం పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీతో సేవాభావం



ఎన్‌సీసీపై అవగాహన కల్పిస్తున్న పాండిశ్చేరి విశ్రాంత ప్రొఫెసర్ రాముడు

వేటపాలెం (చీరాల), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీపై శిక్షణ పొందడం వలన జాతీయ సమైక్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పాండిశ్చేరి అసోసియేట్ విశ్రాంత ప్రొఫెసర్, పందిళ్లపల్లి వాసి కడెం రాముడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతి నిర్మాణంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ పాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖరరావు, విశ్రాంత తహసీల్దార్ దోగుపర్తి సుబ్రహ్మణ్యం, జయచంద్ర, రామ బూషి, శ్రీమన్నారాయణ, మోహన్‌రావు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు గాయాలు

బల్లికురవ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామ సమీపంలో మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కొప్పెరపాడు గ్రామ రెవెన్యూ అధికారి గురవయ్య, కొండాయపాలెం గ్రామానికి చెందిన నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఇరువురినీ గుంటుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. ప్రమాదంలో గాయపడిన వీఆర్వో గురవయ్యను తహసీల్దార్ రవినాయక్, రెవిన్యూ సిబ్బంది పరామర్శించారు.

యువకుడి మృతదేహం లభ్యం

బల్లికురవ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి చెందిన యువకుడు గుంటుపల్లి అయప్ప (28) సాగర్ కాలవలో ఈతకు దిగి కొట్టుకుపోయిన ఘటనలో యువకుడి మృతదేహం గుంటూరు జిల్లా పరిధిలో మంగళవారం లభ్యమైంది. అందిన సమాచారం మేరకు.. ముక్తేశ్వరం గ్రామానికి చెందిన గుంటుపల్లి అయప్ప అనే యువకుడు అడిగొప్పుల అమ్మవారి దర్శనానికి వెళ్లి తిగి వస్తూ మార్గమధ్యలో ఉన్న సాగర్ కాలువలో ఈతకు దిగి ఆదివారం నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. రెండు రోజుల నుంచి వారి బంధువులు యువకుడి అచూకి కోసం కాలవలో వెతకగా గుత్తికొండ వద్ద అయ్యప్ప మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టు మార్టం అనంతరం స్వగ్రామం ముక్తేశ్వరం గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు. అయ్యప్పకు భార్య ఉంది.

పాఠశాలకు, బీరువా, కుర్చీలు అందజేత

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలకు బీరువా, కుర్చీలను అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యురాలు, హెచ్‌ఎం కోట అంజయ్య ఆర్థిక సహకారంతో స్థానిక ఎస్టీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు పది వేల రూపాయలు విలువ చేసే బీరువా, కుర్చీలను పాఠశాలకు అందజేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ మురళీసుధాకరరావు, కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు, కోనేటి అనీల్, నందిరెడ్డి శ్రీనివాసరావు, మురళీకృష్ణ, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



డీఎస్పీ మొయిన్‌కు జ్ఞాపికను అందిస్తున్న విద్యార్థులు

రహదారి భద్రత అందరి బాధ్యత

డీఎస్పీ మొయిన్

చీరాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రత కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రమాదాల నియంత్రణకు తమవంతు కృషి చేయాలని డిఎస్పీ ఎండి మొయిన్ అన్నారు. మంగళవారం చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రహదారి భద్రత వారోత్సవాలు అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిఎస్పీ హాజరయి ప్రమాదాలపై మాట్లాడారు. అనంతరం కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు విద్యార్థులతో కలిసి డిఎస్పీ,రూరల్ సిఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా జగదీష్, జ్యోతి స్వరూప్, ఆర్‌వి రమణమూర్తి, అన్నం శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో బోధనకు ప్రాధాన్యం



శిక్షణ ముగింపులో మాట్లాడుతున్న ఎంఈవో రమేష్

పంగులూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలు బోధనా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని విద్యాధికారి జి.వీరాంజనేయులు సూచించారు. పంగులూరులో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు బోధనాంశాలపై చేపట్టిన మూడురోజుల శిక్షణ మంగళవారం ముగిసింది. ప్రీ స్కూల్ చిన్నారులకు కథలు, ఆట, పాటలతో బోధన సాగించి, చదువు పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. పోషకాహారం, ఆరోగ్య సంరక్షణతో పాటు అక్షర జ్ఞానం అందించి, ప్రాథమిక విద్యకు సంసిద్ధులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, రిసోర్స్ పర్సన్స్ సుబ్బారావు, ప్రతాప్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్లికురవ : ఆరు రోజులుగా శిక్షణలో నేర్చుకున్న అంశాలతో చిన్నారులకు మెరుగైన విద్యా బోధన అందించాలని ఎంఈవో రమేష్ పేర్కొన్నారు. మంగళవారం విద్యావనరుల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న జ్ఞాజ్యోతి శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శిక్షకులు రామకృష్ణ, సురేష్, సూపర్ వైజర్ సలోమి పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టండి



రామకూరులో మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రబీలో సాగు చేస్తున్న మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఆశించిందని, దాని నివారణకు రైతులు తగిన చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రామకూరు, భగవాన్‌రాజుపాలెం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో ఉన్న మొక్కజొన్నను రైతులతో కలసి పరిశీలించారు. సాగులో ఉన్న పంటలను మార్చి 3లోగా ఈ-క్రాప్ చేయించాలన్నారు. భూ యజమానులు ఈ నెల28లోగా రైతు సేవా కేంద్రాలలో అగ్రిస్టాక్ యాప్‌లో వివరాలను నమోదు చేసి తగిన ఐడీ నెంబరు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో పృథ్వీ రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : రైతులు వేసవిలో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని గోవాడ, చిన్నకొత్తపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఎస్.దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ సాయిబాబు, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : రానున్న రోజుల్లో ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ప్రతి రైతూ ప్రభుత్వ ప్రత్యేక విశిష్ట ఐడీ నెంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మార్టూరు సబ్ డివిజన్ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వేమవరం, కొప్పెరపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రెండు గ్రామాలలో రైతులు సాగు చేసిన పలు పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు. మార్చి మూడో తేదీతో రబీ సాగు ముగుస్తుందని పంటలు వేసిన రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అనంతరం రెండు గ్రామాలలో జరుగుతున్న ఐడీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో కుమారి, వీఏఏ వెంకటేష్, బాషా, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- జగన్‌రెడ్డి నిర్వాకంతో గాడి తప్పిన రాష్ట్ర ప్రగతి
- శాసనసభలో ఎమ్మెల్యే కొండయ్య



అసెంబ్లీలో మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై ఎమ్మెల్యే కొండయ్య శాసనసభలో మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నియోజకవర్గంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీలో కొండయ్య మాట్లాడారు. ధాన్యం కొనుగోలుకు సం బంధించిన సమస్యలు, సివిల్ సప్లయ్, టూరిజం వంటి సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నట్లు కొండయ్య వివరించారు. అదే సందర్భంలో జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అనుసరించిన కక్షసాధింపు, అవినీతి, అక్రమాలను కొండయ్య ఎండగట్టారు. అభివృద్ధిని విస్మరించిన జగన్ కేవలం కక్షసాధింపు రాజకీయాలను కొనాగించారన్నారు. ఆయన జిమ్మిక్కులను గ్రహించి ప్రజలు టీడీపీ కూటమికి జై కొట్టారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో చీరాల పరిధిలో ఒక్క కాలువ పూడిక తీయక పోవడంతో రైతన్నలు సాగుకు ఇబ్బందులు పడినట్లు వివరించారు. కూటమి అధికారంలోకి రావడంతో వేగవంతంగా సమస్య పరిష్కరించినట్లు చెప్పారు. జగన్‌రెడ్డి హయాంలో ధాన్యం అమ్ముకున్న రైతుల కు నగదు జమకాలేద న్నారు. తల్లుల ఖాతాల్లో డబ్బులు వేస్తానని విద్యార్థులను మోసగించిన జగన్‌రెడ్డి నిర్వాకంతో ప్రస్తుతం వారు డ్రాపౌట్స్‌గా మారి జీవితాలు ప్రశ్నార్థకం అయినట్లు కొండయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ బిల్లులు ఇవ్వక పోవడంతో రోగులకు వైద్య సేవలు అందలేదన్నారు. ఇలా అన్ని రంగాల్లోనూ జగన్‌రెడ్డి అనుస రించిన తప్పుడు విధానాలతో రాష్ట్ర అభి వృద్ధి గాడితప్పిందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతూ పేదల ఆదరణ పొందుతోందని కొండయ్య తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో అంకమ్మ తల్లి

ఘనంగా అంకమ్మతల్లి తిరునాళ్ల

ఈపూరుపాలెం(చీరాల), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరుపాలెం బూదాటివారి వీధిలో వేంచేసి ఉన్న అంకమ్మతల్లి వార్షికోత్సవ తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ప్రారంభమయ్యాయి. శుక్రవారం వరకు జరిగే ఈ మహోత్సవంలో మొదటిరోజు భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు కుంకుమ పూజలు చేసి అమ్మ కృపకు పాత్రులయ్యారు. అలాగే బుధవారం గ్రామోత్సవం, గురువారం పొంగళ్లసేవ, శుక్రవారం అన్నాభిషేకం ఉంటుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు మహా రుద్రాభిషేకం

బల్లికురవ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయపాలెం గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి దేవాలయం వద్ద బుధవారం సాయంత్రం మహా శివరాత్రి సందర్భంగా నాగ సాధువులచే మహా రుద్రాభిషేకం జరుగుతుందని దేవాలయ ధర్మకర్త ధూళిపాళ్ల రామగోవిందు తెలిపారు. మట్టి శివలింగాన్ని ఏర్పాటు చేసి అభిషేకం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

అద్దంకి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. పట్టణంలో వాహనాలు వేగం తగ్గించేందుకు భవానీసెంటర్ లో మలుపు వద్ద రెండు వైపులా నామ్ రోడ్డు సిబ్బంది ద్వారా స్పీడ్ బ్రేకర్లు మంగళవారం వేయించారు. స్పీడు బ్రేకర్ల ఏర్పాటును సీఐ సుబ్బరాజు పరిశీలించారు. ఇప్పటికే ప్రధాన కూడలి ప్రాంతాలలో పెయింటింగ్‌తో జీబ్రా క్రాసింగ్ లైన్స్ వేయించారు. అదే సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు.



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపీకృష్ణ, డీటీ అర్జున్

నిల్వల్లో వ్యత్యాసాలుంటే కేసులు

చీరాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్ రైస్, ఇతర సరుకుల్లో వ్యత్యాసాలు ఉంటే కేసులతో పాటు కఠిన చర్యలు తప్పవని, వీఆర్వోలు విధిగా దుకాణాలపై నిఘా ఉంచి తనిఖీలు చేపట్టాలని తహసీల్దార్ గోపీకృష్ణ అన్నారు. మంగళవారం కార్యాలయం సమావేశం హాలులో రేషన్ డీలర్లు, ఎండీఎం ఆపరేటర్‌లు, వీఆర్వోలకు వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కడా అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీటీ అర్జున్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్లు తనిఖీ



బల్లికురవలో సీసీ రోడ్లను తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు


బల్లికురవ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం నిధులతో ఇటీవల నిర్మాణం చేసిన సిమెంట్ రోడ్లను, మురికి కాలవలను మంగళవారం ఒంగోలు క్వాలిటీ కంట్రోల్ డీఈఈ ఎంవీ శ్యాంప్రసాద్ బృందం తనిఖీలు చేశారు. బల్లికలురవ మండలం కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు, కోటవారిపాలెం, బల్లికురవ, అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాలలో చేసిన 9 వర్కులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు మిషన్ల ద్వారా తనిఖీలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు రోడ్లలో క్వాలిటీ లేకుంటే బిల్లులు నిలుపుదల చేస్తామన్నారు. రోడ్ల నిర్మాణం చేసే కాంట్రాక్టర్లు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ తనిఖీలో క్వాలిటీ ఏఈఈ సీహెచ్ శ్రీనివాస్, పీఆర్ ఏఈ మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో వసూళ్లపై విచారణకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అద్దంకి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకంలో దొంగ మస్టర్‌లతో వచ్చే డబ్బు దండుకునేందుకు అధికారులు, సిబ్బంది పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో మంగళవారం దొంగ మస్టర్‌లు... మీ ఇష్టం కథనం ప్రచురితమైంది. పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ మంగళవారం ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది తో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆం ధ్రజ్యోతి కథనాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరు, బల్లికురవ మండలాల్లో ఉపాధిపనుల్లో అవినీతిపై విజిలెన్స్ అధికారి, అడిట్ బృందంతో విచారణ చేయిస్తామని తెలిపారు. దీంతో ఇప్పటికే అద్దంకి నియోజకవర్గంలో ఉపాధిలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకొని ఉం డటం, ఇటీవల బల్లికురవలో జరిగిన ప్రజా వేదికలో కూడా పలు అవినీతి బాగోతాలు వెలుగులోకి రావడంతో ప్రస్తుతం జరిగే పనులతో పాటు గతంలో జరిగిన పనులలో మరి కొన్ని కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉండడంలో అధికారులు, సిబ్బందిలో వణుకు మొదలైనట్లు తెలుస్తుంది.

సోమశిలలో 60.045 టీఎంసీల నీరు



అనంతసాగరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి మంగళవారం 1035 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 60.045 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2850, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.


ఇళ్ల క్రమబద్ధీకరణకు

దరఖాస్తు చేసుకోండి!

● డిసెంబరు 31 వరకు గడువు : జేసీ

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఒక ప్రకటనలో కోరారు. నిరభ్యంతకర భూముల్లో 2019, అక్టోబరు 10వతేదీ కంటే ముందు భూమిని ఆక్రమించుకుని ఆర్‌సీసీ స్లాబ్ లేదా రేకులతో ఇల్లు నిర్మించుకుని నివాసం ఉండేవారు రెగ్యులరైజ్ చేసుకోవడానికి ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మీసేవ, గ్రామ, వార్డు సచివాలయం ద్వారా ఈ ఏడాది డిసెంబరు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గుడిసెలు, తాటాకు పూరిళ్లకు ఇది వర్తిసుందన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామని పేర్కొన్నారు. రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తామని వివరించారు.

● 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించక్కర్లేదని తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి 151 నుంచి 300 గజాలలోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలని పేర్కొన్నారు. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న వారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. ఇదే విభాగంలో దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారు 200 శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు కట్టవలసి ఉంటుందన్నారు. 450 గజాలకు మించి ఆక్రమణలలో ఉన్నవారు బేసిక్ ధరకు ఐదు రెట్లు, వందశాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుందని తెలిపారు.



పొగాకు వేలం కేంద్రాలు

మార్చి 10, 19 తేదీల్లో ప్రారంభం

కందుకూరు : ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని పొగాకు వేలం కేంద్రాలను మార్చి 10, 19 తేదీలలో ప్రారంభించనున్నారు. మంగళవారం గుంటూరులోని పొగాకుబోర్డు కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కందుకూరు 1, కొండపి, పొదిలి, ఒంగోలు 1 వేలం కేంద్రాలు మార్చి 10న ప్రారంభించనున్నారు. కందుకూరు 2, డీసీ పల్లి, కలిగిరి, కనిగిరి, టంగుటూరు, ఒంగోలు 2, వెల్లంపల్లి వేలం కేంద్రాలు మార్చి 19న ప్రారంభం కానున్నాయి. గుంటూరులోని కేంద్రకార్యాలయంలో పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన రైతులు మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు సాగువ్యయం పెరిగినందున గత సంవత్సరం కన్నా కనీసం 20 శాతం అదనంగా సరాసరి ధర దక్కేలా వేలం ప్రక్రియను నడిపించాలని, వాతావరణ ఆధారిత వ్యవసాయ బీమా ప్రధానమంత్రి ఫసల్ యోజనలో పొగాకు పంటకు కూడా స్థానం కల్పించేలా బోర్డు చర్యలు తీసుకోవాలని కోరారు.



నెల్లూరు : విద్యుద్దీప వెలుగుల్లో మూలస్థానేశ్వరస్వామి ఆలయం

ఓం నమఃశివాయ!

● నేడు శివరాత్రి పర్వదినం ● ముస్తాబైన శైవక్షేత్రాలు

ఆది మధ్యాంత రహితుడు, సృష్టి స్థితి లయకారకుడు పరమేశ్వరుడు. భక్తితో కొలిచినంతనే కోరిన వరములిచ్చే భక్తసులభుడు ఆ సర్వేస్వరుడు. అభిషేకప్రియుడైన మహాదేవుడు లింగరూపంలో ఉద్భవించిన పర్వదినమే మహాశివరాత్రి. ఈ పండుగ కోసం జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. బుధవారం వేకువజాము నుంచే అన్ని ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలకు ఏర్పాట్లు చేశారు. అర్ధరాత్రి నుంచి లింగోద్భవ అభిషేకాలు జరగనున్నాయి. శివరాత్రి రోజున హరనామస్మరణ, బిల్వార్చన, రుద్రాభిషేకంతో పాటు భక్తులు ఉపవాస దీక్షను ఆచరిస్తారు. సముద్ర, నదీ స్నానాలు చేస్తారు. రాత్రి జాగారం చేస్తూ పురాణ పఠనం, శివనామ జపం చేస్తారు. కాగా, జిల్లాలోని పలు ప్రముఖ ఆలయాల్లో ఇప్పటికే శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.



నెల్లూరు : రావణాసురుడిపై కొలువుదీరిన ఆదిదంపతులు

● మూలస్థానేశ్వరుడికి రావణసేవ

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో జరుగుతున్న శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు వెండి రావణుడిపై కొలువుదీరి దర్శనమిచ్చారు. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమం, విశేష అలంకారం, అర్చనలు జరిగాయి. చప్పర ఉత్సవం, సాయంత్రం పూలంగిసేవ, ఆ తర్వాత ఆదిదంపతులకు కుంభహారతులు కనుల పండువగా జరిగాయి. భక్తుల శివనామస్మరణలతో మారుమోగాయి.

● పటిష్ట భద్రత

నెల్లూరు (క్రైం) : మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని శివాలయాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ జి కృష్ణకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలు, రథోత్సవాలు, ఘాట్లు, తీర ప్రాంతాల వద్ద భద్రత కట్టుదిట్టం చేశామని, దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో ఆలయాలను సందర్శించుకోవాలని, నిర్దేశిత ప్రాంతాల్లోనే వాహనాలు పార్కింగ్ చేయాలని సూచించారు.

ప్రైవేటు కళాశాలల గుర్తింపునకు

దరఖాస్తుల ఆహ్వానం

● ఈ నెలాఖరులోగా సమర్పించాలి : ఆర్ఐవో

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నీ ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి 2025-26 విద్యా సంవత్సరానికి అఫిలియేషన్, రెన్యువల్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు అదనపు సెక్షన్లు, కోర్సులతో పాటు ద్వితీయభాష లేదా మీడియాన్ని, ప్రదేశాన్ని, మేనేజ్‌మెంట్‌ను కూడా మార్చుకోవచ్చన్నారు. అలాగే కళాశాల మూసివేయడానికి, పునఃప్రారంభించడానికి, ఎఫ్‌డీఆర్‌ను విడుదల చేసుకునేందుకు కూడా ఇంటర్‌బోర్డు అవకాశం కల్పిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఆయా కళాశాలల యాజ మాన్యాలు సంబంధిత పత్రాలను ఆన్‌లైన్ అఫిలియేషన్ మేనేజ్‌మెంట్(ఓఏఎంఎస్) ద్వారా ఈనెల 28, లోగా దరఖా స్తు చేసుకోవాలన్నారు. నిర్ణీత ఫీజు చెల్లించి అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాల న్నారు. ఇంటర్‌బోర్డులోకానీ, ఆర్ఐవో కార్యాలయంలోకానీ నేరుగా స్వీకరించరని, ఒకసారి బోర్డుకు చెల్లించిన ఫీజును తిరిగి ఇవ్వడం, సర్దుబాటు చేయడం వీలు కాదన్నారు. గతం లో గుర్తింపు రెన్యువల్ చేసుకోని కళాశాలలు కూడా ఏడాదికి రూ.50వేలు చొప్పున చెల్లించి రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. కండిషనల్ గుర్తింపు పొందిన కళాశాలలు మూడు నెలల్లో లోటుపాట్లను సరిచేసుకుని సంబంధిత ధ్రువపత్రాలను అందచేయాలన్నారు. లేని పక్షంలో నిర్ణీత గడువు తరువాత రూ.50వేల పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసిన కళాశాలలను తనిఖీ కమిటీ సందర్శించి, అందించే నివేదిక ఆధారంగా అనుమతులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. బోర్డు నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండా కళాశాలలు అదనపు సెక్షన్‌లు నిర్వహించినా, ప్రవేశాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మరిన్ని వివరాలకు స్టోన్‌హౌస్‌పేట కేవీసీ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఇంటర్‌బోర్డు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

కాంప్లెక్స్‌లకు కాసులు

- ఒక్కోదానికి రూ.1 లక్ష చొప్పున విడుదల
- జిల్లాలో 136 క్లస్టర్-ఏ కాంప్లెక్స్‌లు
- క్లస్టర్-బీలో 117.. త్వరలో వీటికీ నిధులు
- కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పనితీరును మెరుగుపరిచేందుకు స్కూల్ కాంప్లెక్స్‌లను పునర్వ్యవస్థీకరణ చేశారు. పాఠశాలలు, ఉపాధ్యాయులపై అజమాయిషీ బాధ్యతను సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అప్పగించారు. జిల్లాలో గతంలో ఉన్న 253 స్కూల్ కాంప్లెక్స్‌లలో స్వల్పమార్పులు చేపట్టి 136 క్లస్టర్-ఏ కాంప్లెక్స్‌లుగా మార్పు చేశారు. వీటికి గత వైసీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.25వేలు ప్రకటించినా ఏడాదిలో చివరిలో లేదా రెండేళ్లకు ఒకసారి విడుదల చేసేవారు. దీంతో హెచ్‌ఎంలు సొంతంగా ఖర్చు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పరిస్థితుల్లో పూర్తిగా మార్పు రావడంతోపాటు ఒక్కో కాంప్లెక్స్‌కు లక్ష రూపాయల చొప్పున విడుదల చేశారు.

● రూ.1.36 కోట్లు విడుదల

జిల్లాలో ఇప్పటివరకు 253 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా వీటిలో మార్పులు తీసుకువస్తూ ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో 800 నుంచి 1000 మంది విద్యార్థులు, 40-50 మంది ఉపాధ్యాయులు ఉండేలా క్లస్టర్-ఏలుగా పేరు మార్చి జిల్లాలో 136 కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేశారు. మిగిలిన 117 కాంప్లెక్స్‌లను క్లస్టర్-బీలుగా మార్పు చేశారు. వీటికి కూడా త్వరలో నిధులు విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడికి పలు బాధ్యతలు అప్పగించి తన పరిధిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పర్యవేక్షణను ఆయనే చూసుకునేలా ఉత్తర్వులిచ్చారు. 136 క్లస్టర్-ఏ స్కూల్ కాంప్లెక్స్‌లకు ఒక్కో దానికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.1.36 కోట్లు విడుదలయ్యాయి.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు
- వివరాలు 6లో..

బరితెగింపు!

● ఇరిగేషన్ స్థలంపై వైసీపీ నేతల కన్ను ● 50 అంకణాల భూమి.. విలువ రూ.10కోట్లు
● పార్టీ కార్యాలయాన్ని నిర్మించే ప్రయత్నం ● పనులను అడ్డుకున్న అధికారులు

నెల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : 'మాకు అడ్డేంటి అనుకున్నారో లేదా మమ్మల్ని అడిగే దమ్ము ఎవరికి ఉందని భావించారో తెలియదు గానీ నెల్లూరు నగర నడిబొడ్డున వైసీపీ నాయకులు ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేశారు. హరనాథపురం కూడలి ప్రాంతంలో దాదాపు రూ.10 కోట్లు విలువ చేసే సుమారు 50 అంకణాల స్థలంలో వైసీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయం నిర్మాణానికి పూనుకున్నారు. వారం రోజుల క్రితం వైసీపీ రూరల్ ఇన్‌చార్జ్ ఆనం విజయకుమార్‌రెడ్డి ఈ స్థలంలో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి వేగంగా ప్రహరీ నిర్మాణం జరుగుతోంది. ఈ విషయంపై మంగళవారం ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించిన అధికారులు.. ఆ స్థలం కాలువ పోరంబోకుగా ప్రాథమికంగా నిర్ధారించుకొని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు సర్వే చేసి వైసీపీ కార్యాలయం నిర్మిస్తున్న స్థలం ఇరిగేషన్‌కు చెందినదిగా తేల్చారు. అసలు భవనం నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవని గుర్తించారు. ఆ వెంటనే ఇరిగేషన్ అధికారులు సదరు స్థలంలో 'ఈ స్థలం ఇరిగేషన్‌కు చెందినది'గా బోర్డు పెట్టారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో నెల్లూరు ఇన్చార్జి ఆర్డీవో వంశీకృష్ణ వచ్చి ఆ స్థలాన్ని పరిశీలించారు. అక్కడే రెవెన్యూ అధికారుల ద్వారా సర్వే నిర్వహించారు. ఆ స్థలం గుండ్లపాలెం కాలువ, సర్వేపల్లి కాలువల మధ్యలో ఉన్న కాలువ పోరంబోకుగా నిర్ధారించారు. అయితే వైసీపీ నాయకులు మాత్రం అధికారుల వాదనను ఖండించారు. ఇది ఇరిగేషన్ స్థలం అయినా తమకు వందేళ్ల లీజుకు ఇచ్చినట్లు చెప్పారు. అయితే ఆ లీజు డాక్యుమెంట్లను చూపించాలని అడిగితే బుధవారం చూపిస్తామని చెబుతున్నారు.



ఇరిగేషన్ స్థలంలో బోర్డు నాటి పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

● గతంలోనే వివాదం?

నెల్లూరులోని హరనాథపురం వద్ద సర్వేపల్లి కాలువ నుంచి గుండ్లపాలెం కాలువ చీలుతుంది. ఈ రెండు కాలువల మధ్యలో సర్వే నెం.893లో కాలువ పోరంబోకు స్థలం ఉంది. ఇక్కడ చాలా కాలం నుంచి కొంత మంది పేదలు గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. వీటి పక్కనే గతంలో ఓ రైస్ మిల్లు ఉండేదని చెబుతున్నారు. ఆ స్థలంలోనే ఇప్పుడు వైసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ వివాదాస్పద స్థలంపై వైసీపీ ప్రభుత్వంలోనే ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. కొందరు దొంగ లీజు డాక్యుమెంట్లతో రూ.కోట్లు విలువైన స్థలాన్ని ఆక్రమించుకొని ఉన్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ కూడా జరిగింది. కలెక్టరేట్‌లో గానీ ఇటు ఇరిగేషన్ కార్యాలయంలో గానీ లీజుకు సంబంధించి ఎటువంటి డాక్యుమెంట్లు లభ్యం కాలేదు. దీంతో అప్పట్లోనే ఇరిగేషన్ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని అధికారులు ప్రయత్నించినా నాడు వైసీపీ ముఖ్య నేతలు అడ్డుకున్నట్లు ఇరిగేషన్ అధికారులు గుర్తు చేస్తున్నారు. ఒకవేళ లీజు డాక్యుమెంట్లు ఉంటే ఎందుకు బయటపెట్టడం లేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సాధారణంగా ఇరిగేషన్ స్థలాలను లీజుకు ఇవ్వరని, ఒకవేళ ఇచ్చినా ఒక పర్పస్ కోసం మాత్రమే ఇస్తారని ఇరిగేషన్ వర్గాలు చెబుతున్నాయి. ఆ పర్పస్ ముగియగానే తిరిగి స్వాధీనం చేసుకునే అధికారం తమకు ఉంటుందని అంటున్నారు. అయితే హరనాథపురం వంటి ప్రధాన కూడలిలో కాలువ పోరంబోకు స్థలంలో ఏ ధైర్యంతో వైసీపీ నేతలు కార్యాలయాన్ని నిర్మిస్తున్నారన్న చర్చలు జరుగుతున్నాయి. కాగా ఈ వ్యవహారంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను వివరణ కోరగా ఆ భూమి ఇరిగేషన్‌దేని స్పష్టం చేశారు. అవతలి వ్యక్తులు లీజు డాక్యుమెంట్లు ఉన్నట్లు చెబుతున్నారని, వాటిని ఇవ్వాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఈ డాక్యుమెంట్లు పరిశీలించాక నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

సృజనాత్మకతకు పదును పెట్టాలి
వివరాలు 6

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

● మొదటి మూడు స్థానాల్లో కడప ● 4, 5, 6 స్థానాలు బాపట్ల జిల్లాకు.. ● జనంతో కిక్కిరిసిన గండవరం

కొడవలూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండవరంలో వెలసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం గంగా పార్వతి సమేత ఉదయకాళేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నెల్లూరు నగర టీడీపీ పరిశీలకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. వీటిని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒంగోలు, బాపట్ల, చిత్తూరు, కడప జిల్లాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో గండవరం వీధులు కిక్కిరిశాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 9 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహుమతి రూ.లక్షను కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దొరసాల గురవారెడ్డికి చెందిన ఎడ్లు కైవసం చేసుకోగా రెండు, మూడు స్థానాల్లో కడప జిల్లా మైదుకూరు చెందిన వెంకటేష్, కుర్ర వెంకటేష్, నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో బాపట్ల జిల్లాకు


గండవరంలో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలు

చెందిన సాయిగణేష్, మారుమూల సుబ్బారెడ్డి, బాపట్ల వీరస్వాముల ఎడ్లు దక్కించుకున్నాయి. విజేతలకు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి బహుమతులు అందజేశారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయన చైర్మన్ ఆలం మాలకొండయ్య, కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


సృజనాత్మకతకు పదును పెట్టాలి

● క్రాఫ్ట్, డ్రాయింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

సంగం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతకు పదును పెట్టందుకు పాఠశాల స్థాయిలోనే కృషి చేయాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య సూచించారు. మంగళవారం ఆయన పీఎంశ్రీ పథకంలో ఎంపికైన స్థానిక జీబీకేఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో లోకాస్ట్ - నో కాస్ట్‌తో విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తక్కువ ఖర్చుతో వ్యర్థాలతో తయారు చేసిన పలు రకాల బొమ్మలు, ప్రయోగాలను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు ఆటా, పాటా, డ్రాయింగ్, క్రాఫ్ట్‌లో శిక్షణ ఇచ్చి వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం చేపట్టిందన్నారు. ఈపథకంలో


క్రాఫ్ట్, ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఏపీసీ వెంకటసుబ్బయ్య

జిల్లాలో 42 ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయన్నారు. పదవ తరగతిలో పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు 100 రోజుల ప్రోగామ్ నిర్వహిస్తున్నామని, ఈ ప్రోగ్రామ్‌లో ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో జానకిరామ్, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శివ పూజకు వేళాయె!

● నేడు మహాశివరాత్రి ● శైవక్షేత్రాల్లో విస్తృత ఏర్పాట్లు



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పర్వదిన వేడుకలకు జిల్లా ముస్తాబయ్యింది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన శైవక్షేత్రాల్లో బుధవారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరగనున్నాయి. భోళా శంకరుడైన శివుడి కృప పొందాలని ప్రతి ఒక్కరూ ముక్కంటిని ఆరాధిస్తారు. అలాగే ఆదిదంపతుల కల్యాణం కూడా జరగనుంది. శివరాత్రి రోజున బిల్వార్చన నదీస్నానం, సముద్రస్నానం, ఉపవాసం, జాగారణం, శివలీలా కథా పారాయణం వంటి కార్యక్రమాలు జరుగుతాయి. శివపార్వతుల కల్యాణం జరిగిన రోజు, శివుడు శివతాండవం చేసింది. శివరాత్రి నాడే. జిల్లాలోని అన్ని శైవ ఆలయాల్లో శివరాత్రి వేడుకలకు భారీ ఏర్పాట్లు జరిగాయి. అలాగే సముద్ర స్నానాలకు రామాయపట్నం, తుమ్మలపెంట, ఇస్కపల్లి, రామతీర్థం, మైపాడు, కాటేపల్లి, కోడూరు బీచ్‌ల వద్ద పోలీసుశాఖ తీర ప్రాంత గస్తీ బృందాలు బందోబస్తులు ఉన్నాయి. నగరంలోని మూలస్థానేశ్వరాలయం, సుందరేశ్వరస్వామి ఆలయం, నీలకంఠేశ్వరాలయం, నవాబుపేట మల్లేశ్వరస్వామి ఆలయం, ఉస్మాన్‌సాహెబ్ పేట కాశీవిశ్వనాథస్వామి ఆలయం తదితర శివాలయాల్లో శివరాత్రి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. గండవరం ఉదయకాళేశ్వర స్వామి, కాటేపల్లి శ్రీకామాక్షి సమేత చంద్రశేఖర స్వామి, మైపాడు, కోడూరు, కృష్ణపట్నం సిద్ధేశ్వర వేణుగోపాల స్వామి, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, భైరవకోన, జొన్నవాడ కామాక్షితాయి ఆలయం ఇలా అన్ని శైవక్షేత్రాలలో శివరాత్రి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేశారు.

సరిహద్దుల్లో ముస్తాబు


భైరవకోనలో ఒకే రాతిలో మలిచిన నవ శివాలయాలు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రాంతంలో బుధవారం జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ఘటిక సిద్ధేశ్వరం, భైరవకోన క్షేత్రాలను నిర్వాహకులు ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అలాగే ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో శివాలయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు.

● ఘటికసిద్ధేశ్వరం

ఈ క్షేత్రం అత్యంత ప్రాచీనమైంది. దారి పొడవునా పారే సెలయేళ్లు, ఆహ్లాదకర వాతావరణంతో ప్రకృతి రమణీయంగా ఉంటుంది. ఘటిక సిద్ధేశ్వరంలో శివునికి అత్యంత ఇష్టమైన బిల్వపత్రాలు ఉన్నాయి. ఈ పత్రాలతో భక్తులు పూజలు నిర్వహిస్తుంటారు. ఘటికసిద్ధేశ్వరంలో ప్రతిరోజు రాత్రి సమయాల్లో శివుని విగ్రహం చుట్టూ ఓ సర్పం ప్రదక్షణలు చేస్తుంటుందని చరిత్ర చెబుతుంది. క్షేత్రంలో ఏడాది పొడవునా నందినోట జలధార వస్తుండడం మరో విశేషం.


ఘటికసిద్ధేశ్వరంలో ఏకశిల ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

● కోటిలింగాలకోన భైరవకోన

మూడు పర్వతాలకు మధ్యనున్న ఈప్రాంతంలో ఎంతో ప్రశాంతంగా ప్రకృతి అందాలతో రమణీయంగా ఉంటుంది. బ్రహ్మ, రుద్ర, విష్ణు పర్వతాలని ఆ మూడు కొండలను పిలుస్తారు. వాటి నడుమనున్న భైరవకోనకు క్షేత్రపాలకుడిగా బాలభైరవుడని చెబుతారు. భైరవుడు బాలుడు కావడంతో దుర్గాదేవి అక్కడికి వచ్చిందని, భార్గవ ముని తపస్సు మూలంగా శివుడు భర్గేశ్వరుడిగా వెలిశాడని చెబుతారు. భైరవ, దుర్గ, భర్గులకు 128 ఆలయాలు నిర్మించారని, కోటి లింగాలను అక్కడ ప్రతిష్ఠించారని చారిత్రక కథనం. అప్పట్లో వెలిసిన 128 ఆలయాలు కాలగర్భంలో కలిసినా ఏకశిలలో తొలిచిన గుహలో ఉన్న నవ లింగాలయాలు నేడు దర్శన మిస్తాయి. కొండలపైనుంచి జాలువారే జలపాతంలో స్నానమాచరిస్తే పాపాల నుంచి విముక్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఉత్సవాల సందర్భంగా ఆర్టీసీ సైతం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

కోరిన కోరికలు తీర్చే కరుణామయులుగా..


జొన్నవాడ ఆలయం

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): అశేష భక్తుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కరుణామయులు మల్లికార్జునస్వామి, కామాక్షితాయి దంపతులు. 2వ శతాబ్దానికి పూర్వమే పవిత్ర పెన్నానదికి ఉత్తర ఒడ్డున జొన్నవాడ (రజితగిరి) పుణ్యక్షేత్రంలో కశ్యప్రజాపతి యజ్ఞంతో స్వామివారు స్వయంభువుగా, ఆదిశంకరాచార్యులచే అమ్మవారు పునఃప్రతిష్ఠతో కొలువై భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారుగా జొన్నవాడ క్షేత్రం అలరారుతోంది.

● 2 రోజులే అభిషేకాలు

యేటా శివరాత్రి పర్వదినాన లింగోద్భావకాలంలో, నవరాత్రి మహోత్సవాలలో మహర్నవమి రోజున రాత్రి వేళ మల్లికార్జునుడికి దక్షిణావృత శంఖముతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్ర వారాభిషేకం, కామాక్షితాయికి శ్రీసూక్త విధానంతో (పులకాపు) అభిషేకం నిర్వహిస్తారు. ఈ 2 రోజులు పరమ పవిత్రమని ఆలయ పురోహితుడు శ్రీధర్‌శర్మ తెలిపారు. పవిత్ర పెన్నానదిలో స్నానం చేసి ఈ పూజల్లో పాల్గొన్నా, ఆలయంలో నిద్రించినా సకలపాపాలు, రుగ్మతలు, బాధలు తొలగి అనంతకోటి పుణ్యం లభించడంతో పాటు కోరిన కోరికలు నెరవేరుతాయని ప్రతీతి.

● విస్తృత ఏర్పాట్లు

జొన్నవాడ ఆలయానికి తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రి ఆలయంలో లింగోద్భవకాల పూజలతో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్ర వారాభిషేకంతో స్వామివారికి పంచామృత అభిషేకం, శ్రీసూక్త విధానంతో అమ్మవారికి (పులకాపు) అభిషేకం నిర్వహించనున్నారు. భక్తుల కోసం పండరి భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసాదములు, అన్నదాన సదనంలో భోజనాలు, మజ్జిగ, మంచినీరు, చలువపందిళ్ళు తదితర ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఈఓ ఏవీ.శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

రామతీర్థంలో ఏర్పాట్లు పూర్తి


విద్యుద్దీప వెలుగుల్లో రామలింగేశ్వరస్వామి ఆలయం

విడవలూరు : ప్రముఖ శైవక్షేత్రమైన రామతీర్థంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామికి ఉదయం అభిషేకాలు, రాత్రి లింగోద్భావకాల అభిషేకం, స్వర్ణ నందిసేవ జరుగుతుందని తెలిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తారని, శివరాత్రి రోజున జాగరణ చేసే భక్తులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో, సముద్ర తీరంలో ఎస్‌ఐ నరేష్‌కుమార్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాటేపల్లి శివాలయం


ముస్తాబైన కాటేపల్లి శివాలయం

తోటపల్లిగూడూరు : మండలంలోని కాటేపల్లిలో కొలువైన కామాక్షిదేవి సమేత చంద్రశేఖరస్వామి ఆలయం ముస్తాబయింది. ఈ ఆలయంలో బుధవారం నుంచి 28వ తేదీ వరకు శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేలాది మంది భక్తులు శివరాత్రి రోజున స్వామి వారిని దర్శించుకుని ఆలయంలో జాగరణ చేసి వేకువజామున సాగర తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఆలయ ప్రాంగణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ వీరేంద్రబాబు తెలిపారు. కాగా భక్తుల రాకపోకలకు నెల్లూరు నుంచి కాటేపల్లికి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు.

బ్రహ్మదేవంలో..


ముత్తుకూరు : విద్యుద్దీప వెలుగుల్లో సిద్ధేశ్వరస్వామి ఆలయం

ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పురాతన కృష్ణపట్నం సిద్ధేశ్వరస్వామి ఆలయం, బ్రహ్మదేవంలోని కైలాసనాథేశ్వర స్వామి ఆల యం ముస్తాబవుతున్నాయి. మంగళవారం ఆలయ ప్రాంగణాల్లో చలువ పందిళ్ల వేయడంతోపాటు విద్యుత్ దీపాలంకరణ పూర్తి చేశారు. భారీ సంఖ్యలో వచ్చే భక్తుల కోసం సకల ఏర్పాట్లు చేశారు. కృష్ణపట్నం సిద్ధేశ్వ రాలయంలో బుధవారం రుద్రాభిషేకాలతో మొదలై అమ్మవారికి పూలంగి సేవ, స్వామి వారికి నందిసేవ జరుగుతుంది. గురువారం శాంతిలీలా కల్యాణం, గ్రామోత్సవం, శుక్రవారం 27 రకాల విశేష ద్రవ్యాభిషేకం, అన్న లింగ ప్రతిష్ఠతో మహాశివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయి. బుధవారం రాత్రి భక్తుల కోసం భారీ అన్నదానం నిర్వహిస్తున్నామని కోవూరు జనార్ధన్‌రెడ్డి తెలిపారు. అలాగే బ్రహ్మదేవంలోని కైలాసనాథేశ్వరస్వామి దేవస్థానంలో మూడు రోజులపాటు స్వామివారికి పలు రకాల అభిషేకాలు, విశేషాలంక రణలు ఉంటాయని ఆలయ వ్యవస్థాపక సభ్యులు కొత్తపల్లి రమేష్‌శర్మ తెలిపారు.

● వెంకటాచలం : మండలవ్యాప్తంగా శివాలయాలు అత్యంత సుందరంగా ముస్తాబయ్యాయి. సర్వేపల్లి, కాకుటూరు, అడవిలోని శివాలయం, కసుమూరు, కనుపూరు, ఎగువమిట్ట, పాలిచర్లపాడు, పూడిపర్తి తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే శివాలయాలను రకరకాల పుష్పాలు, విద్యుత్ అలంకారాలతో ముస్తాబు చేశారు.

సిద్ధనకొండూరులో ప్రభలే ఆకర్షణ


ప్రత్యేక ఆకర్షణలో ప్రభలు


15 అడుగుల ఎత్తయిన శివుడి విగ్రహం

కలిగిరి, (ఆంధ్రజ్యోతి) : చుట్టూ ఎత్తయిన కొండలు, ఆహ్లాదకర వాతావరణంలో సిద్ధనకొండూరు గ్రామంలోని సిద్దేశ్వరస్వామి ఆలయం సుమారు 300 సంవత్సరాల నాటిది. యేటా మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. కోటప్పకొండ తరువాత ఈ దేవాలయం వద్ద ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ అలంకారాలతో ప్రభలు కనువిందు చేస్తాయి. సిద్ధనకొండూరు కొండపై సిద్దేశ్వరస్వామి ఆలయంతోపాటు అయ్యపస్వామి దేవాలయం, గంగమ్మ, కాలభైరవుడు, చండీశ్వరుడు, ఆలయాలు ఉన్నాయి. సుమారు 15 అడుగుల శివుడి విగ్రహం ఇక్కడి ప్రత్యేకత. ప్రత్యేక అభిషేకలు, పూజా కార్యక్రమాలు జరుగుతాయి.

స్వర్ణలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాల ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ వద్ద వెలసి ఉన్న స్వర్ణలింగేశ్వరాలయంలో మంగళవారం శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, కలిశస్థాపన, ఏకరుద్రాభిషేకం నిర్వహించారు. ప్రదోషవేళ (సాయంత్రం) నందీశ్వరస్వామికి అభిషేకం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, విశేష దేవతలకు హోమాలు అర్చకులు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు పీ.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఈనెల 27 వరకు జరుగుతాయని తెలిపారు. భక్తులంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమాలను విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి, కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.


స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా సుందరేశ్వరుడికి రావణసేవ

నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలోని సుందరేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి మంగళవారం రాత్రి రావణసేవ వైభవంగా జరిగింది. ఉదయం ధ్వజారోహణ, కోడి ముద్దల నివేదన, కలిశస్థాపన, అగ్నిప్రతిష్ఠాపనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమం, మహానివేదన, మంత్ర పుష్పం, నీరాజనం నిర్వహించారు. సాయంత్రం వేద పారాయ ణం, నాద స్వర కచేరీ జరిగాయి. కుంభహారతులు, మంత్ర పుష్పనీరాజనాలు కనుల పండువగా జరిగాయి. ఈ ఉత్సవాలను జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, అర్చకులు పర్యవేక్షించారు.


మీనాక్షి సుందరేశ్వరస్వామికి నిర్వహించిన రావణసేవ

త్రివేణి సంగమమే.. సంగమక్షేత్రం


ముస్తాబయిన సంగమేశ్వరాలయం

సంగం : పెన్నానది, బొగ్గేరు, బీరాపేరు కలయికతో త్రివేణి సంగమమే సంగమ క్షేత్రంగా, దక్షిణకాశీగా పిలవబడుతున్న సంగమేశ్వరాలయం మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమవుతోంది. త్రేతాయుగంలో పరశురాముడు పాపవిమోచనార్థం ప్రతిష్ఠించబడిన 101 శివలింగంగా చరిత చెబుతోంది. గీతా జ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం జరిగే మహాశివరాత్రి వేడుకకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు వేదపండితులు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా పినాకినీ నదీస్నానంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత స్వామివారికి క్షీరాభిషేకం, శ్రీమద్భగవద్గీతా పారాయణము జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు స్వామివారికి శాంతి కల్యాణం రాత్రి 10 గంటలకు నందిసేవ, 10.30 గంటలకు లింగోద్భవకాల మహారుద్రాభిషేకం, తరువాత శ్రీ కామాక్షిదేవి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చనతోపాటు ఆలయంలో రాత్రంతా భజనతో జాగారం, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయి.

కావలి (టౌన్) : పాతూరులోని ప్రాచీన శివాలయంలో వెలసివున్న దుర్గాభ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు వేడుకగా జరగను న్నాయి. వంశపారంపర్య ఆలయ ప్రధాన అర్చకుడు శశి గురుకుల్ పర్య వేక్షణలో తెల్లవారుజాము 4గంటల నుంచే సర్వదర్శనం ప్రారం భం కానుంది. భక్తులు ఇబ్బంది పడ కుండా దర్శనం సజావుగా సాగేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం విద్యుదీపాలంకరణలో దగదగ మెరిసిపోతోంది. అర్ధరాత్రి 1గంటకు మహాలింగోద్భవం అనంతరం మహానంది గ్రామోత్సవం జరగనుంది.


కావలి: విద్యుద్దీపాలంకరణలో మెరిసిపోతున్న శివాలయం

● లింగసముద్రం : మహాశివరాత్రి పండుగకు మొగిలిచెర్లలోని దత్తాత్రేయస్వామి ఆలయం, లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద జరిగే తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తరలివచ్చే భక్తుల కోసం నిర్వాహ కులు అన్ని సదుపాయాలు పూర్తి చేశారు. ఈ ఆలయాలను విద్యుద్దీ పాలతో అందంగా అలంకరించారు. ఆలయాల వద్ద ఎలాంటి అవాంతరాలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కావలి, కందుకూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడవనున్నాయి.

ఆధ్యాత్మిక ధ్యానమే

శివలింగ పూజ



నవదుర్గల అలంకరణలో అమ్మవార్లు

● బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శివరాత్రి వేడుకలు

అల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక ధ్యానమే శివలింగ పూజ చేసినట్టని, త్రిమూర్తి శివపరమాత్మ అవతరించిన పర్వదినమే మహాశివరాత్రి అని నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక పేటలోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించే వేడుకల్లో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిత్య జలాభిషేక శివలింగం.. నందీశ్వరుడిని ఏర్పాటు స్థానికులను ఆకర్షించింది. అలాగే నవదుర్గల నడుమ వజ్రలింగంను ఏర్పాటు చేశారు. అనంతరం చేపట్టిన శాస్త్రీయ నృత్యాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో మేడా కృష్ణారెడ్డి, గుడిపాటి ప్రసాద్, నాగేశ్వరరావు, సిద్దా యానాదిశెట్టి, సిద్దా రామకృష్ణ, బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కపల్లి విశ్వేశ్వరాలయంలో బీద రవిచంద్ర పూజలు



పూజల్లో పాల్గొన్న బీద రవిచంద్ర, బీద గిరిధర్

అల్లూరు : ఇస్కపల్లి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో మంగళ వారం రాత్రి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట సోమశిల ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, సుజన దంపతులు ఉన్నారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

బిట్రగుంట : మండలంలోని ఆలయాల్లో మంగళవారం మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభించారు. నాగులవరం గంగాపార్వతి సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో గణపతిపూజ అనంతరం విగ్రహదాతలు మరసా క్రాంతి కుమార్, మాధవి దంపతులు రుద్రాభిషేక ఉభయకర్తలుగా వ్యవహరించారు. మాజీ సోమశిల పాజెక్ట్ కమిటీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, సౌజన్య దంపతులు త్రిశూల పూజ, లఘు పూర్ణాహుతి కార్యక్రమాల్లో ఉభయకర్తలు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు. విశ్వనాథరావుపేట రామస్వామిపాలెంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ముత్తు కామాక్షిరెడ్డి, సుం దరవల్లి దంపతులు పూజాభిషేక ఉభయకర్తలుగా వ్యవహరించారు.

మల్లన్నకు రావణసేవ



సంగం: రావణుడి విగ్రహంపై ఊరేగుతున్న భీమేశ్వరస్వామి

●కావలి టౌన్ : పాతూరులోని రుద్రపాద క్షేత్రంలో దుర్గా భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి వారికి మంగళవారం రావణేశ్వర వాహన సేవలందించారు. ప్రధాన అర్చకులు శశిగురు కుల్ పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో సంస్కృత అధ్యాపకు లు ఆధ్యాత్మిక ప్రవచనకర్త ములుకుట్ల సుబ్రమణ్యేశ్వరశర్మ రుద్రాక్ష మహిమ ప్రవచనం గావించారు.

●సంగం : మండలంలోని వంగల్లులో ఉన్న భీమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున భీమేశ్వరుడి రావణసేవ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని రావణాసురుడి విగ్రహంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

మహాశివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

● వైభవంగా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు
● భద్రతా చర్యల్లో పోలీసు యంత్రాంగం

ఆత్మకూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని శివాలయాలు బుధవారం మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తిచేశారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, తిరునాళ్ళతిప్పలో ఉన్న కాశీనాయన ఆశ్రమం, పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం, శ్రీనివాసేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. అలాగే మండలంలోని పలు ఆలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి.

పటిష్ట బందోబస్తు: ఆత్మకూరు సీఐ గంగాధర్

మహాశివరాత్రి సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశాం. పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే శైవక్షేత్రాల వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉంటారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళా కానిస్టేబుళ్లతో పాటు ఎన్‌సీసీ వలంటీర్లను సైతం భద్రత ఏర్పాట్లకు నియమించాం. ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, తిరునాళ్లతిప్ప దుర్గామల్లేశ్వర ఆలయాల వద్ద సీఐతోపాటు ఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, కానిస్టేబుళ్లను నియమించాం.

●ఉదయగిరి రూరల్: మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని ఆలయాలను ముస్తాబు చేశారు. ప్రధానంగా మండలంలోని గండిపాళెం జలాశయ ప్రాంగణంలో ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయంతో పాటు వరికుంటపాడు, నారసింహాపురం, పెద్దిరెడ్డిపల్లి, కాంచెరువు తదితర గ్రామాల ఆలయాలను తీర్చిదిద్దారు.



శివరాత్రి వేడుకలకు ముస్తాబైన తిరునాళ్లతిప్పలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం

●జలదంకి : స్థానిక గంగా సమేత జానకి రామలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల ఉత్సవకమిటీ సభ్యులు శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. బస్టాండ్ కూడలిలో శివపార్వతలను విద్యుత్ దీపాలతో ఉండే భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను టీడీపీ మండలాధ్యక్షుడు మధురెడ్డి, ఈఓ మస్తాన్‌బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కూరపాటి దయాకర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

కావలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా మహాశివరాత్రి వేడుకలు ఉంటాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఉపవాసాలు, జాగరణతో పరమశివుడిని పూజిస్తే మేలు జరుగుతుందన్నారు. శివపార్వతుల ఆశీస్సులతో కావలి నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిటింగ్

బిట్రగుంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం డ్వామా పీడీ గంగాభవానీ ఆధ్వర్యంలో అధికారులు ఉపాధి పనులపై బహిరంగ సోషల్ ఆడిటింగ్ నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనుల కూలీలు, మెటీరియల్‌కు సంబంధించి రూ.7.45కోట్ల పనులకు సంబంధించి ఆడిటింగ్ డీవీవో విజయలక్ష్మీ, ఏపీడీ మృదుల రికార్డులు పరిశీలించారు. వాలం టర్లు చేయాల్సిన పనిదినాలకన్నా అధికంగా వచ్చినవి, హాజరు పట్టికలో పొరపాట్లు, గణాంకంలో జరిగిన తప్పులు రూ.1.85లక్షలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రమణ్యం, ఏపీవో శ్రీనివాసులు, ఎస్‌ఆర్పీ బుజ్జి ఉన్నారు.

పక్కాగృహాల నిర్మాణం వేగవంతం చేయాలి



ఉదయగిరి రూరల్ : ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో చేపడుతున్న పక్కాగృహాల నిర్మాణం వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ రామకృష్ణ సూచించారు. మంగళవారం గండిపాళెంలోని లేఅవుట్‌లో జరుగుతున్న నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. నిర్మాణ దశలను బట్టి రోజుల వ్యవధిలోనే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని, లబ్ధిదారులు మార్చి చివరి నాటికి పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరేంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రవి, జనసేన నాయకులు షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఆర్థిక సాయం : పీడీ

కలువాయి : ప్రస్తుతం హౌసింగ్ స్కీంలోని ఎస్సీ ఎస్టీ, చేనేత వర్గాలకు చెందిన లబ్ధిదారులకు సబ్‌ప్లాన్ ద్వారా అదనపు ఆర్థిక సాయం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అయితే ఇందుకు సంబంధించి జీవో రావల్సి ఉందని జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ స్వంతంగా ఇళ్లు కట్టుకునే పేదలు యూనిట్ కాస్ట్ తక్కువగా ఉండటంతో ఇబ్బందులు పడుతు న్నారని ప్రభుత్వం దృష్టికి పోవడంతో ప్రస్తుత యూనిట్ కాస్ట్ రూ.1.80లక్షలకు అదనంగా ఎస్టీలకు రూ.75వేలు, ఎస్సీ, చేనేతలకు రూ.50వేలు అదనంగా సబ్‌ప్లాన్ ద్వారా ఆర్థికసాయం చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. జిల్లాలోని వివిధ లేఅవుట్‌లలో 160 మంది కాంట్రాక్టర్లకు అప్పగించిన 25వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకోసం ముందుగా 53 మంది క్లీన్‌చిట్ ఉన్న కాంట్రాక్టర్లు జాబితా తయారు చేసి జిల్లా కలెక్టరుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పీఎంఏవై 2.0కు జిల్లాలో ఇళ్లులేని అర్హులైన పేదలు 51వేల మందిని గుర్తించి హౌసింగ్ పోర్టల్‌లో నమోదు చేసినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే కాకర్లపై దుష్ప్రచారం తగదు : పొన్నెబోయిన

ఉదయగిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై తప్పుడు ప్రచారం సరికాదని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచల బాబు యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం తన అతిథిగృహంలో టీడీపీ నాయకులతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, గండిపాళెం జలాశయం చైర్మన్ ఏ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, బొజ్జా శ్రీనివాసులు, గడ్డం వెంకటేశ్వర్లు, తుమ్మల కిరణ్, నవాజ్, ఉప్పుటూరి పెదవెంకటయ్య, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

● దుత్తలూరు: ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై అసత్య ఆరోపణలను మానుకోవాలని మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుడు ప్రచారం నిర్వహించే నాయకులకు త్వరలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● కొండాపురం: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై అవినీతి ఆరోపణలు చేస్తే సహించేది లేదని కొమ్మి గ్రామ టీడీపీ యువ నాయకుడు అంబటి సురేంద్ర అన్నారు. ఈ విషయంపై మంగళవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎక్కడో కూర్చొని అవినీతి ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేయకుండా నిరూపిస్తే దేనికైనా సిద్ధం అన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే ఇకపై ఉపేక్షించం అన్నారు.

3లోపు ఈపంట నమోదు చేయించుకోవాలి



ఆత్మకూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ

ఆత్మకూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రబీలో వరి పంట సాగు చేసిన రైతులు మార్చి 3వ తేదీ లోపు ఈ పంట నమోదు చేయించుకోవాలని ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ కోరారు. మంగళవారం ఆమె మండలంలోని మహిమలూరు రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కోత దశలో ఉన్న వరి పంటను రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈపంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించి కావలసిన పత్రాలు అందచేసి యూనిక్ నెంబరు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో, వీఏవో, రైతులు పాల్గొన్నారు.

●ఉదయగిరి : మండలంలోని నేలటూరు, కృష్ణంపల్లి గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ షరీఫ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

5545 మందికి పీఎం కిసాన్ లబ్ధి

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : మండలంలో 5545 మంది రైతులకు పీఎం కిసాన్ లబ్ధి చేకూరినట్లు వ్యవసాయాధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం రామాపురం, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగదు జమకాని రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి తీవ్రగాయాలు

జలదంకి : జలదంకి-జమ్మలపాలెం మధ్య 167బిజి నంబరు జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జలదంకి వైపు నుంచి వస్తున్న ఆటోను కావలి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న కలిగిర మండలం నాగిరెడ్డిపల్లెకు చెందిన రాజశేఖర్ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన వాహనదారులు గాయపడ్డ యువకుడిని జాతీయరహదారి నిర్మాణ పనుల్లో ఉన్న వాహనంలో చికిత్స నిమత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సయ్యద్ లతీఫున్నీసా తెలిపారు.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ల పంపిణీ

ఏఎస్ పేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈవో కార్యాలయంలో అంగన్‌వాడీల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఎంఈవో సాయిప్రసాద్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్స్‌గా గరిసిపాటి సుబ్బయ్య, జగదీష్ కుమార్‌రెడ్డి, మేకల వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

●కలిగిరి: మండలంలో ఆరురోజులుగా జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ మంగళవారంతో ముగిసింది. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సీడీపీఓ పద్మజకుమారి మధురస్మృతిగా మామిడి మొక్క నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ జీ.సురేష్, హెచ్‌ఎం భీమేశ్వరరావు, స్కూల్ అసిస్టెంట్ సుగుణమ్మ, డీఆర్పీలు శేషగిరిరావు, లక్ష్మయ్య, మీనయ్య, గాదిశెట్టి మురళీకృష్ణ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జలాశయాలకు నిధులు కేటాయించాలి : సీపీఎం



ఆందోళన చేస్తున్న కార్మికులు

ఉదయగిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలోని పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ జలాశయాలకు నిధులు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆటోనగర్‌లో కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా పాలకులు, అధికారులు పెద్దిరెడిపల్లి, సీతారాంసాగర్ జలాశయాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టి త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

జీవో 117ను రద్దుచేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి ఆటంకంగా మారిన 117 జీవోను రద్దుచేయాలని, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ మంగళవారం మండల ఆవాజ్ కమిటీ తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేసింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, ఆవాజ్ కమిటీ సభ్యులు ఖాజావలి, విక్రమ్, ఆలంబాష, మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

మహిళా కళాకారులకు శిక్షణ

ఉదయగిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలోని చెక్కనగిషీ కేంద్రంలో సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా కళాకారులకు బిజినెస్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం సయ్యద్ ఖాజారంతుల్లా మాట్లాడుతూ కేంద్రంలోని 40 మంది మహిళా కళాకారులకు 25 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ డీఏ కార్యాలయ ప్రతినిధి నాగేంద్రప్రసాద్, కేంద్రం నిర్వాహకులు జాకీర్‌హుస్సేన్, గౌసియా పాల్గొన్నారు.

పెంచలకోన రోడ్డు మరమ్మతు పనుల ప్రారంభం

చేజర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లి నుంచి పెంచలకోన వరకు రోడ్డు మరమ్మతు పనులకు రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి దాదాపు రూ. 34లక్షల నిధులు మంజూరు చేయించడంతో సంబంధిత అధికారులు సోమవారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల ప్రజలు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సర్వేలపై సమీక్ష

సీతారామపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన మంగళవారం మండల సచివాలయ సిబ్బందితో సర్వేలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం మండల పరిధిలోని సచివాలయలలో జరుగుతున్న సర్వేలను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవి, పంచాయతీ కార్యదర్శులు రాంనాథరెడ్డి, జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ

సంగం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల డేటాఎంట్రీ, టెక్నికల్ అసిస్టెంట్‌లకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ టెక్నికల్ అసిస్టెంట్ సుమతి ధాన్యంలో తేమ, తాలు, మట్టి పెళ్లలు, ఇతర వ్యర్థాలు గుర్తించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోవ్వూరు సబ్ డివిజన్ సహకార సంఘం అధికారి సుభాషిణి, సంగం, దువ్వూరు పీఏసీఎస్‌ల సెక్రటరీలు దస్తగిరి, వెంకటరమణయ్య, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

కలువాయి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, కాపు, ఈబీసీలకు సబ్సిడీ రుణాల మంజూరుకు జరిగిన ఇంటర్వ్యూలకు 265 మంది హాజరైనట్లు ఎంపీడీవో భవాని తెలిపారు. మొత్తం 408 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 265 మంది మాత్రమే హాజరయ్యారన్నారు.

తడి, పొడి చెత్త అందించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను ఇళ్ల వద్దకు వచ్చే హరిత రాయబారులకు అందించాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. మంగళవారం ఈవోపీ ఆర్డీ కరీముల్లాతో కలిసి మండలంలోని శకునాలపల్లి, పుల్లాయపల్లి గ్రామాల్లో ఇంటింటా చెత్తసేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలం లోని చెత్త సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.